
ఆంధ్రపత్రిక


సచిత్ర వారపత్రిక



10-1-51

విషయానుక్రమణిక

10 జనవరి 1951



ఆంధ్రపత్రిక


సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును

Founder: K. NAGESWARA RAO

సంపుటము **43**
సంచిక **18**

వికృతి సంవత్సర పుష్య శుద్ధ తదియ బుధవారము



ఒకటి, రెండు, మూడు.

'స్వతంత్ర ప్రపంచం' చైనాపై వ్యాపారాంక్షలను ప్రయోగించాలని అమెరికా కోరుతున్నది.

సంస్థానాధీశుల రాగోతం

తరుచు రేసులకు వెళుతూ గుర్రాల నాణ్యం ఎరిగిన వారికి బరోడామహారాజావారి పేరు తెలియకుండా ఉండదు. గ్వాలియర్ మహారాజావారి గుర్రాల్లాగానే బరోడామహారాజావారి గుర్రాలుకూడా తమ్మ నమ్ముకొన్నవారికి అడపా దడపా త్రృణమో కణమో ఇస్తూఉంటాయి. బరోడా మహారాజావారు మనదేశంలో తన గుర్రాల్ని పరిగెత్తింగటమే కాక, తరుచు ఇంగ్లండు వెళ్లి అక్కడి రేసులను సందర్శించటమూ, పందెపు గుర్రాల్ని నాణ్యం చెయ్యటమూ చేస్తుంటారు.

అటువంటి బరోడామహారాజా వారు ఇటీవల అమెరికా వెళ్ళారు. అక్కడ ఆయన కొందరు "నిపుణుల సలహాలు" పొంది స్వదేశానికి తిరిగివచ్చారు. కాని ఆయన పొందిన సలహా ఏమిటో, దాన్ని ఆయన కిచ్చిన నిపుణు లెవరో తెలియరాలేదు. కాని ఆయన తిరిగి వస్తూనే ఆయన ఆధిపత్యంకింద సంస్థానాధీశులయూనియన్ ఒకటి ఏర్పాటుకావటం జరిగింది. మహారాజావారు అమెరికావెళ్లింది రాజకీయ నిపుణులతో సంప్రతించటానికేననీ, ఆ నిపుణు లిచ్చిన సలహాప్రకారమే ఈ యూనియన్ ఏర్పడిందనీ కొందరు అభిజ్ఞులంటున్నారు.

ఇది నిజం కూడా అయి ఉండవచ్చు. ? ఎందుచేతనంటే రాజకీయంగా మృతిచెంది దుష్టపాత్ర నిర్వహించటానికి తగు మేధాసంపద లేనివారికి సలహాలిచ్చేవాళ్లు అమెరికాలో ఉన్నారు. అమెరికా అంతర్జాతీయ రంగంలో తన శక్తిని స్వేచ్ఛగా వినియోగిస్తూ నైతికసూత్రాలనూ, రాజకీయ నిబంధనలనూ, ఆఖరుకు తాను ఆమోదించిన ఒడంబడికలనూ కూడా బుట్టదాఖలుచేస్తూ "ఇదేమిటి?" అని అడిగేవారు లేకుండా విశృంఖలంగా సంచరిస్తున్నది. అమెరికా పరివారంలో అమెరికాపద్ధతులను అనుకరించే చంగ్ కైషెక్, సింగ్మన్‌రీ మొదలైన పతిత రాజకీయవేత్తలున్నారు. ప్రపంచమంతటా యుద్ధస్థావరాలు సంపాదిస్తున్నట్టే అమెరికా ఈ గుడ్డిగవ్వలను కూడా సంపాదిస్తున్నది. అమెరికాకు ఇండియాలో యుద్ధస్థావరాలు చిక్కకపోయినా గుడ్డిగవ్వలు దొరికితే దొరకవచ్చు.

అనుమానానికి తగ్గట్టుగానే డిసెంబరు నెలాఖరున బొంబాయి టాజ్ హోటల్లో అమెరికా రాజకీయపుగాలి వీచింది. అక్కడ సంస్థానాధీశుల సమావేశం జరిగింది. రెండురోజులపాటు జరిగిన ఈ సమావేశంలో ప్రసంగిస్తూ, యూనియన్ అధ్యక్షుడైన బరోడా మహారాజా వారు కొన్ని అపూర్వమైన విషయాలు పలికారు. "మనం మన విధ్యుక్తధర్మాలను ఎలా నిర్వర్తించాలో, నూతనభారతవ్యవస్థలో మనం ఎలా ఇరకాలో ఆలోచించి సభ్యులందరూ నిష్కపటంగా, మర్మంలేకుండా సలహాలివ్వాలి," అని రాజావారు హెచ్చరించారు.

రాజుల విధ్యుక్తధర్మాలు—కనీసం, చల్లని బ్రిటిషుపరిపాలనలోసంస్థానాధీశులు నిర్వర్తించినవి - ఏవో ప్రపంచానికి తెలుసు: తమ దుష్పరిపాలనసాగించటానికి ప్రజాశత్రువులను పదవులలో ఉంచటమూ, ప్రజలను దోచిన డబ్బుతో విలాసాలు అనుభవించటమూనూ. చాలామంది సంస్థానాధీశుల జీవితాలు చూస్తే రేసుల్లో గుర్రాలు పరిగెత్తించటంకూడా కాయకష్టమేనేమోననిపిస్తుంది. సంస్థానాధీశుల యూనియనుకు గాయక్వార్ మహారాజావారు అధ్యక్షులు కావటానికి అర్హతకూడా ఈ కాయకష్టమే కావచ్చు. అయితే ఎవరికన్నా కలిగే సంకోచం ఒకటున్నది. గుర్రాలకూ, రాజకీయాలకూ తూగుతుందా అని. పనిగల రాజకీయవేత్త లెవరికీ రేసుకు వెళ్ళే తీరికే ఉండదు—రేసుల్లో గుర్రాలను పరిగెత్తించే మాట చెప్పేదేమిటి?

ఇక నూతనభారతవ్యవస్థలో మాజీ సంస్థానాధీశుల స్థానాన్ని రాజ్యాంగమే నిర్ణయిస్తున్నది. వారికి రాజకీయంగా ఏస్థానమూ లేదు. భారతరాజ్యాంగంకింద ప్రతిప్రాంతమూ, రాష్ట్రమూ ఇండియా ప్రభుత్వానికి జవాబుదారీ వహించిఉన్నది. స్వతంత్ర ప్రాంతాలుగాని, రాజపాలిత ప్రాంతాలుగాని లేవు. ఈసంగతి బరోడా మహారాజావారికి తెలియకుండాఉండటం అసంభవం. కాని తమ కిష్టంలేనివి లేనట్టూ, తమకు తెలియనట్టూ నటించటంలోనే ఉన్నది అమెరికా గాలి.

"ఉరితాడు ప్రస్తావించకు"

"ఉరితీయబడ్డవాడింట తాడు మాట ఎత్తకు" అని ఇంగ్లీషులో ఒక సామెత. కాని ఈనాడు రాజకీయాలలో ఈ మర్యాద పాటించటంలేదు. ఆసియాదోపిడికి ఫిరంగులు సాయంతెచ్చుకుంటున్నవాళ్లు ఆసియా అభివృద్ధికార్యక్రమాలు ప్రస్తావిస్తున్నారు. జాతివైషమ్యాలను రాజకీయంగా అవలంబించి హత్యాకాండలు సాగించేవాళ్లు ప్రజాస్వామికసిద్ధాంతాలను ఉద్ఘాటిస్తున్నారు. ప్రపంచాన్ని మింగజూసేవాళ్లు "స్వతంత్ర" దేశాలనుగురించి మాట్లాడుతున్నారు.

ఈ ధోరణే బరోడామహారాజావారవలంబించారు. ఆయన అన్నారు: "గతరెండేళ్లలో ఇండియాలో జరిగిన గొప్పమార్పులు చూసి మనం గర్వించాలి.. ఇందువల్ల మనలో ప్రతిఒక్కరూ గొప్పత్యాగాలు చెయ్యవలసి వచ్చింది. (ఈ త్యాగాలలోకల్లా) మిన్న అయినది, ఇండియా స్వతంత్రమైన అనంతరం దేశాన్నీ, ప్రజలనూ మరింతగా సేవిద్దామనుకున్న మన వాంఛితం భగ్నంకావటం."

ఇండియానూ, ప్రజలనూ సంస్థానాధీశులు బ్రిటిష్‌వారి హయాంలో ఎల్లా కొలిచారో చెప్పకుండా వదలటం మహారాజావారు చాలా మంచిపని చేశారు. పరాధీనతవల్ల దేశం అధోగతిలో ఉండగా, దేశప్రజలు దేశవిముక్తికొరకు చారిత్రకమైన అహింసాసమరం సాగించినకాలంలో బ్రిటిషువారి ఏజెంట్లుగా సంస్థానాధీశులు నిర్వహించినపాత్ర ప్రస్తావయోగ్యంకాదు. స్వాతంత్ర్యం లభించినఅనంతరం ఇండియాను ఏకంచెయ్యటానికి కేంద్రంలోని

కాంగ్రెసుప్రభుత్వంచేసిన యత్నాలతో కలిసిరావటానికిగాను అనేకమంది సంస్థానాధీశులకు కోరలు చూపవలసివచ్చింది. ఒకళ్ళు మాడు పగలగొట్టించుకుని గాని దారికి రాలేదు. అటువంటి సందర్భంలో సంస్థానాధీశులకు దేశభక్తి, ప్రజాభక్తి ఎప్పుడు ఏకారణాలచేత కలిగినదీ బరోడామహారాజావారు వివరిస్తే బాగుండేది.

కాని ఆయన అన్న మరొక ముక్కకు అర్థం ఊహించటం కష్టంగా ఉంది. "కాని ఈమార్పుఫలితంగా మనలో అనేకమందికి వృత్తిలేకుండాపోవటమే గాక, అనాదిగా మనకూ ప్రజలకూ మధ్య ఉంటూవచ్చిన సంబంధాలు పూర్తిగా విచ్ఛిన్నం అయి ఉండవలసిన అగత్యం కనపడదు."

సంస్థానాధీశులకు ఒకవృత్తిఅంటూ లేదు. వారికి అధికారాలు మాత్రమే ఉండేవి. అప్పుడప్పుడూ అలంకరించుకుని దర్బారులలో కనిపించటంతప్ప వారేమీ చేయలేదు. చాలామంది సంస్థానాధీశులు తమకు నిత్యమూ ఉండే విరామాన్ని ఇతరదేశాల్లో వ్యయపరిచేవారు. సంస్థానాలను దేశంతో కలగలపటంవల్ల పోయినవి వీరికి ప్రజలపై గల అధికారాలే. ఒకందుకు వారు భారత ప్రభుత్వ సంస్థానశాఖను అభినందించాలి. వారికి బాధ్యతలూ, అధికారాలూ లేకుండా చేస్తూకూడా తమ వ్యాపకాలు యథాప్రకారం నడుపుకోగలందులకు భరణాలు ఏర్పాటుచేసింది. బరోడా మహారాజా వారు ఉట్టి పుణ్యానికి ఏడాదికి ప్రజలసొత్తు 27 లక్షల రూపాయల చొప్పున తింటున్నారు. కనుక ఆయన కా విషయం తెలియనిదికాదు. పోతే తమకూ ప్రజలకూ ఉంటూవచ్చిన సంబంధాలు విచ్ఛిన్నమై పోయాయని ఈనాడు సంస్థానాధీశులు విలపించటం ఉరితీయబడ్డవాడింట తాడు గురించి ప్రస్తావించటమే. ప్రజలకూ సంస్థానాధీశులకూగల సంబంధాలు ఏనాడో తెగిపోయినట్లు సంస్థానకాంగ్రెసుచరిత్ర ఎలుగెత్తి చాటుతున్నది.

ఏమిటి వాంఛ?

ప్రజలకూ సంస్థానాధీశులకూ మధ్య దాటరాని అడ్డాలు ఏర్పడ్డాయని మహారాజావారు విచారం వెలిబుచ్చారు. దీనివల్ల సంస్థానాధీశుల జీవితం పీడకలగా మారి ఉండదన్న మాట నిజంకావచ్చు. కాని ప్రజలజీవితం పీడకలగా అయిందన్నమాట మాత్రం ఎవరూ నమ్మలేరు. కొత్త అధికారులు దుష్పరిపాలన చేస్తున్నారనికూడా, ఆయన ఆక్షేపించారు. ఇది ఒకవేళ నిజమే అయినా ఈ కొత్తపరిపాలకులను తీసివేసి ఇతరులను వేసే అవకాశమంటూ నూతనవ్యవస్థలో ఏర్పడింది. లోగడ సంస్థానాధీశులు దుష్పరిపాలన సాగిస్తే దానికి అప్పీలే లేదు.

సంస్థానాధీశులలో చాలామంది ప్రవాసంలో ఉండవలసివచ్చిందని మహారాజావారనటం హాస్యాస్పదంగా ఉన్నది. ఎందుకంటే వారు నిరంకుశులుగా ఉన్నప్పుడే తమరాజ్యాల వాతావరణం భరించలేక వారు ప్రవాసంలో ఎక్కువకాలం గడుపుతూఉండేవారు.

కడుపులో ఉన్న విషయాన్ని మహారాజావారు ఈవిధంగా బయటపెట్టారు: "మేమూ ఇతరభారతీయులలాగా దేశపుబిడ్డలమే. మమ్మల్ని కూడా దేశసేవకు నియోగించవచ్చు."

తమకు పదవులు లేవన్నదే బరోడామహారాజావారి దుగ్ధ. అయితే ఆయన సంస్థానాధీశులందరితరఫునా మాట్లాడటంలేదు. కొందరు సంస్థానాధీశులు అదివరకే ఉన్నతప్రభుత్వహోదాలు సంపాదించారు. కొందరుప్రభుత్వ రాయబారులుగానూ, ప్రతినిధులుగానూ విదేశాలలో ఉన్నారు. మరికొందరు అటువంటి ఉద్యోగాలకొరకుఅభ్యర్థులుగా ఉన్నారు. నూతనభారతంలో ఏపదవీదొరకనివాళ్లుమాత్రమే సంస్థానాధీశయూనియనులో సభ్యులుగా ఉన్నారేమో తెలియదు. అందులో 82 మందిమాత్రమే సభ్యులుగా ఉండటానికి ఇదే కారణమైనా కావచ్చు.

అవివేకం

టాజ్‌లో ఉపన్యాసాలివ్వటం వేరు, కానిది జౌనని ప్రభుత్వంతో తలపడటం వేరూనూ. ఎవరి సలహాతో చేసినప్పటికీ, బొంబాయితో బరోడా కలయిక సక్రమంగా జరగలేదని బరోడామహారాజా భారతాధ్యక్షుడికి విజ్ఞాపన చెయ్యటంమటుకు చాలా అవివేకమైన పని. సర్దారు పటేలు పోయిన తరవాత సంస్థానశాఖలో అరాజకం ప్రవేశించినట్లు బరోడామహారాజు భావించి ఉంటే ఆయన చాలా పొరపాటుబడ్డారు. ప్రభుత్వంనుంచి మహారాజుకు ఖెడీమని జవాబు వచ్చింది. ఈ కింది విషయాలు మహారాజావారి దివ్యచిత్తానికి తేబడ్డాయి.

"బరోడా మహారాజావారు తన సుష్కవాదాలతో రాజ్యాంగాన్ని తృణీకరించ యత్నించి ప్రభుత్వఆగ్రహానికి తనను తాను గురిచేసుకున్నాడు. బరోడాసంస్థానం ఇండియాతో చేరిననాడే మహారాజావారి రాజ్యాధికారం తొలిగిపోయింది. 1948 లో సంస్థానసభ మహారాజావారికి ఉద్వాసన చెప్పటానికి నిర్ణయించగా కాంగ్రెసు కేంద్రప్రభుత్వం ఆయనను కనికరించి ఆయనకు లాంఛనలూ భరణమూ ఉండనిచ్చింది. ఇప్పుడు మహారాజా పెట్టిన పేచీలు ఆకాస్తా పోగొట్టుకోవటానికి మాత్రమే తోడ్పడగలవు. అధినివేశభారతంతో తాను చేసిన ఒడంబడికలు స్వతంత్ర భారతానికి వర్తించవనటం అర్థంలేని మాట. అధినివేశభారతంయొక్క అన్ని అధికారాలూ స్వతంత్రభారతానికి సంక్రమించాయి.

బరోడామహారాజాఆశయాలు ఏమైనా అగుగాక ఈయనగాని ఇతరసంస్థానాధిపతులుగాని రాజకీయంగా తమ పాతఅధికారాలను తిరిగి సంపాదించటానికి ప్రయత్నించటం, ఇండియాప్రభుత్వం హెచ్చరించినట్లు, "ఆత్మవినాశనానికి" దారితీయగలదు. హిందూమహాసభలాగే, ప్రజాశత్రువులైన ఈ సంస్థానాధీశులు ఆత్మపరీక్ష చేసుకుని, చరిత్రను అర్థంచేసుకుని అజ్ఞాతాన్ని ఆశ్రయించటం మంచిది.

రావు.

గమనిక

సంక్రాంతిపండుగ సెలవుల కారణంగా పై వారము (17-1-51) వారపత్రిక వెలువడదు. మరుసటి పత్రిక (24-1-51) తేదీన వెలువడుతుంది.

సంపాదకుడు

కీలకసమస్య - చైనా

కొరియానుంచి చైనాకు

అంతర్జాతీయ రాజకీయ దృష్టి కొరియానుంచి చైనాకు మారుతున్నది. దీనికి కారణం, కొరియాలో ఐక్యరాజ్యబలాలకు కలుగుతున్న అపజయాల పరంపరా, దానితోపాటు ఈ అపజయాలకు చైనా సైన్యాలు కారణం కావటమూనూ. అందుచేతనే అమెరికాలో రాజకీయవేత్తలు కొరియానుగురించి మాట్లాడటం మానేసి చైనానుగురించి మాట్లాడుతున్నారు. అమెరికాచేతి కీలుబొమ్మగా వ్యవహరిస్తున్న ఐక్యరాజ్యసమితి చైనాసమస్యనుగురించి అనేకప్రతిపాదనలు చేస్తున్నది. ప్రస్తుతం లండనులో సమావేశమవుతున్న కామన్వెల్తుప్రధానులు కూడా తప్పకచైనాగురించీ, దూరప్రాచ్యసమస్యగురించీ సమష్టి నిర్ణయాలు చెయ్యగలరు.

అయితే అంతర్జాతీయ రాజకీయా "స్పాట్‌లైట్" కొరియానుంచి చైనాకు మారినంత మాత్రాన అమెరికాకష్టాలు గట్టెక్కినట్టు భావించటానికి వీలులేదు.

కొరియా ఒక్కదేశం కనక దానితో జోక్యం కలిగించుకోవటానికి అమెరికా ఎగిరిగంతు వేసింది. అమెరికాతోపాటు ఇంకా అనేకరాజ్యాలు గంతువేశాయి. అప్పటికీ అమెరికాకు తోడుగా సైన్యాలనూ, విమానాలనూ పంపిన దేశాలు బహుకొద్ది. చైనావంటి "భూతాన్ని" ఎదుర్కొనటానికి ఈ దేశాలు సమ్మతించవు. కొరియాకు సైన్యాలను పంపకుండానే అమెరికాచర్యను కొరియా విషయంలో ఆమోదించిన దేశాల సంగతి వేరే చెప్పనవసరం లేదు.

చైనాతో యుద్ధానికి దిగటానికి అమెరికా అయినా ఏమంత కాలుదువ్వటంలేదు. కాని, "ఉత్తర కొరియాదురాక్రమణను గుర్తించినంత త్వరగా భద్రతామండలి చైనాదురాక్రమణను ఎందుకు గుర్తించదు?" అని అమెరికా అడుగుతున్నది. ఇది వృథాప్రశ్న. గత జూన్‌ఆఖరులో ఉత్తర కొరియాసేనలు దక్షిణకొరియాలో ప్రవేశించగానే అమెరికా ఎవరి అనుమతీ లేకుండానే జపానులో గల తన బలాలను ఉత్తరకొరియాబలాలమీదికి పంపకం చేసింది. దక్షిణకొరియా విమోచనార్థం బయలుదేరిన అమెరికనుబలాలు ఉత్తర కొరియాబలాలను 38 వ అక్షాంశరేఖ మీదుగా చైనాసరిహద్దువరకూ తరుముకుపోయి యాలూనది మంచులో తమధ్వజాన్ని కూడా ప్రతిష్ఠించాయి. అటువంటి పరిస్థితిలో చైనాబలాలు అమెరికా, బ్రిటను, టర్కీ వగైరాబలాలను ఎదుర్కొని వెనక్కు తరుముకుంటూ వస్తున్నాయి. ఇందులో చైనాచేసిన దురాక్రమణ ఏమిటో నిర్ణయించటం సాధ్యంకాదు. దురాక్రమణ అనేదానికి నిర్వచన మేమిటో చైనా ఏదేశంపై దురాక్రమణ చేసినట్టు అమెరికా ఆపాదించదలుచుకున్నదో తెలియటంలేదు.

పరోక్షప్రక్రియ

"చైనా దురాక్రమణ చేసినట్టు తీర్మానించండి" అని అమెరికా ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలలో కొన్నింటిని కోరింది. అమెరికాఆశయం ఈ దేశాలను చైనా వ్యతిరేకయుద్ధంలోకి దింపితానుకూడా దిగటంకాదు. ఈదేశాలచేత చైనాపై ఆర్థిక ఆంక్షలు పెట్టించి, వీటికి చైనాతో గల రాయబార సంబంధాలు తుంచివేయటమే ప్రస్తుతం అమెరికా కోరుతున్నది. చైనాతో యుద్ధం చెయ్యటానికి సిద్ధంగాలేని దేశాలు చైనాను గుర్తించటం మానటానికి సిద్ధంగా ఉండవచ్చుననీ, అంతవరకు ఒత్తిడిచేసే శక్తి తనకున్నదనీ అమెరికా విశ్వాసం. చైనాను ఎదురుగా కొట్టటానికి శక్తిచాలక, గిరీశం చెప్పినట్టు, అట్నుంచి నరుక్కు రావాలని చూస్తున్నది.

కాని ఐక్యరాజ్యసభ్యులు చైనాను దురాక్రమణదారుగా నిర్ణయించటానికి పస్తాయిస్తున్నారు వారు వ్యవధి కోరుతున్నారు. అందులో చాలామంది కామన్వెల్తు ప్రధానుల సమావేశపర్యవసానంకొరకు ఎదురు చూస్తూ ఉండవచ్చు. ఈ కారణంచేత చైనాపట్ల కామన్వెల్తురాజ్యాలు అవలంబించబోయే వైఖరి అత్యంత ప్రధానంగా పరిణమిస్తున్నది.

కామన్వెల్తు దేశాలకు నాయకత్వం వహించే బ్రిటను చైనాను అదివరకే పరిగణించటం గాక, ఐక్యరాజ్య సమితిలో చైనాకు సభ్యత్వం ఇవ్వటానికి కూడా చాలా కృషి చేసిఉన్నది. చైనాను అమెరికాచేత పరిగణింపచేయటానికి కూడా చాలాయత్నాలు చేసి ఉన్నది. అట్లీ ట్రూమన్‌లు వాషింగ్టన్‌లో కలుసుకున్నప్పుడు కూడా అట్లీ చైనా సభ్యత్వం ప్రస్తావించి విఫలుడైనాడు. చైనాను గుర్తించటంగురించి ట్రూమన్ ససేమిరా అన్నాడు.

అమెరికా దృష్టిలో చైనాను గుర్తించటం అసంభవం. కమ్యూనిజం ఎక్కడ తలఎత్తినా దాన్ని తన బలంతో అణచటం అమెరికా తన విదేశాంగవిధానంగా పెట్టుకున్నది; ప్రపంచ కమ్యూనిజము మీద యుద్ధం చెయ్యటమూ, ఆ యుద్ధంలోకి సాధ్యమైనన్ని కమ్యూనిస్టేతర దేశాలను లాగటమూ లక్ష్యంగా కూడా పెట్టుకుని ఈ లక్ష్యసిద్ధికోసం కోటానకోట్లు డాలర్లు వ్యయంచేస్తున్నది. ఈ విధానాన్ని అమెరికాలోని రెండురాజకీయపక్షాలవారూ ఆమోదిస్తున్నారు. ఈ విధానాన్ని పురస్కరించుకునే దక్షిణకొరియా ప్రవేశించిన ఉత్తరకొరియాపై అమెరికా యుద్ధం ప్రకటించిఉన్నది. అటువంటప్పుడు చైనాను గుర్తించటంగాని, ఐక్యరాజ్యసమితిలో చైనాకు సభ్యత్వం కల్పించటంగాని అమెరికా చెయ్యదు.

అయినప్పుడు కామన్వెల్తు ప్రధానులు చైనాను గుర్తించటానికి సమిష్టి నిర్ణయం చేసినట్టయితే - ఇది జరగటం అసాధ్యం కాదు. ఒంటరిగా చైనాను పరిగణించి బలపరిచే దేశాలు సమిష్టిగా ఆపని చెయ్యలేకపోవు - అమెరికాకూ బ్రిటన్, ఇండియా, ఆస్ట్రేలియా మొదలైన కమ్యూనిస్టేతర రాజ్యాలకూ మధ్య ముసలం పుట్టవచ్చు. ఇది అంతర్జాతీయ రాజకీయ రంగంలో చెప్పుకోదగిన పరిణామంగా కూడా ఉండవచ్చు. లేదా కామన్వెల్తు దేశాలమధ్యనే

కొన్ని అమెరికా పక్షమూ, మరికొన్ని బ్రిటను పక్షమూ కావటం జరిగి కామన్వెల్తులోనే ముసలం పుట్టవచ్చు. అన్ని కామన్వెల్తు దేశాలూ అమెరికా ఆజ్ఞ శిరసావహించి చైనాతో గల సంబంధాలు తెగతెంపులు చేసుకోవటం జరిగేపనిగా కనపడదు.

అమెరికా దౌర్బల్యం

ఈమాట అనుకోవటానికి కొన్ని ఆధారాలు లేకపోలేదు. కొద్దిపాటి చైనా బలాలతే కొరియాలో వెన్నిచ్చిన అమెరికా చైనాతో యుద్ధం చేయలేదు. చేసే కాపరం చెరిచే రంకుమొగుడిలాగా అమెరికా ఈ దేశాలను చైనాతో సంబంధాలు వదులుకోమంటున్నదే గాని ఆతరవాత జరిగే దేమిటో స్పష్టంగా నిర్దేశించటం లేదు. ఐక్యరాజ్య సమితిలో తన పలుకుబడి వినియోగించి ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చి చేయించిన నిర్ణయాలలో ఒక్కటికూడా అంతర్జాతీయ పరిస్థితి బాగుపడటానికి గాని, కనీసం అమెరికా విజయం సాధించటానికి గాని తోడ్పడి ఉండలేదు. మార్షల్ సహాయం పొంది అమెరికా గుప్పిట చిక్కిన దేశాలపై నానాటికి అమెరికా ఒత్తిడిజాస్తి అవుతున్నది గాని తగ్గటంలేదు. ఇతరదేశాల స్వాతంత్ర్యం ఆహరించటం తప్ప తన స్వాతంత్ర్యాన్ని ఎన్నడూ కోల్పోని బ్రిటను ఈసారి స్వయం నిర్ణయమనేది లేకుండా అమెరికా నిర్ణయాన్ని బట్టి యుద్ధంలోకి దిగవలసిన దుస్థితిలో ఉన్నది. బ్రిటను చరిత్రలో ఇటువంటి దుర్గతి ఎన్నడూ లేదు. అదీకాక అమెరికా చెప్పుచేతలలో ఉండే దేశాలన్నిటిలోనూ అంతర్విప్లవం రగులుతున్నది. ప్రపంచయుద్ధం సాగిన క్షణంలో ఈ విప్లవాలు ప్రజ్వలించటం తప్పనిసరిగా కనిపిస్తున్నది.

ఐక్యరాజ్య సమితిని తనగుప్పిట ఉంచుకున్న అమెరికా తనఉచ్చులోనే తాను చిక్కి సతమతమవుతూ, తనతోటి దేశాలను సతమతంచేస్తూ, రాజకీయంగా అపజయాలు, సైనికంగా ఓటమి, ఆర్థికంగా దుర్భరమైన చిక్కులూ ఎదుర్కొంటూ, నిర్బంధసైనిక సమీకరణ, అంతులేని ఆయుధోత్పత్తి సాగిస్తూ, తనకూటమిలోని దేశాలపై ఒత్తిడిచేస్తూ, బెదిరిస్తూ పనిజరుపుకూఉంటే రష్యా, ఐక్యరాజసమితిలో ఒక్క నిర్ణయంకూడా ప్రవేశపెట్ట లేకపోయినా, రాయిలాగా కూర్చుని ఉన్నది. "ఒక్క తుపాకి పేల్చకుండా, రష్యా మనని ఆర్థికరంగంలో ఓడించగలదు. అని అమెరికనువిలేకరి ఒకడు ఏనాడో రాసినమాట అక్షరాలా నిజమవుతున్నది.

ఆంతరంగికంగా కూడా అమెరికా దౌర్బల్యాన్నే ప్రదర్శిస్తున్నది. నవంబరులో జరిగిన కాంగ్రెసు ఎన్నికల ఫలితంగా అమెరికను శాసన సభలలో రిపబ్లికనులు, డెమోక్రాట్లతో దాదాపు సరిసమానమైన బలం సంపాదించుకున్నారు. రిపబ్లికనులు బలహీనంగా ఉన్నప్పుడే విదేశాంగ విధానంలో వారిని భాగస్వాములుగా చేసుకుని "ఉభయపక్ష విధానం" అని పేరు పెట్టుకుని ఊరేగిన డెమోక్రాటు పరిపాలకులు ఇప్పుడు రిపబ్లికనుల అడుగులకు మడుగులొత్తక తప్పదు.

రిపబ్లికనుల విధాన నిర్ణాయకుడైనశెనెటర్ టాఫ్ట్ తన విధానాన్ని గురించి ప్రకటన చేస్తూ, అమెరికను బలాలను యూరపు రక్షణార్థంపంపే అధికారం ట్రూమన్‌కు లేదనీ, తమ సైనికబలాలను తాము నిర్మించుకొని (పశ్చిమయూరపు) రాజ్యాలకు అమెరికా సహాయం చెయ్యరాదనీ, అట్లాంటిక్ ఒడంబడిక "గొప్ప పొరపాటు" అనీ, కొరియాలో అప్రకటితయుద్ధం కన్న చైనామీద యుద్ధం ప్రకటించటం మేలనీ అన్నాడు.

టాఫ్ట్ ప్రకటించే విధానాన్ని కాంగ్రెస్ ఆమోదించేపక్షాన, అసలే యుద్ధఖర్చుతో కుంగిపోయే పశ్చిమయూరపు రాజ్యాలు మరింత యుద్ధఖర్చుకు ఒడిగడితేనే కాని యూరపు రక్షణపథకం అమలు జరగదు; ఐక్యరాజ్యసమితి ప్రమేయం గాని, ఇతర దేశాల ఒప్పదం గాని లేకుండా అమెరికా చైనాపై యుద్ధం ప్రకటిస్తుంది!

టాఫ్ట్ ప్రకటనవల్ల అమెరికాలోని రెండు పక్షాలకూ ఐకమత్యం లేదని స్పట్టంగా తేలుతుంది. అదీకాక రిపబ్లికనుల విధానం సర్వనాశనానికి మరింత దగ్గరదారి.

కొరియాలో యుద్ధ విరమణ

ఈలోగా ఐక్యరాజ్య సమితిలో కొరియాయుద్ధవిరమణసంఘమూ, ఆసియా, మధ్యప్రాచ్యదేశాలూ కూడా కొరియాలో యుద్ధ విరమణకు కొత్తకొత్త పథకాలు తయారు చెయ్యటం మానలేదు. కాని వారిది అరణ్యరోదనం. తనకుసభ్యత్వం లేని ఐక్యరాజ్య సమితి నిర్ణయాలను చైనా చెవిని పెట్టదు. అవన్నీ అక్రమనిర్ణయాలని చైనా ఏనాడో ప్రకటించింది, "మీరుకొరియానుంచీ, ఫోర్మోజానుంచీ మర్యాదగా పోతారా, పంపమన్నారా?" అనిచైనా ఐక్యరాజ్య బలాలను అదివరకే అడిగి ఉన్నది. చైనావ్యర్థప్రలాపాలు చేస్తున్నదని అదివరలో అనుకున్న అంచనాలు అబద్ధమైనాయి. చైనా ఈనాడు కీలకసమస్యే కాక, అమెరికా కూటమి దేశాలమధ్య పరిష్కారం కాని సమస్యగాకూడా కనిపిస్తున్నది.

రావు.



ధవరావు పబ్లిక్ వర్క్సుడిపార్టుమెంటులో సబ్ ఓవర్ సీరుగా పని చేస్తున్నాడు. జీతం నెలకి నూరు రూపాయిలే కాని, నూరు నూటఏభైదాకా పైరాబడి వుంది. అదిగాక పొలాలమీద నుంచి సాలీనా వెయ్యిరూపాయలు వస్తాయి. చీకూ చింతా లేని సంసారము. క్రొత్తగా రాధ కాపురానికి వచ్చింది. చిలకా గోరింకల్లాగు వాళ్లు సంసారం సాగిస్తున్నారు. రాధకిమాత్రం భర్త నెలకి ఇరవైరోజులు సర్క్యూటు వెళ్లుతాడని చిరాకుగా ఉండేది. గవర్నమెంటు ఉద్యోగాలలో వున్న ప్రతీవాళ్లకీ తాలుకుదారీ మొదలు డఫేదారీవరకు సర్క్యూటు తప్పదని రాధని మాధవరావు సమాధానపరుస్తూంటాడు.

విశాలంగా వుండాలని మాధవరావు మేడఇల్లు అద్దెకు తీసుకున్నాడు. రాధ వచ్చి చూచి, మీరు సర్క్యూటు వెళ్లితే నేను ఒక్కదానిని ఇంత ఇంటిలో వుండలేనండీ అని అనుటచే, తన కచేరీలో నే గుమస్తాగా పనిచేస్తూన్న గోపాలాన్ని తన యింట్లో వచ్చివుండమన్నాడు. ఇళ్లకు కరువైన ఈ రోజులలో 'ఇంతకన్నానా' అని గోపాలం తన తల్లి వెంకాయమ్మనీ, తమ్ముడు శేషగిరినీ, భార్య నరసమ్మనీ తీసుకుని మాధవరావు ఇంట్లో కాపురం వుండడానికి వచ్చాడు. ఒక్క వంటిల్లుమినహా తతిమ్మా క్రిందభాగమంతా వాళ్లకిచ్చివేసి మేడమీద తమరు వుండడానికి రాధ ఇష్టపడింది. వెంకాయమ్మగారు తనకి సహాయంగా వుంటారని రాధ సంతోషించింది. బజారు కెళ్లేపూచీ ఇకమీద శేషగిరి చూచుకుంటాడని మాధవరావు సంతోషించాడు.


రచన:

శ్రీమతి యస్. రత్నమ్మ

గోపాలం ఎంత ఘరానామనిషో శేషగిరి అంత తుంటరి. అబద్ధాల కోరూను. చదువు వంటబట్టలేదు. గోపాలం కొన్ని రోజులు ప్రయత్నంచేసి తనకు తెలిసిన చోట్ల నౌకరీ ఇప్పించాడు. కాని మూడో రోజుకల్లా పైవాళ్లతో దెబ్బలాడి చక్కా వచ్చేసేవాడు. దానితో ప్రాణం విసిగి ఏదైనా చిల్లరదుకాణం పెట్టుకోమని ఓ వందరూపాయలు ఇచ్చాడు. తలచెడ్డవాళ్లందరికీ అరువుబేరాలు పెట్టి మూడోనాటికి దివాలా తీశాడు. మాధవరావింటికి చేరుకునేనాటికి ఏ. వ్యాపారం, ఏ ఉద్యోగం లేకుండా వేగబాండ్ లాగ తిరుగుతున్నాడు. రాధకిమాత్రం ఏదైనా బజారుపని చేసిపెట్టుతూండేవాడు. అతని సంగతి పూర్తిగా తెలయక రాధ అతన్ని చూచి చాలా జాలిపడుతూండేది. ఇంచుమించు ఒక్క యీడువాళ్లగుటచే రాధ, నరసమ్మ చాలా కలసిమెలసి వుంటారు. తాను ఏ వస్తువు చేసినా అత్తచాటు కోడలని నరసమ్మకి పెట్టనిదే రాధ తినేదికాదు.

ఒకనాడు మాధవరావు సర్క్యూటువెళ్ళవలసి వచ్చింది. అంతకుమునుపే గోపాలం కూడా ఏదో పనిమీద వూరెళ్లాడు. అందునించి ప్రతీసారి రాధకి సాయం వెంకాయమ్మగారే పడుకుంటూన్నా యీసారి నరసమ్మని వెళ్లి పడుకోమంది అత్తగారు.

నరసమ్మ రాన ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ పదకొండుగంటల ...



దాకా మేలుకుని వున్నారు. వేసవి ప్రారంభం అవటంనించి ఈ ఉక్కపోత ఎక్కువగా వుందని డాబామీద తలుపు తీసిపెట్టుకుని పడుకున్నారు. గదిలో నీలంబల్బు వెలుగుతూంది పన్నెండుగంట లయింది. అంతవరకూ మేలుకుని వుండటంనించి చల్లగాలి తిరగటంనించీ వారిద్దరకూ గాఢంగా నిద్రపట్టింది

ఇంతలో దీపం ఆర్పిన చప్పుడవటమూ రాధకాలిమీద చల్లని చెయ్యిపడటమూ జరిగింది. మొదట మంచి నిద్రలో వుండటం చేత రాధ చాలా కంగారుపడింది. కాని, వెంటనే ధైర్యం తెచ్చుకుని 'ఎవరది' అని కేక వేసింది. నక్షత్రాల వెలుగు కొంచెం గదిలో పడటంనించి ఆ వచ్చిన మనిషిని గుర్తించి ఏం శేషగిరి ఎందుకిలాగ వచ్చావు అర్థరాత్రి నా గదిలోకి ఎందుకు వచ్చావు, నీకిక్కడ పనేముంది? దీపం ఎందుకు ఆర్పావు, పో కిందికి పో అని గద్దించింది.

"మరేం లేదు నేను - నేను- కింద ఏదో చప్పుడైతే భయమేసి మేడమీదికి వచ్చి మిమ్మల్ని లేపుదామని వచ్చాను. అంతే కాని మరే వుద్దేశం లేదు."

"బాగుంది తాడిచెట్టు ఎందుకెక్కావంటే దూడగడ్డికోసరం అన్నాట్ట నీలాంటి బుద్ధిమంతుడు, చెల్లాగుంది నీమాట. చాల్చాలు, నీ వేషమంతా నేను కనిపెట్టుతూనే వున్నాను. ఈమాటికి వూరుకున్నాను కాని, ఇలాగ ఇంకొకమారు జరిగితే మీ అన్నయ్యచేత చెప్పుదెబ్బలు కొట్టిస్తాను, జాగ్రత్త నాకు రించి నీ వేమనుకుంటున్నావో! బుద్ధిగా మసులుకో, పో, కిందికి పోయి పడుకో," అని నాలుగు చివాట్లు వేసింది, శేషగిరి తలవంచుకుని క్రిందికి వెళ్లిపోయాడు. తరువాత రాధ, నరసమ్మతో, "మాశావా, అక్కయ్యా! యీ దుర్మార్గుడు ఏమి చేసాడో, ఎంత ద్రోహం తలపెట్టాడో? నన్ను అల్లరిచిల్లరిదాన్ని అనుకున్నాడు కాబోలు!" అన్నది.

"అవునక్కా, వాడి వాలకం చూస్తే ఎప్పుడో ఇలాంటిపని చేస్తాడని నేను అనుకుంటూనే వున్నాను ఇంకొకమారు ఇట్లా చేయకుండా బాగా చివాట్లేశావులే. నే నేమన్నా అందామంటే అత్తయ్య నామీద విరుచుకుపడతారని నేను అంత చూస్తూ ఏమన్నా కర్మానికి ఒడిగడితే అప్పుడే కలగచేసుకుందామని వూరుకున్నాను ఇదివరకే నేను మావారితో మాచాయగా అంటే "ఆఁ పోనూ వాడు

అలాంటివాడు కాడు అని నామాట తోసి పారేశారు."

"పోదూ వా డేం చెయ్యగలడు? వాడి మొహం!"

"అలా గనకు. తాచుపాములాంటివాడు వాడిని నమ్మేందుకు లేదు."

దుస్వప్నంలాగు రాధ ఆవిషయం మరచి పోయింది.

*　　*　　*

'రేడియో' వాల్వు పాడైపోయినాయని 'రిపేర్' చెయ్యమని మాధవరావు చెప్పి నట్లు ఒక యువకుడు కొన్ని పనిముట్లు తీసుకుని వచ్చాడు. రేడియో పడకగదిలో వుంది. "శేషగిరీ నీవు కొస్త దగ్గరవుండి బాగుచేయించమ్మా" అని రాధ అడిగింది.

"లేదు వదినా నాకు కొంచెం బజారుపని వుంది. నేను వచ్చేదాకా నీవు వుంటే తరువాత నేను వస్తాను."

"సరే' అయితే" అని రాధ ఆ కుర్ర వాడిని మేడమీదికి రమ్మంది. పడకగదికి రెండుతలుపులు, రెండుకిటికీలు వున్నాయి. కిటికీలు తెరచియే వున్నాయి. ఒక తలుపు వేశివుంది. ఇంకొక తలుపు ప్రక్కగా గోడదగ్గరగా రేడియో వుంది. రేడియో పరీక్షచేయుటకు ఆ కుర్రవాడు ఒక తలుపు రెక్క చేరవేసి చూస్తూన్నాడు. పరాయి మనిషిని గదిలోపెట్టి తాను బయటకు వెళ్లి పోవడం జాగ్రత్త కాదని రాధ అక్కడనే కుర్చీలో కూర్చుని ఏవో పుస్తకం తిరగ వేస్తూంది. ఇంతలో కిటికీదగ్గర చప్పుడైంది. ఏమిటా అని రాధ తల ఎత్తి చూసే సరికి శేషగిరి తల ఎగరవేస్తూ విషపు నవ్వు నవ్వుతూ నిల్చున్నాడు. 'రా శేషగిరీ నీవు వస్తే నేను వెళ్లాలి. అని రాధ అంది.

'ఎందుకులే ఒదినా వూరికే వచ్చాను క్షమించు. నేనెందుకు' అని నవ్వేసి వెళ్లి పోయాడు. ఆ నవ్వుచూచి రాధమనస్సు కలుక్కుమంది.

*　　*　　*

ఆ రోజు తెల్లవారుఝామున మాధవ రావు సర్క్యుటునుంచి వచ్చాడు. రాధకి అతనిని చూడగానే వూరంత సంతోష మైంది. గబగబ క్రిందికి వెళ్ళి పనిమనిషిని లేపి పాలవాడికి కబురుపంపించింది. పాలు వచ్చేలోగా 'ఉప్మా' చేసి సగ్గుబియ్యం వడియాలు వేయించింది. పాలు రాగానే కాఫీ చేసి 'కాఫీ టిఫిన్ రెడీ సార్' అని కేక వేసింది. 'తినడానికి మేము రెడీ సార్' అని అతను నవ్వుతూ కిందికి దిగివచ్చాడు.

"రాధా, కేంపునించి రాగానే నీ సుకుమార హస్తాలతో చేసిన ఈకాఫీ అమృతం చప్పరించేసరికి నే పడ్డ శ్రమంతా తీరిపో తుంది. ఇంటిముఖం కాగానే మా రాధ చేసిన పదార్థాలకోసరం నోరు వూరికే వూరుతుంది. వుప్మా ఎంతలో తయారు చేశావు? జీడిపప్పుకూడా వేశావే! నీవు ఇంకొంచెం వేసుకో."

"ఎదురుగుండా వున్నంతసేపే ఈకబుర్లు. ముఖం చాటుకాగానే నేను జ్ఞాపకమే వుండను."

"ఏమి చెయ్యమన్నావు, రాధా? నాకు మాత్రం నిన్ను వదలివెళ్ళడం సరదా అనుకున్నావా? నిన్ను వదలివెళ్ళడానికి నే నెంత 'ఫీలవు'తానో నీకుమాత్రం తెలియదూ?" అని గెడ్డం పట్టుకు బుజ్జగించాడు.

"పోనీండి,నన్ను కూడా సర్క్యుటుకు తీసుకెళ్లకూడదూ? మీ కన్నీ రుచిరుచిగా వేళపట్టున చేసిపెడతాను. అయినా ఈసారి నన్ను తీసుకెళ్ళకపోతే ఒప్పుకోనండీ," అని లోలాక్కులు ఆడిస్తూ మారాంచేసింది.

"సరే, నీవు నాతోవస్తే అడగక్కర లేదు. నీవుగాని మా ఇంజనీయరుగారి కళ్ల పడ్డావంటే నిన్నొ, నా ఉద్యోగమో నీళ్లు వదలుకోవలసినదే. నాకన్నా జూనియరు లందరూ పైకి వచ్చి నేనింకా ఈ సబ్ ఓవర్ సీరులో పడివున్నాను."

"పోనిద్దురూ, మాటిమాటికీ అలా గనకండి, ఇప్పుడు మనకి లోపం ఏమిటండీ? హాయిగా రాజా రాణీలా గున్నాము," అని అంటూ 'పాన్' చుట్టి ఇచ్చింది.

"అన్నట్లు రాధా మన రేడియో బాగయిందా?"

"ఆ మొన్న నొక అబ్బాయి వచ్చి బాగు చేసి వెళ్లేడు."

"ఇదిగో చూడూ, నేను,శేషగిరి అలాగ బజారుకు వెళ్లివస్తాము. లేతవంకాయలు పంపిస్తాను. కమ్మగా ముద్దొంకాయకూర చేస్తావుగదూ?" అని బుగ్గమీద చిన్న చిటిక వేసి వెళ్లిపోయాడు.

"అబ్బ పోదురూ, మరీ చిన్నతనం ఎక్కువైపోతోంది. సరే చూడండి తొందరగా వస్తారా? దివ్యాన్నం దివ్యదర్శన మేనా?"

"ఆహా, రాణీగారి ఆజ్ఞాప్రకారం 10వ గంటకు హాజరు కాగలము."

బజారుకెళ్ళిన శేషగిరి మాధవరావులు ముందు లైబ్రరీకి వెళ్లేరు. ఇంకా లైబ్రేరి యను రాకపోవుటచే తోటలో చెట్లనీడని ఒక బెంచీమీద కూర్చున్నారు.

"ఏమిటి విశేషాలు, శేషగిరీ? మీ అన్నయ్య ఎప్పుడు వస్తాడు?"

"ఏమోనండీ! మీరు, అన్నయ్య ఇంచుమించు ఒకసారే వెళ్లేరుగదూ. అన్నయ్యగారూ, మీరు ఇలాగ కేంపులు వెళ్లిపోతారు గదా, వదినమ్మకి కష్టంగా ఉండదూ?"

"తల అమ్ముకున్న తరువాత మనకి కష్టం అంటే తప్పుతుందా?"

"అవునులెండి అయినా ఇంట్లో ఎవరూ పెద్దవాళ్లు లేకపోవడం బాగలేదండీ."

"ఏం? మీ రంతా లేరా? సాయంగా వుంటారనేగా మిమ్మల్ని పెట్టుకున్నది?"

"అవునులెండి. కాని - మేము పరాయి వాళ్లం. ఏమన్నా అంటే ఎవ రేమనుకుంటారో అని భయపడుతాము. ఎందుకైనా మంచిది మీ అమ్మగారు వచ్చివుంటే బాగుంటుంది."

"వూళ్లో గంపంత సంసారం, ఇల్లూ, వాకిలీ, గొడ్డూ గోదా వదలిపెట్టి వాళ్లు ఎలాగ వస్తారు? ఇంతకీ ఏంజరిగిం దేమిటి?"

"అజ్బే జరిగెందు కేముంది?"

"ఈవాళ కొత్తగా మాట్లాడుతున్నావు. నీ మాటలు వింటూంటే నా కేమిటోలాగుంది. ఏదో దాస్తూన్నట్లు మాట్లాడుతున్నావు."

"మరేమీ లేదుగాని రేడియో బాగు చేయడానికి మీరు వూర్లో వున్నప్పుడే రమ్మనలేకపోయారా?"

"ఏం? దానిలో తప్పేముంది?"

"అందులో తప్పేముందిలెండి. అసలు మనిషి తిన్ననైనవాళ్లయితే ఎవ రేమి చేయగలరు?" మన బంగారం మంచిదయితే కంసాలివాడు ఏం చేస్తాడు? అయినా నాకెందుకు లెండి."

"శేషగిరీ, నీమాటలు నా కర్థమవడం లేదు. నీవు చెప్పదలచుకున్న దేదో సరిగా చెప్పు."

"కొన్నాళ్లుపోతే మీకే తెలుస్తుంది. నా కెందు కొకళ్లసంగతి? ఎటునించి ఎటు ఒచ్చినా నేనే చెడ్డవాడిని. నేను చెప్పినా మీరు నమ్మరు."

"అలా గాదు, శేషగిరీ, విసిగించక సరిగా చెప్పమూ."

"నామీద మీకు కోపం వస్తుంది. మంచికిపోతే చెడ్డ వస్తుంది. మీ అపకీర్తి నా అపకీర్తి అనుకుని నా కళ్లతో చూచిన విషయం నా నోటితో చెప్పలేకుండా వున్నాను. క్షమించి నన్నిక అడక్కండి."

"చెప్పితేనేకాని వీలులేదు. చెప్పి తీరాలి."

"మరేమీ లేదు. మొన్నను మీరు వూరిలో లేనప్పుడు నీటుగా తయారై ఒక కుర్రవాడు వచ్చాడు. రేడియో బాగుచేస్తానన్నాడు. పరాయివాడుగదా నేను దగ్గర

వుండి బాగుచేయిస్తానంటే, వదినమ్మ నన్ను బజారుకు పంపి, తాను ఆ కుఱ్ఱాడు కలసి మేడమీదికి వెళ్ళేరు. నేను తిరిగి వచ్చేసరికి మీ పడకగదితలుపులు వేసివున్నాయి. నాకు అనుమానం తోచి కిటికీదగ్గరకు వచ్చి చూచేవరకూ మీరూ నేనూ నమ్మలేని దృశ్యం నాకళ్ళబడింది."

"ఆఁ ఆఁ నిజంగా? నా రాధే? నా రాధ అలాగ చేస్తుందా? నేను నమ్మలేను, శేషగిరీ!"

"పోనీండి, నమ్మకండి. అదే మాకూ కావలసినది."

"అలా కాదు. ఇన్ని దినాలుగా నాతో కాపురం చేస్తూ నామీద అమితప్రేమ కల రాధ ఈమాదిరిగా సంచరించిందంటే నేను, నమ్మలేకుండా వున్నాను. అబ్బ! నా తల పగిలిపోతూంది. ఇంత ద్రోహమా? నన్ను నేనే నమ్మలేకుండా వున్నానే. ఛీ, ఛీ! పాడు లోకము. నాకు ఇప్పుడు ఏంచెయ్యడానికి తోచకుండా వున్నది. ఏబావిలోనో పడి ప్రాణాలు విడిచేస్తాను. అంతేకాని ఈ ఆ వేదన భరించలేకుండా వున్నాను."

అని రెండు చేతులతో తల పట్టుకుని కూర్చున్నాడు.

"మాడండీ అన్నయ్యగారూ, మీకన్న చిన్నవాడినేకాని నా దొక్క మనవి వినండి. ఈవాళ సాయంకాలం వదినెమ్మని పుట్టింటికి పంపించెయ్యండి, ఆమె యెదురుగా వుంటే ఏదో అఘాయిత్యం చెయ్యక మానరు. క్రమంగా మీ వుభయుల మనస్సు మార్పు కావచ్చును. మీ మనస్సు శాంతిగా వుంటుంది. మీ రింత గందరగోళం పడతారంటే చెప్పక నేపోదును."

"మాధవరావు మౌనం వహించాడు.

"ఇంటికి పదం అన్నగారూ, చాలా ఆలస్యమైంది." ఇద్దరూ ఇంటిముఖం పట్టారు.

ధుమధుమలాడుతూ వస్తూన్న భర్తను చూచి భయపడుతూ రాధ "ఏమండీ 10 గంటలకే వస్తానని ఇంత పొద్దు పోగొట్టేరు. తలంటి పోసుకొంటారేమో నని అన్నీ సిద్ధంచేశాను. రెండు ఝాము లయిపోయింది. స్నానం చేస్తారా?" అని అడిగింది.

"నా కేమీ అక్కరలేదు. నేను ఈపూట భోజనం చెయ్యను. నీవు అన్నం తిని పైకి రా. నీతో మాట్లాడాలి," అని గబగబ పైకి వెళ్ళిపోయాడు.

"మీకు లేని ఆకలి. నాకుమాత్రం వుందా?" అని ఆ యిల్లాలు వంటింటితలుపు చేరవేశి మేడమీదికి వెళ్ళింది. పడకగదిలో వా రిద్దరూ ఏమిఘర్షణపడ్డారో ఏమో కొంతసేపటికి, "సరే, నా యిలవేల్పు వెంకటరమణమూర్తికి ఆఖరుదండము పెట్టుకుని మరీ వెళ్ళిపోతాను," అని రాధ అన్నమాటలు పైకి వినబడ్డాయి.


రాధ క్రిందికివచ్చి దేముడరుగుపై కూర్చుని దేవుడిధ్యానంలో మునిగిపోయింది.

ఇంతలో హూం-హూం అనే శబ్దం వినవచ్చింది. వీళ్ళ వైఖరి కనిపెట్టుతూన్న నరసమ్మ వచ్చి చూచి, "అత్తయ్యా-అత్తయ్యా ఇలాగ తొందరగా రాండి." అని కేక వేసింది. వెంకాయమ్మగారు వచ్చి చూసేసరికి రాధ వూగుతూ శివాలు వేస్తూంది. "ఇంత కావరమా? నే నెవరనుకున్నారు? చూడండి మిమ్మ ల్నేం చేస్తానో? వంశనాశనం చేస్తాను. హూం! నేను ఏడుకొండలవాడిని. నే నెవరో కన్నుగానరకుండా వున్నారా? నన్నే నమ్మకున్న కుస్తుల కపకారం తలపెట్టినవారిని సర్వనాశనం చేసితీరుతాను. ఏడీ ఆ ఛండాలుడు ఏడీ? పతివ్రత, నా భక్తురాలు, దానిమీద లేనిపోని మాటలు చెప్పి కాపురాలు కూలదోస్తాడా? రే పీసాటికి వాడి గతేమవుతుందో చూచుకోండి. పిలవండీ ఆ శేషగిరిని: ఏమిరా నీవు చేసిన తప్పు వొప్పుకో. హుం! వప్పుకుంటావా, లేదా? నీకు లొంగలేదని లేనిపోని మాటలు చెప్పి నమ్మిస్తావా? జరిగిన సంగతి చెప్పు, అబద్ధం చెప్తే గొంతు నులిమేస్తాను. నీబోటి పాపాత్ములపాలిటి యము డున్నాడని తెలియదేం? పంటవంటి కాపురం పడదోయా లనుకున్నావా? దుర్మార్గుడా! కాళ్లు పట్టుకుని తప్పయిందని లెంపలు వేసుకో!" అని గద్దించేసరికి శేషగిరి గడగడ వణకుతూ పోయి రాధకాళ్లు పట్టుకుని, "తల్లీ, అపరాధం అయింది. క్షమించు! యథార్థం అందరిముందు చెప్పేస్తాను. రక్షించు, తల్లీ. ఎరుగక చేసిన తప్పు. మన్నించు తల్లీ!" అని కాళ్లమీద పడి లెంపలేసుకుని ఆమెపట్ల తాను చేసిన ద్రోహమంతా చెప్పాడు.

"ఇకనైనా బుద్ధొచ్చిందా? ఇక పతివ్రతల జోలికి వెళ్ళవుగదా?" అనిన్నీ, మాధవరావుని, పతివ్రత అయిన నీ భార్య శీలాన్ని ఎన్నడూ శంకించకూ," అనిన్నీ రెట్టించిరెట్టించి అడుగుతూండగా వెంకాయమ్మగారు ఇంత కర్పూరం తెచ్చి హారతిచ్చారు. నరసమ్మ సాంబ్రాణిధూపం వేసి తడిచేత్తో రాధకళ్లు తుడిచింది. రాధ విరుచుకుని వెనకకు పడిపోయింది. ఈ హడావుడిలో మొగం చెల్లక సిగ్గుతో శేషగిరి చల్లగా జారుకున్నాడు. కొంతసేపటికి రాధకి వళ్ళు తెలిసింది. శోష వచ్చి పడిపోయినట్లు నాలిక పైకి పెట్టి, దాహమని సౌంజ్ఞచేశింది. నరసమ్మ కొంచెం చల్లటి నీళ్లు తీసుకొచ్చి గొంతుకలో పోయగానే తెప్పరిల్లి కళ్లువిప్పి చూచి తాను భర్తవొళ్లో పడుకునివుండడం గ్రహించి మెల్లగా లేవ ప్రయత్నించింది.

"లేవకు, రాధా, లేవకు, ఇంకా నీరసంగా వున్నావు. పవిత్రమైన నీ శీలాన్ని శంకించిన పాపాత్ముడిని క్షమించు. నీ నిర్దోషిత్వాన్ని సాక్షాత్ భగవంతుడే నిరూపించాడు. నా మనోదుర్బలత్వానికి నాకే సిగ్గవుతోంది," అని క్షమార్పణ కోరుకున్నాడు.

ఆనాటి రాత్రి వెంకాయమ్మగారే వారుభయులకు భోజనం పెట్టారు. ఇద్దరూ భోజనాలు కాగానే యథాప్రకారం పడకగది ప్రవేశించారు. నాటికీ నేటికీ శేషగిరి పత్తాయే లేదు. ఇంత గందరగోళానికి బాధ్యు లెవరు? దుర్మార్గుడు అని తెల్సికోనకుండా అనువిచ్చిన రాధా? దుష్టుడైన శేషగిరా? ఇన్ని దినాలుగా కాపురం చేస్తూ భార్యస్వభావం గుర్తెరుగని మాధవరావా?



ఆంధ్రపత్రిక

శ్రీ ఖరనామ సంవత్సర

పంచాంగం

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి సిద్ధాంతిగారిచే గుణించబడిన

ఈ సంవత్సరంపంచాంగంలో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం గుణింపబడిన రెండుపద్ధతుల తిథి, నక్షత్రాదులు వేర్వేరుగా చూపబడినవి.

★ కొత్తపంచాంగాలు సిద్ధమౌతున్నవి ★

ప్రతి 1-కి 0-4-0
100-కి 16-0-0
10 0-కి 150-0-0

రైలు ఖర్చులు ప్రత్యేకం.

100) కాపీలు ఒకే దఫా కొనువారి చిరునామా ముఖపత్రమున ముద్రించబడును.



వివరాలకు వ్రాయండి:

మేనేజరు-ఆంధ్రపత్రిక, మద్రాసు 1.



"నా చేతి కింత డబ్బెలా వచ్చిందో వాళ్ళకి అంతుపట్టకపోవటంతో ఆపూట వాళ్ళు తిన్న పదార్థాలన్నీ జీర్ణం చేసుకోవటానికి వీలుకాని గుండ్రాళ్లుగాను, ఆపూట చూసిన సినిమా పీడకలగాను మారి వుంటై!"

శివయ్యలాగా, ఉన్న విషయాన్నింత దాగుణంగా చెప్పటం మంచిది కాకపోయినప్పటికీ – ఇంతకంటె ఘనుడెవ్వరూ దొరకనట్టు లక్ష్మీదేవి వీణ్ణి పట్టుకు వేళ్ళాడిందంటే – అతని మిత్రులు కొద్దిపాటి కలవరం ఇలాగే పడివుంటారనుకుంటాను.

అసలు వాళ్ళిలా అనుకోవటం నాబోటి సామాన్యుల కేమీ ఆశ్చర్యం కలిగించకూడదుకూడాను. కాకపోతే, ఇదేవిషయం మానసికంగా మైనారిటీ వెళ్ళని చిరంజీవి మానవులకు సర్వసామాన్యమైన అర్థంలేని చిల్లరతగాదాలుగా ఏ కొద్దిమంది వేదాంతులకో కనపడనూవచ్చు. మరి కొందరు సంఘసంస్కర్తలకు ఇలాటి విషయాలన్నిటివెనక తవ్వితీసి సందుమలుపులో ఒక మహాసభను ఏర్పాటు చెయ్యతగ్గంత సాంఘికసమస్య దాగున్నట్లు కనపడనూవచ్చు. కాని, ఇవన్నీ వాస్తవికానికి నాలుగడుగులు పైన నిలబడి చేసే నేలవదలిన సాములని మా నాబోటివాళ్లం చప్పరించనూవచ్చు.

సరే – ఆరోజుల్లో శివయ్య ఎదురయాడంటే అతని స్నేహితులంతా భస్మాసుర దర్శనం అయినట్టు హడిలిపోయేవాళ్లు! మొహం చాటుచేసి సందుల్లోకి తప్పుకోవటాలు మొదలు, జేబుల్లో డబ్బులు కనపడకండా దాచుకోవటాలదాకా యథాశక్తిని పాటుపడేవాళ్ళు.

"మనవాడెక్కడా అయిపు లేడేరా, నిన్నా, ఇవాళ్లా?" అన్నాడు. విశ్వనాథం కిష్టమూర్తితో, ఫలహారం పూర్తి చేసి కాఫీవచ్చేలోపల.

"మిన్ను విరిగి మీదపడ్డంత ప్రమాదమొస్తే తప్పితే సాధారణంగా కనపడకుండా ఉండేమనిషి కాడుమరి!" అన్నాడు కిష్టమూర్తి చాలా తేలిగ్గా... అ అనవ...

ఇలా ఒక్కసారిగా శివయ్య రెండు రోజులుగా అదృశ్యం కావటంతో విశ్వనాథం, కిష్టమూర్తి మొదలైన మిత్రబృందం ఒకవిధంగా నిరాశపొందారు. మరీ అంత తెగబడి అనటం సాహసమేమో కాని – శివయ్యమాత్రం ఇప్పటికి అంటూఉంటాడు .. తనకు డబ్బులేదని వాళ్లని అప్పు అడుగుతూంటే వాళ్లొకవిధమైన సంతృప్తిపొందే వాళ్లని! దానికి నిదర్శనం తనకి డబ్బు రావటంఉదంతం అంటాడు పైగా.

రచన:

శ్రీ వెంపటి సచ్చిదానందశర్మ

"అంతమాత్రంచేత కేవలం వాళ్లని సంతృప్తి పర్చటానికే నేను అప్పులు అడుగుతూ ఉండేవాణ్ణనుకోనవసరం లేదు" – మానవ స్వభావాన్నిలా పరమాణువులకింద తెగనరికి పరిశోధిస్తున్నట్టు మాట్లాడేవాడు శివయ్య.

"పట్టుమని పదిరూపాయలు జేబులో వేసుకుని బజార్లోకి రావటమంటే భయంగా వుందనుకో" అన్నాడు కిష్టమూర్తి కాఫీగ్లాసు బల్లమీద పెడుతూ.

"అబ్బాయ్! నే నొక్కసంగతి చెప్తా విను – ఖర్చులు తగ్గించుకోవటానికి వీలు లేనప్పుడు చేతనైతే నాలుగురూపాయలు సంపాదన ఎక్కువయేట్టు చూసుకోవాలి; సంపాదన ఎక్కువయేమార్గం లేకపోతే ఖర్చులు తగ్గించుకోవాలి. అంతేకాని, ఎంతకాలమని ఇట్లా... వాడిదగ్గర ఐదూ, వీడిదగ్గర పదీ... ఈ జరిమానాలు! ఎంత చెట్టుకంత గాలని, ఎవ డవసరాలు వాళ్ళు తీర్చుకోవటానికే సతమతమౌతుంటే పైవాళ్ళకికూడా వెదజలటానికి ఎవరిదగ్గిరుంటుంది డబ్బు!"

విశ్వనాథం కొంచెం తటపటాయించి కృష్ణమూర్తివైపొకసారి చూసి మళ్లీ ప్రారంభించాడు. "నువ్వూ చూస్తున్నావుగా అప్పులడగడం రూపాయల్లోనుంచి చిల్లరడబ్బుల్లోకి దిగింది! ఇంతకీ వచ్చిన తిప్పలేమిటంటే ఇలాటి విషయాల్లో కరాఖండీగా ఉండటానికి వీల్లేనంత సన్నిహిత స్నేహాలు కావటమే!"...

ఇలా విశ్వనాథం ఉపన్యాసధోరణిలో చాలాసేపు మాట్లాడినప్పటికీ తన మాటల తీరు తనకే ఏదో వెలితిగా అనిపించి బాధపడ్డాడు. ఇక్కడ కృష్ణమూర్తి, విశ్వనాథానికీ సంబంధించిన ఒక విషయం గురించి చెప్పాలి. క్రిందటినెల ఇరవయ్యోతేదీ ఆ ప్రాంతాల్లో ఏదో ప్రాణావసరం వచ్చిందని పదిరూపాయలు అప్పుతీసుకున్నాడు విశ్వనాథం కృష్ణమూర్తిదగ్గర. మరి నాలుగురోజులతరవాత కృష్ణమూర్తి పెదనాన్న రెండోకొడుకుపెళ్ళికి వెడుతూ విశ్వనాథం గడియారం ఎరువుపట్టుకెళ్లాడు. మరి, ఆ గడియారం కృష్ణమూర్తిదగ్గరే పాడయిందో, లేక, విశ్వనాథందగ్గరికి వచ్చినతరవాత పాడయిందో తెలీదు కాని

దానికి కొద్దిపాటి మరమ్మత్తు అవసరం కలిగింది. అప్పటినుంచీ కృష్ణమూర్తి తను ఇచ్చిన పదిరూపాయలు తిరిగి ఇవ్వమనటానికీ, విశ్వనాథం తన గడియారం బాగు చేయించుకోవటానికైన ఖర్చు అడగటానికీ మొహం చెల్లేది కాదు; అడగకండా ఉండనూ లేకపోయేవాళ్లు. అందువల్ల అప్పటినుంచీ వాళ్లిద్దరిలో ఎవరు ఏమి మాట్లాడినా బాకీవిషయం స్వార్థాతికంగా స్ఫురింపజేస్తున్నాడేమో నని మనస్సులో బాధపడేవాళ్లు.

ప్రస్తుతం విశ్వనాథం అదే బాధకు లోనయాడు. కాని ఎలాగో తనని తానే సంబాళించుకుని, "ఆపైన ఏమైనాగాని, ఇహనించీ నిర్మొహమాటంగా వుండదల్చాను." మెడ బెణికేటంత విసురులో తలవూపాడు!

ఆ కీలక మేదో తనకికూడా ఉపదేశించమన్నట్లు కిష్టమూర్తి చెవులు రిక్కించి కొద్దిపాటి ఆసక్తి చూపాడుకాని, విశ్వనాథం ఎంతసేపు మాట్లాడినా వెనకటి విషయాలనే పునశ్చరణ చెయ్యటంతో అతని ఉత్సాహం దిగజారిపోయింది. ఇది గ్రహించినట్టి విశ్వనాథం "నువ్వే చూసావుగా .. ఈతడెవ నాదగ్గిర్నుంచి దమ్మిడీ అవతలకి కదిలితే అప్పడను. దేనికైనా హద్దూ పద్దూ అంటూ ఒకటి వుంటుంది..."


కృష్ణమూర్తి ఔననికాని, కాదనికాని ఏమీ అనలేక తనూ ప్రయత్నిస్తా నన్నట్టు తలతిప్పి ఊరుకున్నాడు.

మరి, వీళ్లింత కఠోరనిర్ణయాని కొచ్చిన తరవాత తమ మనోనిబ్బరాన్ని పరీక్షించుకోనివ్వటానికన్నా శివయ్య ఒక్కసారి అప్పు అడగకపోతే వీళ్ల కెలా వుంటుంది చెప్పండి? ఎవళ్ళనీ దమ్మిడీ అడక్కుండా తన అవసరాలన్నీ తీర్చుకోగల శ్రీమంతుడయాడు శివయ్య అని ఎవరనుకుంటారు? లేక, కోర్కెలన్నీ చంపుకుని డబ్బు అవసరమే తీరిపోయేటంత నిస్సంగుడయాడని మాత్రం ఎవరనుకుంటారు? కేవలం తన స్నేహితుల్ని అవమానపర్చాలని తప్పితే, వెక్కిరించినట్లు శివయ్య అప్పులడగటం ఎందుకు మానెయ్యాలి?

పూర్వం ఈ శివయ్య ఎక్కడ ఎదురౌతాడో నని బిక్కుబిక్కుమంటూ బజార్లోకి అడుగుపెట్టగానే గుండె గుభేలుమనేట్టు ప్రత్యక్షమయే శివయ్య మరీ నల్లపూసయిపోయాడు. పోనీ, అప్పు అడగటానికిష్టం లేకపోతే పోవచ్చు; కలిసి మాట్లాడటానికేం? స్నేహంఅంటే కేవలం డబ్బుకోసమేనా అతని ఉద్దేశం?

ఈ రెండురోజులూ ఛాతీలు విరుచుకు తిరిగారు విశ్వనాథం, కృష్ణమూర్తి...శివయ్యకి సవాలుచేస్తున్నట్టు. రూపాయలు గలగలాడించుకుంటూ శివయ్యముందు నిలబడితే తను ఆ మోతకి బెదిరి పారిపోతాడేమో ననుకున్నారువాళ్ళు అనటం అతిశయోక్తి కాదంటాడు శివయ్య!

ఇంత భావైక్యం కుదిరినట్లు కృష్ణమూర్తి, విశ్వనాథం పైకి కనిపిస్తున్నప్పటికీ—ఇంటి ఖర్చులు ఎక్కువౌతున్నాయనీ, వచ్చే జీతండబ్బులతో గిజగిజగా వుందనీ, ఈ నెల మరీ అధ్వాన్నంగా వుందనీ కృష్ణమూర్తి ఒకేవిషయాన్ని పదిసార్లు చెప్పేసరికి విశ్వనాథంమనసు పరిపరివిధాల పోయింది. తను కృష్ణమూర్తి కివ్వాల్సిన పదిరూపాయలమాట జ్ఞాపకంవచ్చింది. తన పదిరూపాయలూ తన కిమ్మని నోరారా అడగలేక ఇలా అవస్థపడుతున్నాడేమో ననుకున్నాడు. ఐనా, ఈవిషయంలో తనకు తాను బయటపడకూడ దనుకుని విశ్వనాథం తన జీవితంలోనుంచికూడా ఉదాహరణలను ఎత్తిచూపుతూ మధ్యతరగతి



కుటుంబాల బడాయిబ్రతుకులపైన చాలా సేపు మాట్లాడాడు!

కాని, ఆపూట ఇంటికి వెళ్లినదగ్గరనుంచీ కృష్ణమూర్తి తనకు రావలసిన పదిరూపాయలవిషయమే మాట్లాడాడని బాధపడ్డాడు విశ్వనాథం. ఇదే నిజమైతే, మరి గడియారం బాగుచేయించటానికైన ఖర్చుమాట ఎత్తితేం? కృష్ణమూర్తి కనీసం ఎంత అయిందనన్నా ఎన్నడూ అడిగిన పాపాన పోలేదు. ఆపాటి తనకు అడగటం చేత కాదనా? విశ్వనాథానికి రాత్రల్లా ఇవ్వే ఆలోచనలు. ఈవిషయంలోకూడా ముసుగులో గుద్దులాటగా కాకుండా తేల్చేసుకోవటం మంచిదనుకున్నాడు. కాని, ముందు తానివ్వవలసిన పదిరూపాయలిచ్చేసి, తరవాత తను గడియారం బాగు చేయించటానికైన చార్జీలు పదిరూపాయల చిల్లర వసూలు చెయ్యటమో, లేక, నా పదిరూపాయలూ నాకిమ్మని అక్షరాలా కృష్ణమూర్తిచేత అడిగించుకున్న తరవాత విషయమంతా తేల్చుకోవటమో - ఈ రెంటిలో ఏదో ఒక నిర్ణయానికి రాలేక ఆలోచిస్తూనే నిద్రపోయాడు విశ్వనాథం.

తెల్లారి కృష్ణమూర్తి కూరల మార్కెట్టుకి వెడుతూ పిలవటానికి రావటంతో తనని డబ్బు అడుగుతాడన్న విషయం స్థిరపడి పోయింది విశ్వనాథం మనస్సులో. ఖర్చులకు పోను, ఎటుపోయి ఎటువస్తుందోనని పదిరూపాయల నోటు జేబులో వేసుకుని బజారుబయలు దేరాడు. కాని, అవసరమైతే తప్ప తాను ముందు చెయ్యజారకూడ దనుకున్నాడు.

హోటల్లో కూర్చున్నదిమొదలు కృష్ణమూర్తి డబ్బునుగురించిన తన అవస్థ చెప్పటం మొదలుపెట్టాడు. ఆ సొద వినలేక విశ్వనాథంతల పగిలిపోతోంది. తన జేబులో ఉన్న పదిరూపాయల కాగితాన్ని తిప్పి మొహాన కొడదామా అనిపించింది. కాని, కాస్తా కూస్తా కాదు, పదిరూపాయలు!-అనిపించింది మళ్ళీ.

కృష్ణమూర్తికూడా బయటపడి డబ్బిమ్మనటం ఎలాగో. లేక బాధపడుతున్నాడు. ఇలా ఇద్దరూ ఎవడికి వాడు గిరి గీసుకూర్చుని అవతలివాణ్ణి బయటికి కేపవటం ఎలాగని సతమతమౌతున్న ఈ ఘడియల్లో- అనుకోనివిషయం - శివయ్య వాళ్లముందు ప్రత్యక్షమయాడంటే అది ఎంత కలవరం కలిగించే సంఘటన చెప్పండి! ఉక్కిరిబిక్కిరయారు వాళ్లిద్దరూను. వడదెబ్బ తగిలినట్లయినై వాళ్ళ మొహాలు.

ఆ గడబిడలో శివయ్యనుగురించి వాళ్ళు తీసుకున్న నిర్ణయాలు అసలే గుర్తురాలేదు వాళ్ళకు. తన జేబులో ఉన్న పదిరూపాయల కాగితం ఎగిరి శివయ్యచేతులో పడుతున్నట్లనిపించింది విశ్వనాథానికి. క్షణం గడుస్తున్నకొద్దీ తన నోటువిలువ తగ్గిపోతున్నట్లనిపిస్తోంది. మరికొంచెంసేపు తను ఉపేక్ష వహిస్తే ఆనోటునుంచి తను చిత్తుకాగితంవిలువన్నా పొందలేనేమోనన్నంత కలవరపడ్డాడు విశ్వనాథం.

"కృష్ణమూర్తీ! ఇయగోరా! నీ పదిరూపాయలు!" అన్నాడు విశ్వనాథం ఏమైనాసరే నీఅప్పు చెల్లించితీరుతానన్నట్టు!

కృష్ణమూర్తి అంతకంటె తెలివితేటలుగా అసలేమీ ఎరగనట్టు "అరే! ఏమిటిది? పదిరూపాయలా? ఎందుకు?" అన్నాడు.

"ఎందు కేమిటిరా? ఏమీ ఎరగనట్టు మాట్లాడుతావ్! నీదగ్గర నేను పదిరూపాయలు బదులుతీసుకోలేదూ! అందుకు! ఊఁ.. ఇంద!" అన్నాడు విశ్వనాథం తొందరపడుతూ.

ఆ పదిరూపాయల నోటు శివయ్యపాల బడేలోపల తన కివ్వవలసిన అప్పు తీరిందనిపిద్దామని విశ్వనాథం తంటాలుపడుతున్నాడని గ్రహించి కృష్ణమూర్తి తన నోటిమీదుగా "బాకీ చెల్లు" అని అనకూడ దనుకున్నాడు! "ఎప్పటి పదిరూపాయలమాట! ఇస్తూగాని లే! వుంచరా! ఏమంత తొందర? అసలైనా ఇప్పుడు నీదగ్గరనుంచి డబ్బు కావలసికాదు ఇందాకటినుంచీ నేను మాట్లాడుతున్నది. ఊరికే విషయం చెపుతున్నా అంతే!" అన్నాడు ఆ నిష్కామి!

విశ్వనాథం చాలా తీవ్రంగా "ఒరే అబ్బీ! నామాట విని నీడబ్బు నువ్వు తీసుకో. ఎన్నాళ్లనుంచీ వుంది ఈ అప్పు బకాయిపడి! అడగటానికి నువ్వు బిడియపడిఉండవచ్చు ననుకో, చెల్లించవలసిన బాధ్యత నాకు లేదూ? లేనిపోని రాద్ధాంతం చెయ్యక మెదలకుండా పుచ్చుకో" అంటూ ఆ నోటును కృష్ణమూర్తిమీదికి విసిరివేశాడు విశ్వనాథం.

అంతసేపూ బిగబట్టి నవ్వు ఆపుకుంటున్న శివయ్య ఒక్కసారి పగలబడి నవ్వి "కృష్ణమూర్తీ! నువ్వు మళ్లీ ఆ నోటును విశ్వనాథంమీద విసిరెయ్యరా. ఈ లోపల నేను పోయి బాజాభజంత్రీలని పిల్చుకొస్తాను. మేజువాణీ మజాగా వుంటుంది!" అని విరగబడి నవ్వి ఆ పదిరూపాయల నోటు చేత్తో పుచ్చుకున్నాడు.

శివయ్య నవ్వుతున్నకొద్దీ విశ్వనాథానికి ఒంటినిండా కారం రాసుకున్నట్టుంది.


"ఒరే! నువ్వూరికే అయినదానికీ, కానిదానికీ పూసుకురాబోక. నీసంగతి తెలీందేముంది! సమయాసమయాలు లేకుండా మోటసరసానికి దిగుతావు. కృష్ణమూర్తీ! నామాట విని నువ్వు ఆ పదిరూపాయలూ తీసుకో. అప్పులు తీర్చాలనే ధ్యాస ఉన్నవాడికి డబ్బువిలువ తెలుస్తుంది" అన్నాడు విశ్వనాథం ఎత్తిపొడుపుధోరణిలో.

విశ్వనాథం, కృష్ణమూర్తి అప్పు తీరిందనీ, తీరలేదనీ పోట్లాడుకునే ధోరణిలో ఉన్నారు. అందువల్ల, శివయ్య చేతులో ఉన్న నోటు ఇద్దరిలో ఎవరిదీ కానట్టు ఒకరిమొహం ఒకరు చూచుకుంటూ ఉండిపోయారు. కాని, నోటు మడిచి జేబులో పెట్టుకోవటానికి శివయ్యకు చక్కని అవకాశం కుదిర్చిపెట్టామే అన్నట్టు ఇద్దరూ బిక్కమొహాలతో శివయ్యవైపొకసారి చూశారు. అలాటి సమయంలో, "వచ్చిన తిప్పలేమిటంటే, ఈమధ్యని ధర్మం ఐదు పాదాలమీద నడుస్తోంది! ఖర్మంకాలి

(23-వ పేజీ చూడండి)



అక్కపందిరి



శ్రీ బులుసు వెంకటరమణయ్య

అదృష్టమంటే జగన్నాధరాజుగారిదే అదృష్టం! ఏమంటే - ఆయన మొదట ఒక చిన్న గుమాస్తాగా విజయనగరసంస్థానంలో అడుగు పెట్టేడు. చదువు చూస్తే నాలుగోక్లాసుకంటే ఎక్కువ లేదు. అయితేనేం? అద్భుతమైన తెలివితేటలుగలవాడు. పనిలో చాలా నిక్కచ్చిగా ఉండేవాడు. ఎవరిదగ్గిర ఏవిధంగా ప్రవర్తించాలో అతనికి బాగా తెలుసును. ఆ కారణంచేత జగన్నాధరాజుగారు ప్రభువైన విజయరామగజపతి మహారాజులుంగారి మన్ననలకు పాత్రమై, అభివృద్ధికి వస్తూ అచిరకాలంలోనే జమీందారీకి అసిస్టెండు దివానై, తర్వాత మహారాజులుంగారి బలవంతంమీద హెడ్డు దివానుగిరీ చెలాయించటానికి పూనుకున్నాడు.

దివానుగారిది సుగ్రీవాజ్ఞ. దాన్ని ఎవ్వరూ కూడా అతిక్రమించలేరు. ఎప్పుడూ, ఎవ్వరూ, అతిక్రమించకపోవడంచేత, అలా నిర్లక్ష్యం చేసినవారికి ఎలాంటి శిక్ష విధింపబడేదో తెలుసుకోవడం అసాధ్యమే!

మహారాజులుంగారే - తమ కనిష్టమైన విషయాల్లో దివానుగారి ప్రవృత్తికి అడ్డు చెప్పలేకపోయేవారు!


ఒకప్పుడు కొందరు గుమాస్తాలు వ్రాసిన దరఖాస్తు మహారాజులుంగారి సమ్ముఖానికి వెళ్లింది. దాన్ని చూస్తే అంత శుద్ధమొద్దు స్వరూపాలు మరోచోట వుండరనే స్పష్టమవుతూ వుంది. దాన్ని చూసి, మహారాజులుంగారికి నవ్వు వచ్చింది. 'ఇలాంటివాళ్లు తమ సంస్థానంలో ఉద్యోగులుగా వున్నందుకు - వాళ్లమీద తీరని కోపం వచ్చింది. ఇదంతా ప్రక్కను నిలిచి వున్న దివాను గ్రహిస్తూనే వున్నాడు. మహారాజులుంగారు ఆ కాగితాన్ని దివాను చేతికి అందిస్తూ "జగన్నాథం! మన హుజూరులో యిలాంటి ఉద్యోగస్థులేనా వుండేది?" అని అన్నారు. అలాంటి చవటలు వుండడానికి కారణం దివానే అని తన అభిప్రాయం వెల్లడిస్తూ. దానికి దివాను "చిత్తం, చిత్తం. మహాప్రభువులు అనుగ్రహించాలి. ఈ గుమాస్తాలు చాలా కాలం నుంచీ ప్రభువువారి ఉప్పుతింటూ బతుకుతున్నారు. అమాయకులు!" అన్నాడు.

మహారాజులుంగారు మళ్లీ ప్రశ్నపూర్వకంగా దివానువైపు చూచారు, ఇలాంటి వాళ్లవల్ల సంస్థానం ఎలా నష్టపడుతున్నదో అని అభిప్రాయాన్ని సూచిస్తూ. దివాను అది గ్రహించి 'దివాణంపనుల్లో వీళ్లు చాలా శ్రద్ధగానే వుంటారు. ప్రభువులు చిత్తగించాలి. వీళ్ల రాత, కోతలు ఎలా వున్నా దస్తూశీసుల్లో లోటు ఏమాత్రమూ లేదు. ఒక్క విషయంలో కూడా బకాయి అన్నమాట లేదు.' అని మనవి చేశాడు. మహారాజులుంగారు మరి మాటలాడలేక పోయినారు.

దివానుగారంటే తాశేదార్లందరికీ గొప్ప గౌరవం! ఈయన బెదరించేవాడే కాని, ఒకరి పొట్టమీద కొట్టడని అందరి ధైర్యమున్నూ. ప్రజలందరికీ దివానుగారంటే దేవుడిలాంటివాడన్నమాట!

అంతే కాదు, ప్రభుత్వంవారికీ జగన్నాధరాజు చాలా నమ్మకస్థుడు. ఉత్తరసర్కారులలో వున్న జమీందారీలన్నిట్లోకీ విజయనగరం జమీందారీయే చాలా పెద్దది; ధనవంతమయినది. అలాంటి జమీందారీ ఎటువంటి అల్లకల్లోలాలూ లేక సవ్యంగా జరుగుతున్నదంటే, దానికి దొరతనం కూడా గర్వించవలసినదే! దానికి కారణం దివాను జగన్నాధరాజుగారే అని పై దొరలకందరికీ బాగా తెలుసును.

మరో సంగతి -.ఏమిటంటే - జగన్నాధరాజుగారికి బాగా మెప్పు కావాలి. తన నేర్పునీ, ప్రతిభనీ నలుగురూ మెచ్చుకోవాలి! తనమాటకి ఎదురు ఉండకూడదు. అదే ఆయనకి కావలసినది! దివాంజీగారు ఇలాటి



ఆశయాం కలిగివుండడంచేత కొత్తగా ఏ పెద్ద వుద్యోగి వచ్చాడని తెలిసినా, అతడిని తమ సంస్థానానికి పిలిపించి గొప్పగా గౌరవించి పంపేవాడు. ఇలాంటి సమ్మానాల వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయని చెప్పడంచేత మహారాజులుంగారూ అంగీకరించేవారు. ఈ విధంగా విజయనగరం దివానుగారికి గవర్నర్లతోటి, కలక్టర్లతోటీ చాలా పరిచయం కలిగింది. వారందరికీ ఈయనమీద గొప్పగౌరవం ఏర్పడినది. అందువల్ల కలక్టరుహోదాకి క్రింది వుద్యోగస్థలను దివానుగారు లక్ష్యం చేసేవాడు కాదు. సబుకలక్టర్లు మొదలైన గవర్నమెంటు అధికార్లకందరికీ జగన్నాధరాజుగారంటే చాలా భయంగా కూడా ఉండేది.

విశాఖపట్నం జిల్లాలోని రెవిన్యూ డివిజన్లలో ఒక డివిజనుకి విజయనగరం కార్యస్థానం. అందుచేత ఎవరో ఒక విదేశీయుడు ఆవూరికి సబుకలెక్టరుగా వస్తూ వుంటాడు. ఆ వచ్చినవారిని దివానుగారు ఎదుర్కొని చాలా గౌరవం చూపించడం పరిపాటి.

ఒకసారి ఒక విదేశీయుడు అక్కడికి అధికారరీత్యా రావలసివచ్చింది. దివానుగారు కొంచెం అనారోగ్యంవల్ల ఆయన్ని ఎదుర్కొనలేక తనతరఫున అసిస్టంటు దివానుని పంపి, ఆ అతిధికి తగిన ఏర్పాట్లు చేయించాడు. ఆ ఉద్యోగస్థునికి లోకానుభవం తక్కువ. అప్పుడే సీమరుదిగి వచ్చాడు.

హిందూదేశంలోనివాళ్లందరూ అనాగరకులనీ, మూర్ఖులనీ అతని మనసులో ఇదివరకే ఒక దురభిప్రాయం ఏర్పడి ఉండిపోయింది. తాను ఒక తెల్లదేవతామూర్తిననీ, తనకు అక్కడివారు అడుగులకు మడుగులొత్తుతూ, ఎక్కువ వినయవిధేయతలు చూపించాలనీ అతని కోరిక. మొదట్లోనే తన్ను ఎదుర్కోడానికి పెద్ద దివాను రాకుండా చిన్నదివాను రావడం పెద్దగా అగౌరవపరచిన ట్లతనికి తోచింది.

నిజానికి ఆలోచిస్తే కలక్టరుకీ, సంస్థానానికి ఎటువంటి సంబంధమూ లేదు. జమీందారీవ్యవహారాల్లో అతను ఎలాటి జోక్యమూ తీసికోనవసరం లేదు. అయినా తనుమనిషితరహాగా దివానుగారు మర్యాద చేస్తే అది చాలదని ఆ పాశ్చాత్యమూర్తి అనుకోవడంలో అర్థం లేదు.

వాడుకప్రకారం ఆ కలక్టరుగారికి, రాజదర్శనమూ జరిగింది, మరి రెండు మూడు రోజుల్లో. అతను దర్బారుకు వస్తున్నప్పుడు దివాను జగన్నాధరాజుగారు ఎదురుగా వచ్చి, సగౌరవంగా లోపలికి తీసుకొనివెళ్లి మహారాజులుంగారి పరిచయం కలిగించాడు.

మహారాజులుంగారు స్వయంగా వచ్చి తన్ను దర్బారులోకి తీసుకువెళ్లడం లేదేమిటా? అని దొరగారికి కష్టం అనిపించింది. ఇదివరలో గవర్నర్లూ, పెద్దకలక్టర్లూ వచ్చేటప్పుడు మహారాజులుంగారు స్వయంగా ఆహ్వానించడం జరిగేదని ఆ సబుకలక్టరు దొరగారికి తెలుసును. వాళ్లకంటె తన

తక్కువ యేమిటి? అని అనుకుని దీని కంతకీ కారణం దివానే అని మనస్సులో నిశ్చయించుకొన్నాడు.

తర్వాత ఒకటి, రెండుపర్యాయాలు కలుసుకున్నప్పుడు దివానుని అలక్ష్యంగా చూసేడు. ఆ దొరగారి ప్రవర్తన జగన్నాధ రాజుగారికి అసంతృప్తిని కలిగించింది. ఈ యిద్దరూ కూడా తగిన సమయానికి ఎదురు చూస్తూ వున్నారు.

* * * *

జగన్నాథరాజుగారికి ఇంటిముందు పందిళ్లు వేయించుకోవడమంటే సరదా. ఏ భాగవతము జరిగినా, బొమ్మలాట జరిగినా వాటికోసం ప్రత్యేకం పందిళ్లు వేయించనక్కరలేదనీ, పందెరి ఇంటికి శోభను కలిగిస్తుందనీ, నిత్యకల్యాణం కళ్లకి కడుతూ వుంటుందనీ ఆయన అభిప్రాయం. తాను హెడ్డుదివాను అయాక, కోటకి ప్రక్కగా సమీపంలోనే ఒక పెద్ద భవంతి ఆయన నివాసానికి ఈయబడింది! తర్వాత దివాంజీగారు తమ కోరికప్రకారం తమ భవనం ముందు శాశ్వతంగా వుండేటట్టు ఒక పందిరిని నిర్మించారు. అదే లక్కపందిరి;

లక్కపందిరి అంటే లాక్షాగృహం వలె లక్కతో నిర్మించబడ్డది కాదు. అది చాలా విశాలమైన పెంకుటింటి ఆకారం గల పందిరి. ఆ పందిరికి బలమైన కర్రస్తంభాలు! ఆ స్తంభాలకి పైభాగంలో వున్నబల్లలమీద లక్కరంగులతో రామాయణానికి సంబంధించిన బొమ్మలు మనోహరంగా శాశ్వతంగా వుండేటట్టు చిత్రించబడి వున్నాయి. ఆ వీధిరోడ్డు ఆ పందిరిమధ్యనుంచే పోతున్నది. రెండు భారీబళ్లు నిరాఘాటంగా ఆ పందిరిలోంచి - ప్రయాణం చెయ్యవచ్చును!

ఒకసారి సబుకలెక్టరు దొరగారు కోట సింహద్వారంవైపునుంచి అయోధ్యామైదానంవైపు కోటరోడ్డుమీదనుంచి పోతూ వుండగా ఆయనదృష్టి ఆ పక్కనున్న దివాంజీగారి యింటిముందున్న లక్కపందిరిమీద పడింది. వెంటనే అతని మనస్సులో ఒక ఆలోచన తట్టింది! ఆ కలక్టరుదొర తన వాహనాన్ని ఆ పక్కకి మరల్చి దివాంజీగారి యింటివేపు వెళ్లాడు.

దివాంజీగారప్పుడే ప్రాతఃకాలవిధులు తీర్చుకుని కచేరిసావిడిలో సుఖాసీనులయి, ఏవో కాగితాలు చూచుకుంటూ గుమాస్తాలతో ఏదో మాటలాడుతున్నారు. ఇంతలో కలక్టరుగారు లోపలికి వచ్చేరు. జగన్నాథ రాజుగారు ఆయన్ని మర్యాదగా ఆహ్వానించి ఒకసోఫామీద కూర్చోపెట్టారు. కుశలప్రశ్నలు మామూలుగా జరిగిపోయాయి.

తర్వాత సబుకలెక్టరుగారందుకున్నారు. 'నేను ఉదయంషికారుగా వస్తూ మీ యింటిముందు పందిరి ఆకర్షింపగా ఇలా వచ్చాను. మీపనికి ఆటంకం కలిగించినందుకు క్షమించండి'

'............'

'దీన్ని మీరే కట్టించారనుకుంటాను ఇలా తయారవడానికి చాలా ఖర్చు అయి వుండాలి!'

'చిత్తమండి! నేనే కట్టించాను, చాలా సొమ్ము ఖర్చుపెట్టి. ఇంతకీ మనస్సులోని కోరిక జరగాలంటే డబ్బుకి వెనకతీయగలమా?'

'సరే! బాగానే వుంది. ఈ వీధికి పోయే రోడ్డు యీ పందిరికిందనుంచేగదా వున్నది? వచ్చే పోయే బళ్లూ, మనుష్యులూ మీ పందిరిక్రిందనుంచేగదా వెళ్లాలి?'

'అవును. నిరాఘాటంగా వెళ్లవచ్చు. దానికి మా అభ్యంతరం ఏమీ లేదు. బళ్లు ఎదురెదురుగా వచ్చినా ఇందులో సునాయాసంగా తప్పుకోగలవు. వర్షం పడే సమయంలో దీనికింద చాలామంది జనం తలలు దాచుకుంటున్నారు. ఇది జనానికి చాలా ఉపయోగంగా వుంది.'

'ఉండవచ్చునుగాక! పబ్లికురోడ్డుమీద మీరిలా శాశ్వతంగా పందిరి కట్టించి వుంచడం పద్ధతికి విరుద్ధమేమో ఆలోచించారా?'

జగన్నాధరాజుగారికి కలక్టరు అభిప్రాయం ఇప్పుడు అవగతమైంది. కలక్టరుకి తమ సంస్థానంమీదా, తమమీదా ఎలాటి అధికారమూ లేకపోయినా ప్రజాసంస్థమీద అధికారం వుంది. నగరపరిపాలనాధికారం ప్రభుత్వముది కాని, సంస్థానంవారిది కాదు. తన్ను సాధించడానికి కలక్టరు ఈఅధికారాన్ని ఉపయోగించదలచినాడని దివానుగారికి బాగా అర్థమయింది. అర నిమిషం ఆలోచించి ఆయన ఇలా అన్నాడు.

'ఇది చాలాకాలం కిందటే కట్టబడి

వుంది ఇదివరకు తమవంటి ప్రభువులూ, గవర్నరులూ దీన్ని చూచినారు ; వారు ఎటువంటి ఆక్షేపణా చెయ్యలేదు.'

'ఆ సంగతి వేఱు! ఎప్పుడో తప్పు జరిగిందని, తమవంటివారు దాన్ని సరిదిద్దుకోకుండా అలాగే వుంచివేయడం ధర్మమా?'

దివాంజీవారి మనస్సు ఉడికిపోతోంది. కోపంచేత ముఖం కందగడ్డవలె ఎఱ్ఱబారిపోయింది. తనకు ఎదురుచెప్పేవాడు కడు ఇప్పుడు కనబడడమూ, తన్ను అవమానించడమూ దుస్సహం అనిపించింది ఆయనకి. అయినా ఆలోచించి శాంతం వహించవలసి వచ్చింది.

'అయితే ఏమి సెలవు?'

'మరేమీ లేదు; దీన్ని తీసివేయించాలి'

జగన్నాధరాజుగారికి తలకొట్టినట్లనిపించినది. ఆయనకు ఏమి జబాబు చెప్పడానికీ పాలుపోలేదు.

కలక్టరు అధికారగర్వంతో తన విజయాన్ని సూచిస్తూ 'తీసివేయించక తప్పదు. సాయంకాలంలోగానే ఆ పని జరిగి తీరాలి!' అన్నాడు.

జగన్నాధరాజుగారికి ఏదో మనస్సులో మెరుపు మెరిసినట్లయింది. ఆయన 'సరే! తీయించివేస్తాను, సాయంకాలంలోగానే' అన్నారు.

'మీరు వెంటనే యీ పనికి మనుషులను ఏర్పాటు చెయ్యాలి నేను సాయంకాలం మళ్లీ తమ దర్శనం చేసుకుంటాను'

'ఓ! జగన్నాధరాజు ఇన్నిమాటలు ఆడేవాడు కాడు. సాయంకాలం లోగా తప్పకుండా తీయించివేస్తాను! నామాట నమ్మండి.'

కలక్టరు వికసితవదనంతో వెళ్లిపొయ్యాడు. దివాంజీగారు తాను ఒంటరిగా కొన్ని కాగితాలు వ్రాసుకోవడానికి తన ప్రత్యేకపుగదిలోనికి వెళ్లిపొయ్యారు.

సాయంకాలము కొవచ్చినది. లక్కపందిరి చెక్కు చెదరకుండా అలాగే వుంది. దాన్ని తీసివేయించడానికి ఎలాంటి ప్రయత్నమూ జరిగినట్టన్నా లేదు.

కలెక్టరుగారు తన ఆజ్ఞ ఎంతవరకు నెరవేర్చబడిందా అని చూడడానికి దివాంజీగారి యింటివేపు వచ్చారు. లక్కపందిరిని చూసేసరికి అది తన్ను వెక్కిరిస్తున్నట్లు కనబడింది!

అతను మిక్కిలి కోపంతో దివానుగారి యింటి గుమ్మందగ్గిరికి వచ్చాడు. జగన్నాథరాజుగారు చిరునవ్వుతో స్వాగతం యిచ్చి లోపలికి తీసుకు వెళ్ళాడు.

కలెక్టరుగారు: 'దివాంజీగారూ! నాకు చాలా విచారంగా వుంది; నా ఆజ్ఞ నెరవేర లేనందుకు నేను తగిన చర్య తీసుకోవలసి వస్తున్నది,' అన్నారు.

దివాంజీగారు ఒక ఎఱ్ఱకాగితం కలెక్టరుగారి చేతికి అందిస్తూ నవ్వుతూ అన్నారు. 'చిత్తం! తమ ఆజ్ఞ నెరవేర్చడమనేది మాకూ చాలా ముఖ్యమే! కానైతే తమ పై అధికారులమాటప్రకారం జరిగించవలసి వచ్చినందుకు క్షమించాలని ప్రార్థన' అని.

ఆ ఎఱ్ఱకాగితం గవర్నరుగారివద్ద నుంచి వచ్చిన అర్జంటు టెలిగ్రాము! అందులో 'మీ యింటి లక్కపందిరిని ఎంతమాత్రము తీయించవలసిన అవసరం లేదు' అని వున్నది.

దాన్ని చూస్తూ దొరగారు నిర్ఘాంతపడి పోయారు!

ఇంతలోనే కలెక్టరుగారి యింటిప్యూనొకడు ఆయనికోసం ఒక ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాము పట్టుకొని అక్కడికి వచ్చి, వినయపూర్వకంగా తన యజమానకి దాన్ని సమర్పించాడు.

కలెక్టరుగారు దాన్ని ఆతురతతో విప్పి చగువుకున్నారు. అది గవర్నరుగారివద్ద నుంచి వచ్చినదే!

'ఉత్తరక్షణంలో సిరస్తాదారుకి ఛార్జి అప్పగించి, కర్నూల్ కొండకు పోయి ఛార్జీ తీసుకోవలసింది. అక్కడ ఛార్జీ తీసుకున్నట్లు రేపు సాయంత్రంలోగా మాకు తెలియపరచాలి' అని ఆ టెలిగ్రాములో వుంది.

అది మనసులో చదువుకుంటూ సబుకలక్టరుదొరగారు వెలవెలపోయారు.

అందులో విషయం ఆయన రహస్యంగా వుంచాడే గాని, అతని ముఖవికాసం తెలియచేసింది అందులో వుండే విషయమేమో దివానుగారికి ఇదివరకే తెలుసును. గవర్నరుగారు ఆయనకి యీ సంగతి తెలియజేశారు.

జగన్నాధరాజుగారు కోరినదీ కలక్టరుగారి బదలీయే! అంతకంటే ఎక్కువ అపకారం చేయడం ఆయనస్వభావానికి విరుద్ధం.

దివాంజీగారు ఊరుకోలేదు.

'అయినా నా మాట నేను నెరవేర్చుకున్నట్లే జరిగింది'


ఏమీ అర్థంకానట్లుగా కలెక్టరు చూశాడు.

'సాయంకాలంలోపుగా తీయించి వేస్తానని అన్నానుగదా! అన్న మాట ప్రకారం తీయించివేశానా? లేదా?'

అని జగన్నాథరాజుగారు చాలా ధీమాగా అన్నారు.

సబుకలక్టరు దొరగారి ముఖంలో గంటు పెట్టినా నెత్తురుచుక్క లేదు.

ముల్లెలేని ముసలమ్మ



నే నావూరు పనుండి వెళ్లాను. వెళ్తూనే, ఆ పోతురాజు చెట్టుదగ్గిరసా వెళ్లాల్సి వచ్చింది. అక్కడ కొంతమంది జనం మూగివున్నారు. తలా వొకటే మాటాడుతున్నారు. కొంతమంది—మధ్యతరగతికి చెందిన పెద్దలు—ఆ చెట్టుమొదలుచుట్టూ కట్టబడివున్న గచ్చుఅరుగుమీద కూచుని, యీ జనంసంగతి తమ కేమీ పట్టనట్లుగా వున్నారు. నేను ఆ జనంలోంచి తొంగిచూశాను. చింతకొమ్మల్తో వేసిన చిన్న గుడిసె వొకటి అక్కడుంది. ఆ గుడిసెలో వొక యెండిపోయిన ముసలమ్మ కూచుని యేదో గొణుక్కుంటోంది. అందరి ముఖాలూ విచారసూచకంగా వున్నాయి.

"యేమిటి సంగతి?" అని వారిలో వొక స్త్రీని అడిగాను. ఆమె తన కళ్లతో బెదురుగా చూసి, "రాత!" అని నుదురు కొట్టుకొంది.

"భద్దరయ్యగారి ముసిలమ్మ" అని వొక పిల్లికళ్ల కుర్రాడు అన్నాడు.

నా కేమీ అంతుపట్టలేదు. అడిగినా, యెవరూ వివరించేట్టూ కనపడలేదు. యీ సమయంలో నాదృష్టి వొక ముసలాయనపై బడింది. ఆయన కొంచెం దూరంలో, ఖాళీగా కూచునివున్నాడు.

"యేమండీ, తాతగారూ, ఆ ముసలమ్మ సంగతేమిటి?" అన్నాను.

ఆయన నన్ను యెగాదిగా చూసి, "మన దే వూరు?" అన్నాడు.

"ఆc. కీలుగుంటండీ." అన్నాను.

"వొహో. కీలుగుంటేనా? అయితే మీవూరికీ మావూరికీ చుట్టరికంగూడా వున్నది. అంటూ ఆయన యింకేదో సోది ప్రారంభించేడు. కాని, నేను మధ్యలోనే అడ్డుతగిలి, "ఆముసలమ్మసంగతి చెప్పరూ?" అన్నాను.

ముసిలివాళ్లకి సహజమైన ధోరణిలో అయన వొక చాటభారతం చెప్పుకొచ్చాడు. మీ సులువుకోసమని నేను దాన్ని కుదించి మీకు చెపుతున్నాను:

శ్రీ లక్ష్మీకాంత మోహన్

సూరమ్మ పెనిమిటి చనిపోయి యిప్పటికి యాభైయేళ్లపైగా అయ్యింది. వారిది కొంచెం బాగా వున్న కుటుంబమే. ఐతే పిల్లల్లేరు. తానొక్కతే మిగిలింది.

కానైతే, ఆమె మరుదులూ, తోడుకోడళ్లూ, వాళ్ల పిల్లా మేకా-ఆమె తదనంతరం - వారసు లున్నారు. కాని, ఆయింట్లో తానొక్కతే వుండటానికి ఆమెకి మనస్కరించలేదు. తన జన్మస్థలంలో ఆమె అన్నదమ్ము లుంటే, వారి వద్దకి వెళ్లిపోయింది.

ఆమెకప్పటికి ముప్ఫయియేళ్లుంటాయి. ఆ వయసులో భర్త చనిపోటముంటేనూ, కనీసం వొక్క నిసుగన్నా లేకపోటముంటేనూ యెలా వుంటుందో అందరూ యెరిగిన విషయమే. ఆ బాధ అనుభవించుతూనే ఆమె చిన్నతమ్ముడింటికొచ్చింది. తమ్ముడి పేరు కోటయ్య. యువకుడు. వివాహమైంది. తన అక్కగారిని యెంతో ఆప్యాయంగా ఆహ్వానించేడు.

కాని, వితంతువైన సూరమ్మ యీ పచ్చని కొంపలోకి రావటం అతని అత్తగారికి యిష్టం లేదు. పైగా, ఆమెరాకవల్ల వీరికి ఆర్థికంగా లాభించేదికూడా లేదు.

ఐతే తన మనసులోని విషయం ఆమె యెవర్తోనూ—ఆఖరికి కూతుర్తోగూడా—అనలేదు. కాని, కాలం వొకతీరుగా వుంటుందా? తన కొడుకులు వారిదగ్గర తనని వుండనీయరని ఆమె అనుమానం. ఐనా యీకాలపు కొడుకులు తల్లిదండ్రులకి కూడు బెట్టే రకమేనా? తనకి వొక్కతే కూతురు. కనక యిక్కడే కాలం నెళ్లమార్చాలనుకుంది. ఇంతలో యీ "తాడుతెగిన ముండ" వచ్చిపడింది. ఈ ద్వేషంతో ఆమెకడుపు వుడికిపోయింది.

అందువల్ల వొకనాడు యెవరూ లేని సమయం చూసి "యేమే, అమ్మాయ్! యెలా యీ ముండతో?" అని కూతురుతో వుండబట్టలేక అనింది.

"యేం? యేమి చేసిందేం?" అని కూతురడిగింది.

"యేమి చెయ్యాలీ? మనది పచ్చని కొంప. యెందుకా ముండ మన యింట్లో?"

"వుంటే మన కేమిలేవే."

"సడే. యిక నువ్వుగూడా దానితర

షేనా? అది యిక్కడుంటే నేను వుంటాను. మా యిద్దర్లో యెవర్నో వొకర్ని......"

"ఐతే, ఆయన యేమంటాడో?"

"యేంటి ఆయన అనేది? ఆడది కాదంటే, మగమనిషి వొసంటాడా యెక్కడన్నానూ? అదీ గాక-చూడూ— దానివల్ల మనకి తిండిదండగతప్పితే వచ్చేదేమీ లేదు. ఆ ఆస్తిని యెటుదిరిగీ వారసులు......"

మాతురి కేమీ పాలుపోక "సరే. ఆయన్తో చెప్పి చూస్తాలే" అని అన్నది.

2

ఆ రాత్రి అన్నీ విన్నాక, "దానిని వెళ్లమనటం తప్పు గాదా? నలుగురూ నోట్లో వుయ్యరా?" అని కోటయ్య అన్నాడు.

"యెందుకూ? మనం యెవరి సొమ్ము తిన్నామని వూస్తారూ?"

"సొమ్మే తినాలీ? అక్కని వెళ్లమనటం చాలదూ?"

"అదిగాదండీ - మీ దంతా వొట్టి పిచ్చినమ్మకంగాని అది వుండి మన నుద్ధరించే దేంటి చెప్పండి."

"సరే, యింకేం! ఆమాట నువ్వే అను."

"అదేం మాట? నేనెట్లా అంటాను? మీరే అనండి."

"నా నోటితో నేను అనను."

"ఐతే, నేనూ అనను. ఆడది వెళ్లిపొమ్మందనే అపవాదిక నేను మోసేదా?"

"ఐతే తమ్ముడు వెళ్లమన్నాడనే నీలాప నింద నేను పడేదా?"

"సరే. వూరుకోండి."

యెవరూ సూరమ్మతో అనలేదు. కాని తల్లీ కూతుళ్ల మాటివిరుపులూ, ముసముసలూ ఆమె కర్థమైనాయి. ఇక వుండలేక ఆమె అంతట ఆమే పాలపాడులో వున్న తన అక్కగారింటికి వెళ్లిపోయింది. ఇంట్లో అమ్మాకూతుళ్లు వొక దీర్ఘనిశ్వాసం వదిలేరు.

ఆమె అక్కగారి బిడ్డలంతా వ్యక్తత కొచ్చినవాళ్లే. కొందరికి పెళ్లిళ్లుగూడా ఐనాయి.

సూరమ్మ ఆయింటికి రాగానే అంతా సంతోషించేరు; మర్యాదలు చేసేరు. దానికి కారణం "పాపం!" అనేది గాక, ఆమె వెనకాల వున్న ఆస్తియే నని మీరు గ్రహించగలరు.

పెత్తనం చెలాయించే మన స్తత్వంలో, పరిస్థితుల్లో సూరమ్మ సంస్కారం పొందింది. నలుగురికి తానై నీతులు చెప్పటం, అల్లరి పిల్లల్ని గదమాయించటం, తనకంటే వయసుగలవారికి సలహా యివ్వటం, చీవాట్లు పెట్టటం, యింట్లోని ప్రతి పని తానై పురమాయించటం, సర్దటం, తన కెదురు చెప్పినపుడు సహించకపోవటం- యివీ ఆమె నిత్యకృత్యాల్లో ప్రధాన విషయాలు.

కొంతకాలంపాటు యీవిధానాన్ని యింట్లో అందరూ సహించారు. కాని కాలం జరిగేకొద్దీ—తన దన్నది దమ్మిడీ యివ్వకపోగా - యీవిధంగా చెలాయించటం ఆమె అక్కగారి కోడళ్లకి వెగటుగా తోచింది; ద్వేషం కలిగింది. అంతే గాక, భాగాలు పంపిణీ అప్పుడుగూడా ఆమె కలుగచేసికొంది. యిక దాంతో, వాళ్ల ద్వేషం భగ్గుమంది. చెడామడా తిట్టిపోసేరు.

అక్కగారూ, బావగారూ యెంత బతిమాలినప్పటికీ, "నేను యీ యింట్లో వుంటానే వుండను." అంటూ మొరాయించింది. అదే సమయాన- సామెత చెప్పినట్టు-తన తమ్ముడు కోటయ్య వచ్చేడు.

అతను వచ్చిన యెత్తు వొకటి; కాని, యిది అవకాశంగా తీసుకొన్నాడు.

"యెందుకే యీకొంపలో నువ్వు?" అని చాటుకి బిల్చి అనీ యిదీ నూరిపోసి తనయింటికి తీసుకునిపోయేడు.

సూరమ్మగారి అక్కగారి బిడ్డల్లో భద్రయ్య అనేఅతడు చాలా తెలివిగలవాడు. యీ మెరుగాలకంగా తాను లాభంపొందుదామనే వూహాలో వున్నాడు. అతడక్కడు తప్పితే సూరమ్మ వెళ్లిపోయినందుకు యెవరూ నిజంగా విచారపడలేదు.

3

"నీ భూమి అక్కడెక్కడో యెందుకు? దానివల్ల నీ కేమి సుఖం? చూడూ. ఆ పనంతా నాకు వదిలెయ్యి. నీ తదనంతరం ఆ ఆస్తీఅంతా వారసులకి పోయేదే గదా? ఆ యిల్లూ వాకిలీ వాళ్లని తీసుకోమందాం. పొలమూ అదీ అమ్మకోటానికి ఒప్పించుదాం. ఆ పనంతా నా కొదిలెయ్యి. ఆ డబ్బుని వడ్డీకి యిచ్చుకో...."

అని వొకనాడు కోటయ్య సూరమ్మకి బోధించేడు. ఆమె కా పద్ధతి మంచిగానే తోచింది. యింకేం? కొన్నాళ్లకి ఆభూమిని అమ్మివేసి, డబ్బుని వడ్డీల కిచ్చింది.

అంతా చక్కగా జరుగుతోంది. యింట్లో యెవరూ ఆమెకి యెదురుచెప్పటం లేదు. కోటయ్యఅత్తగారుకూడా, యిప్పుడు చాలా అణుకువగా వుంటోంది. ఆ కుటుంబమంతా, దాని భారమంతా తనదే నన్నట్లుగా సూరమ్మకితోచింది! నిద్రాహారాలు సరిసే లేకుండానే, ఆమె ప్రతిచిన్న పనినీ తాచి చూడసాగింది. పిడకలు చేయటం, పాలి వూడ్చటం, కమతగాణ్ణీ కాపుల్నీ తిట్టటం, యిరుగుపొరుగుని దుమ్మెత్తిపొయ్యటం, కూలీలకి గింజలు కొల్వటం—సర్వమూ—ఆమె పనైపోయింది; ఆమె బాధ్యతగా మారింది. ఆమె దృష్టిలో కోటయ్య "బంగారపు తండ్రి!" తన కొక పెద్ద అండ, ఆసరా దొరికినందుకు ఆమె ఉప్పొంగిపోయింది!!

అట్లా కొన్నాళ్లు జరిగింది.

"మంచి పొలం. బంగారం పండుద్ది. అంతా యెగబడకముందే కొనేద్దాం," అని వొకనాడు కోటయ్య తన అక్కగారితో అన్నాడు. ఆమె కది సబబుగానే తోచింది.

రెండెకరాల పొలం కొని, తనపేర వుంటే వారసులు తినిపోతారని, ఆ పొలాన్ని తన తమ్ముడుపేర పెట్టింది! అది పోగా, యింకా ఆమెవద్ద నాలుగు వేల రూపాయల డబ్బు వుంది.

యీ కథా కమామీషు అంతా ఆమె క్కకొడుకైన భద్రయ్యవిన్నాడు. కడుపుఅ మండుకుపోయింది. తక్కిన డబ్బులో కొంతన్నా తను హరించటమెలాగా అని ఆలోచనలో వున్నాడు.

అందుకు తగ్గట్టు అతని తల్లికి జబ్బుచేసింది. ఆ వార్త తీసికొని సూరమ్మవద్ద కొచ్చేడు. చూసి వస్తానని తమ్ముడితో చెప్పి ఆమె వెళ్లిపోయింది. యీమె వచ్చినాక ఆమెజబ్బు ముదిరింది. "నా బిడ్డల్ని కనిపెట్టుకొనివుండు" అని చెప్పి వొక రాత్రి ఆమె కళ్లుమూసింది.

తర్వాత చాలాకాలమైనా ఆమె యింకా అక్కడే వుంది. ఆ సమయంలో వ్యాపారం చేయటానికనే వంకతో, కోటయ్యకి తెలీనీకుండా, రహస్యంగా, ఆ నాలుగు వేలూ భద్రయ్య చేజిక్కించుకొన్నాడు.

అట్లా మరికొంతకాలం జరిగింది.

ఆమె కొన్నిరోజులు తమ్ముడియింటి వద్దా, కొన్ని రోజులు భద్రయ్యయింటి దద్దా వుంటున్నది. ఆ డబ్బుసంగతి కోటయ్యకి తెలిసింది.

"వాడికి డబ్బెందుకు యిచ్చావు? యింకా నీకు యిస్తాడా?" అని కోటయ్య వొక సందర్భంలో అన్నాడు.

అందుకని ఆమె భద్రయ్యని డబ్బుకోసం తొందరచెయ్యసాగింది. అతను యిదుగో అదుగో అని జరుపుతున్నాడు. ఆమె అక్కడా యిక్కడా, యెడా పెడా, చీవాట్లు తింటూనే బతుకుతున్నది.

ఆమెకి యెనభైయేళ్లు వచ్చినాయి.

కాళ్లూ చేతులూ ఆడినంతకాలమూ బాగానే జరిగింది. యిప్పుడిక కాళ్లూచేతులు పడిపోయినాయి. ఆమెవద్ద వున్న డబ్బు గూడా, ఐపోయింది.

అందువల్ల, "మాయింట్లోనించి పో, ముండా," అని కోటయ్యఅత్త అనింది.

"నా గడప తొక్కమాక," అని భద్రయ్యపెళ్లాం అనింది.

* * *

మీసాలు సవరించి, చుట్టూ చూసి, "అదయ్యా సంగతీ! ఆఁ? పితపకాలం!!" అని ఆ ముసలాయన అన్నాడు.

"ఐతే మరి మంచీ చెడ్డా చెప్పేవారు లేరా వూళ్లో?" అని నేను అడిగాను.


"యెవరికి చెప్పతావు మంచి? యిది చెప్పితే వినే కాలమేనా? అంతా నాకు యివ్వకుండా వాడికెందుకిచ్చావు అంటాడు కోటయ్య. అంతా నాకే యివ్వక పోయావా నేనే పోషించేవాణ్ణి అంటాడు భద్రయ్య. వాడికే యెక్కువిచ్చావు వాడే నిన్ను పోషించాలి అంటాడు కోటయ్య. తమ్ముడికే అంతా దోచిపెట్టావు. వాడే నిన్ను చూడాలి అంటాడు భద్రయ్య. యిక మధ్యలో యెవరన్నా మంచి చెబితే నాలుగు తిడతారేమో నని పెద్దల భయం. అందువల్ల వొక పుణ్యాత్ముడు ఆ గుడిసె వేయించాడు, ఆ ముసిల్ది అట్లా నడిపీధిలో వుండటం చూడలేక!"

"బాగానే వుంది!" అన్నాను.

"అంతే, నాయనా, అంతే. ఆ ముండకి రెండురోజులమట్టీ తిండీ తిప్పలు లేవు! చూడూ పితపకాలం!!! పోనీ యెవరన్నా తీసికెళ్లి, అది కళ్లుమూసుకొనేదాకా యింత పోషణచేస్తారా అంటే, దాని డబ్బుతిన్న వాళ్ళకే పట్టంది, యెవరికి పడుతుంది చెప్పూ?"

"అంతేలెండి"

తర్వాత ఆయన అదీయిదీ సోదిచెప్పి, వస్తానంటూ లేచేడు. అప్పటికి చీకటిపడింది., చలిగాలి తోలసాగింది. నేను గుడిసె వద్దకి పోయాను. యెవరో స్త్రీకూలీలూ, పిల్లలూ తప్పితే యెవరూ లేరు. అంతా యేదోజాలిగా చెప్పుకొంటున్నారు. ఆ ముసలమ్మ చలిలో మూలుగుతోంది.



వ్యర్థాలు

(15-వ పేజీ తరువాయి)

నాకుకూడా ఈడబ్బు అవసరం అట్టే లేకుండా వుంది ప్రస్తుతం. లేకపోతే, ఈ నోటుభారం నేనే భరిద్దును! మీతో చాలా విషయాలు మాట్లాడాలి. ముందు ఈనోటు మీ ఇద్దరిలో ఎవరిదో తేల్చండి త్వరగా," అని శివయ్య అన్నాడంటే వాళ్లిద్దరినీ మరొక పిల్లిమొగ్గ కొట్టించాలని కాకపోతే మరేమిటి?

కృష్ణమూర్తి, విశ్వనాథం ఇద్దరూ తెల్లబోయారు. శివయ్య మాటలధోరణి చూస్తే నిజంగానే కక్కుర్తి అనేదిఇక ఈజీవితంలో ఉంచబోదనే ధీమాలో మాట్లాడుతున్నాడు. ఆ నోటు ఇద్దరిలోనూ ఎవరిచేతులో పెడతాడో అన్నట్లు ఎదురుచూస్తున్నారు. ఇద్దరూ నాదంటే నాదని ఆ నోటుని తీసుకోవాలని ఉన్నా శివయ్యతరహా ఎరుగున్న వాళ్లు గనక బయటపడటం మంచిది కాదనుకున్నారు. చివరికి ఆ నోటు విశ్వనాథానికి అందిస్తూ ఇడ్లీ, ఉప్మాతో పెసరట్టు తెమ్మని సర్వరుకి ఒకేసారి పురమాయించి, "మీ రిద్దరూ ఇవ్వాళ్ళ డిన్నరుకి రావాలి. ఇంకా మనవాళ్లంతా చాలామంది వస్తారు" అన్నాడు శివయ్య.

అంతకుపూర్వం ఒకసారి టిఫిన్ పూర్తయినప్పటికీ, శివయ్యచేత కొద్దిపాటి బలవంతం చేయించుకుని హోటల్లో ప్రొద్దుటిపూట తయారయే వస్తువుల్లో చాలాభాగం రుచిచూచారు. స్నేహితులిద్దరిచేత "తృప్తాస్మః" అనిపించి, అయ్యరుకి డిన్నరుపార్టీ పిండివంటల విషయం మరొకసారి జ్ఞాపకంచేస్తూ పదిరూపాయల నోట్లకట్టలోనుంచి ఒక నోటు బయటికి లాగి నిర్లక్ష్యంతో అయ్యరుమొహాన కొట్టి, వాడిచ్చిన చిల్లరలోనుంచి అయిదురూపాయల నోటు వేరుచేసి మిగిలింది జేబులో కుక్కుకుంటూ మూడు స్పెషల్ కిల్లీలతోపాటు ఒక స్టేటెక్స్ ప్రెస్ డబ్బాకూడా అందుకున్నాడు!

శివయ్యలో హఠాత్తుగా వచ్చిన ఇంత పెద్ద మార్పుకి కారణ మేమిటో అంతుపట్టక విశ్వనాథం, కృష్ణమూర్తి నీకు తెలుసా అంటే, నీకు తెలుసా అనీ, నాకు తెలీదంటే నాకూ తెలీదనీ నేపథ్యంలో కనుబొమలు ఎగరెయ్యటంద్వారా భావప్రకటన ప్రారంభించారు. మరుక్షణంలోనే వాళ్లిద్దరూ కూడబలుక్కున్నట్టు వెళ్లొస్తామనేసరికి శివయ్య వాళ్లిద్దరినీ పట్టుకొని ఆపు చేస్తూ, "ఈ శుభసమయంలో నేనిచ్చే ఆతిథ్యం కొంత స్వీకరించండ్రో అని మొర పెట్టుకుంటున్నా కొని అంత నిరత్స్య మేమిటట్రా ఈ దీనుడిమీద?" అంటూ బట్టలదుకాణంలోకి ఈడ్చుకుపోయాడు వాళ్లిద్దరినీ.

"చాల్లేరా తమాషా! ఎందుకొచ్చిన చీదరుపులు...ఇంకాను. అసలు విషయమేమిట్రా!" అన్నాడు కృష్ణమూర్తి ఈర్ష్యను దాచిపెట్టుకుంటూ లాలనగా.

శివయ్య ఈప్రశ్న వినిపించుకోకుండా అవీ ఇవీ బేరంచేసి కొన్నన్ని కొని మెట్లు దిగుతూ, "నెమ్మదిగా చెపుతా! మరి రోజులన్నీ ఒకేమాదిరిగా వుంటయ్యా? ఇట్టా వచ్చింది కాలం!" అన్నాడు.

శివయ్య ఈ మాటలు అని ఊరుకునే సరికి కృష్ణమూర్తి, విశ్వనాథం ఇద్దరిలోనూ ఔత్సుక్యం మరీ వృద్ధయింది. అదేమిటో చెప్పమని ఇంకా బలవంతంచెయ్యటం మొదలు పెట్టారు. చివరికి శివయ్య Illustrated weekly Puzzle First prize తన్నిందిరా!" అన్నాడు. విశ్వనాథం నడుస్తున్నవాడల్లా ఉన్నచోటనే ఉండిపోయి గుడ్లు పత్తికాయలల్లే చేసుకుని శివయ్యముఖంలోకి చూడటం మొదలు పెట్టాడు. కృష్ణమూర్తి క్షణంతరవాత ఒక గుటక మింగి "ఇహ నంతటితో ఆపరా! నిన్ననే గా పజిలు గెల్చిన వాళ్ల పేర్లు announce చేసింది. అందులో నీపేరు తగలడి లేందే!" అన్నాడు.

శివయ్య ఒక నవ్వు నవ్వి, "అది కాకపోతే మరొకటి - R. M D. C ! అదీ కాదంటావా, గిండీరేసెస్! దానికి ఇది సీజన్ కాదనుకుంటే డెర్బీస్వీప్! ఏదో ఈగోత్రానికే చెందిన ఒక నడమంత్రపుసిరి!...." ఇలా నడిచింది శివయ్యధోరణి.

బట్టల దుకాణంనుంచి ఫాన్సీదుకాణం, ఫాన్సీదుకాణంనుంచి పువ్వులదుకాణం, అక్కడినుంచి పళ్ల దుకాణం - ఇలా మార్కెట్టంతా వీరవిహారం చేశాడు శివయ్య ఆపూట. ఇదేదో తమని ఎద్దేవా చెయ్యటానికి శివయ్య పడుతున్న తాపత్రయంలాగా అనిపించింది కృష్ణమూర్తికీ, విశ్వనాథానికీ. మరి అందుకు కాకపోతే శివయ్య అయినవీ కానివీ వీళ్లకి కూడా కొనట మెందుకు? పైగా, వదుల్చుకు వెళ్ళనివ్వడు! ఆరోజల్లా వాణ్ణి వదుల్చుకు బయటపడటానికే వీలుగాకపోయింది.

ఇంతకంటె అసహ్యాకరమైన విషయం - ఇది తరవాత కొన్నిరోజులకి కాని బయటికి రాలేదు. మర్నాడు శివయ్య కృష్ణమూర్తి ఇంటికి పోయి విశ్వనాథం తన బాకీ ఇచ్చిరమ్మన్నాడని పదిరూపాయలు వాడికిచ్చి, తన గడియారం పాడుచేసినదానికి పదిరూపాయలు కృష్ణమూర్తి ఇచ్చిరమ్మన్నాడని విశ్వనాథానికిచ్చి...శివయ్య ఊళ్ళోనుంచి నిష్క్రమించాడు! వాకబు చెయ్యగా ఉద్యోగం బదిలీ అయిందని తేలింది.

* * *

ఇంతకూ శివయ్య కింత డబ్బెక్కడినుంచి వచ్చిందీ తేలనేలేదు.

జెమినీవారి

జెమినీవారి సరికొత్త తెలుగు చిత్రం "మంగళ" సంక్రాంతికి విడుదల కానున్నది. ఇది నవరస భరితంగా ఉండి, ప్రేక్షకులు ఎన్నిసార్లు చూసినా తనివి తీరకుండా ఉండేలాగు తయారుచేయడానికి నిర్మాతలు కృషి చేశారు. ఇందులో ప్రముఖపాత్రలను రంజన్, భానుమతి, టి. ఆర్. రామచంద్రన్, సూర్యప్రభ, ఎల్. నారాయణరావు మొదలైనవారు ధరిస్తున్నారు. ఈ చిత్రం కొరకు బ్రహ్మాండమైన సెట్టింగులు నిర్మింపబడినట్లు తెలుస్తున్నది. భానుమతి ఈ చిత్రంలో ధరించే 12 రకాల దుస్తులలో మూడింటికి డిజైన్లు భానుమతే ఇచ్చిందట. శ్రావ్యమైన సంగీతంతోనూ, రసవత్తరమైన సన్నివేశాలతోనూ జమినీవారి "మంగళ" ఆంధ్రదేశంలోని ఆబాలగోపాలాన్నీ ఆనందంతో ఉర్రూతలూగిస్తుందని ఆశించవచ్చు.



జెమినీవారి "మంగళ"లో భానుమతి, రంజన్.


10-1-51

"సంసారం"

పాటలు, మాటలు: సదాశివబ్రహ్మం, కే. గోపాలరాయశర్మ, సంగీతం: సుసర్ల దక్షిణామూర్తి, ఫోటోగ్రఫీ: రహమాన్, బి. సుబ్బారావు, డైరెక్షన్: ప్రసాద్.

నటీనటులు: ఎన్. టి. రామారావు, ఎ. నాగేశ్వరరావు, రాజ్యం, పుష్పలత, రేలంగి, సురభి బాలసరస్వతి, బెజవాడ కాంతమ్మ, సూర్యకాంతం, దొరస్వామి, రంగస్వామి వగైరా.

ఇటీవలనే ఆంధ్రదేశమంతటా విడుదల అయిన శ్రీ సాధనాపిక్చర్స్‌వారి తొలి, సాంఘికచిత్రం "సంసారం", జనవరి 4 ఉదయం 9న్నర గంటలకు మద్రాసు శ్రీకృష్ణాటాకీసులో పత్రికా విలేఖరులు మొదలైనవారికి చూపబడింది. కొత్తగా చిత్రనిర్మాణానికి దిగిన ఈసంస్థ ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొని ఈ చిత్రాన్ని



సాధనావారి 'సంసారం' లో పుష్పలత, నాగేశ్వరరావులు.

తీసినదీ, జ్ఞాపకం రాకుండా ఈ చిత్రాన్ని ఎవరూ చూడలేరని చెప్పవచ్చు. అట్టి ఇబ్బందులలోకూడా, ఉత్తమ తరగతికింద చేర్చదగిన "సంసారం" తయారుచేసి విడుదల చేయగలిగినందుకు సాధనావారు అభినందనీయులు.

ఈ "సంసారం" అచ్చగా ఒక కుటుంబానికి చెందినది కాదు. రఘు (ఎన్. టి. రామారావు) సంసారానికి అనుబంధంగా అతని తమ్ముడైన వేణు (ఏ. నాగేశ్వరరావు) సంసారమూ, అతని చెల్లెలి భర్త అయిన సీతారాం (రేలంగి) సంసారమూ కూడా చిత్రంలో చిత్రించబడ్డాయి. సంసార విచ్ఛిత్తికి మూలశక్తులకు ప్రతినిధులుగా రఘు తల్లీ, రఘు చెల్లెలు కామాక్షీ చిత్రంలో చూపబడినప్పటికీ వారు సంఘంలోవున్న దుష్టశక్తులను చాలా సమగ్రంగానే ప్రతిబింబించారు. అట్లాగే రఘూ, వేణూ సంఘంలో ఉన్న మంచితనానికి ప్రతినిధులుగా నిలిచారు.

ఒకవంక పాషాణహృదయాలు, వంచనా హింసా, అసత్యమూ, రెండోవంక ప్రేమా, సహనమూ, మంచితనమూ ఈ చిత్రంలో ఒకదానికొకటి పోటీ చేయబడినవి. సంఘంలోని అసమర్థతకు ప్రతినిధిగా సీతారాం పాత్ర నిలబెట్టబడింది.

ఈ చిత్రంలో కథ వాస్తవికదృష్టితో చూస్తే విమర్శకు నిలిచేదికాదు. పాత్రపోషణకూడా నిర్దుష్టంగా లేదు. ఒక ఉదాహరణ: ధనికుడైన కమల తండ్రి, తన కుమార్తె ఎవరో పల్లెటూరి "బైరు"ను, అందులోనూ నిరక్షరుణ్ని, పెళ్లాడబోతుందని తెలిసి ఆశేట అభ్యంతరం చెప్పక ఏళ్లేళ్ల అనంతరం తన కుమార్తెకు ఇంకొక వరుణ్ణి చూసి, అకస్మాత్తుగా ఆమె పెళ్లికి గడువు ఏర్పాటుచేసి ససేమిరా అంటాడు. తాను ప్రేమించిన వాణ్ణి పెళ్లాడాలనే తహతహ కమలకు ఉండటం సబబేగాని, ఆమె ప్రేరేపణ ఏమీ లేకుండానే తండ్రి తహతహలాడటం భావ్యంగా లేదు. సన్నివేశాలలో కూడా అస్వాభావికత లేకపోలేదు. కన్నతల్లీ, తోడబుట్టువూ కలిసి నిర్విచారంగా రఘూ కాపరం కూలదొయ్యటమూ, వేణుకు రంకులు కట్టటమూ అట్టే స్వాభావికంగా లేదు. కథ కిదే ఆయువుపట్టు.

అయినప్పటికీ ఈ కథలో సినిమా-చిత్రానికుండదగిన సన్నివేశాలూ, నడకా విరివిగా లభించింది. అందుచేత, చిత్రం చాలా దీర్ఘమైనప్పటికీ ఎప్పటికప్పుడు కొత్త చైతన్యం కథలో ప్రవేశిస్తుంది. సన్నివేశవైవిధ్యం వల్ల కలిగిన మరొక మేలేమంటే ప్రాముఖ్యమంతా అచ్చగా ఏ ఒకటిరెండు పాత్రలకో ఇవ్వక అప్రధాన పాత్రలను సయితం ఆకర్షవంతంగా చిత్రించటానికి వీలయింది. రఘూ, మంజూ, వారి పిల్లలూ పడే కష్టాలతోబాటు, సీతారాం, అతని తల్లీ చేసే కోతిచేష్టలూ వేణూ, కమలా, ఆమె స్నేహితురాళ్లూ చేసే అల్లరీ చిత్రంలో రక్తికి తీసుకురాబడ్డాయి. ప్రతి సంభాషణా గొప్పగా లేనప్పటికీ మొత్తంమీద సంభాషణలు సినిమాచిత్రానికి ఉండదగినట్టుండటమే కాక, తెలివిగా కూడా ఉన్నాయి. సంభాషణలలో వ్యంగ్యంగా కూడా అశ్లీలాలు లేకపోవటం మరొక సుగుణం.

చిత్రానికున్న ప్రధానలోపం పొడవు. ఆకర్షవంతమైన సన్నివేశా లుండటంచేత చిత్రం పొడవైతే అంతపట్టింపు లేకపోను. ఈ చిత్రం కేవలం సన్నివేశాలచేతనే గాక అనవసరమైన పాటలతోకూడా పెరిగిపోయింది. ముఖ్యంగా రాజ్యం పాడిన పాటలలో చాలాభాగం నిరుపయోగమే కాక కథా గమనాన్ని పూర్తిగా నిరోధించాయి. అదేవిధంగా రేలంగి, సురభి బాలసరస్వతీ పాడుతూ చేసిన పడకగది నృత్యం తీసివెయ్యవచ్చు.

పాటలను గురించి ఇంకొక విమర్శకూడా చెయ్యవలసిఉన్నది. ఇటీవల వచ్చిన హిందీ సినిమాగీతాలను చాలావాటిని అనుకరించారు. ఈ అనుకరణవల్ల చిత్రానికి లాభం ఏమీ ఉండదు. హిందీ మట్టులను మక్కీకిమక్కీ కాపీకొట్టటంవల్ల చిత్రానికి చౌకబారుతనం కూడా సంక్రమిస్తుంది. హిందీ సంగీతపు ఛాయలు బాగున్నప్పుడు వాటిని సొంతం చేసుకుని మట్లు నిర్మించుకోవటం మంచిది గాని హిందీ జాతీయత ముఖానగుద్దినట్టుండే మట్లను కాపీ కొట్టటం తగినపని కాదు.

చిత్రంలో తగినంత హాస్యం ఉండటం చేతనే కథ ప్రేక్షకులకు భారమనిపించటం లేదు. హాస్యనటుడుగా ముద్రపడిన రేలంగితో సరిసమానంగా నాగేశ్వరరావూ, రఘూ తల్లిపాత్ర ధరించిన బెజవాడ కాంతమ్మ, కామాక్షి పాత్ర ధరించిన సురభి బాలసరస్వతీ, సీతారాం తల్లి పాత్ర వహించిన సూర్యకాంతం కూడా చక్కని హాస్యం ఒప్పించారు.

ఇతరనటులలో రఘు పాత్ర ధరించిన ఎన్. టి. రామారావు చాలా నటనాసామర్థ్యం కనబరచాడు. పూర్వం "స్వర్గసీమ"లో నాగయ్యవంటి అనుభవశాలి ధరించిన మూర్తి పాత్రవంటిది రఘూపాత్ర. అటువంటి పాత్రను సమర్థతతో నిర్వహించి రామారావు తెలుగుసినిమా నటులలో అగ్రశ్రేణిలో చేరటానికి అర్హత పొందాడనవచ్చు. రాజ్యంకూడా అతిక్లిష్టమైన మంజూ పాత్రను సమర్థతతో నిర్వహించింది. కాని చిత్రంలో ఆ పాత్రకు ఉండదగినంత ప్రాముఖ్యం లేకపోయింది. ఆమెకు నిజంగా మంచి అవకాశం లభించిన ఆఖరి దృశ్యాలలో ఆమె నటన అసమానంగా ఉన్నది.

నటు లందరిలోకీ కమలపాత్ర ధరించిన పుష్పలతా, డా. దామోదరం పాత్ర ధరించిన సుందరరావూ బలహీనంగా ఉన్నారు. కొద్దిసేపే తెరమీద కనిపించినప్పటికీ, మంజూ తండ్రిగా నటించిన రంగస్వామీ, డాక్టరుపాత్ర ధరించిన దొరస్వామీ మంచి నటనా కౌశలం ప్రదర్శించారు.

డైరెక్షన్‌లో ప్రసాద్ ప్రత్యేకత మళ్లీ ఈ చిత్రంలో కొట్టినట్టు కనిపిస్తున్నది. స్క్రిప్టు రూపంలో కాగితంమీదఉన్న దృశ్యాన్ని సెల్యులాయిడ్ మీదికి ఎక్కించేటప్పుడు ఆదృశ్యానికి జీవం ఇచ్చే రహస్యం ప్రసాద్‌కు తెలిసినట్టుగా చాలామంది డైరెక్టర్లకు తెలియదు. స్క్రిప్టులోని పెద్దలోపాలను డైరెక్షనుతో కప్పిపుచ్చటం ఏ డైరెక్టరుకూ సాధ్యం కానిపని. కాని నిర్జీవ సన్నివేశాన్ని వాస్తవికసంఘటన అనిపించేలాగు చేసే కళాసృష్టి ప్రసాద్ చేతిలో ఉన్నది.

ఈ చిత్రానికి కేమెరామెన్‌గా పనిచేసిన రహిమాన్, బి. సుబ్బారావులు చాలావరకు నిపుణతతో పనిచేశారు. కాని ఎడిటింగ్ ఉండదగినంత నిర్దుష్టంగా లేదు. అయితే దీనికి బాధ్యు లెవరో ఊహించటం కష్టం. రాజ్యంచేత పాడించిన పాటలు (లీల పాటలకు ప్లేబాక్) సరిగా "సింక్" కాలేదు.

ఎన్ని లోపాలున్నప్పటికీ "సంసారం" చెప్పుకోదగిన చిత్రం. ఇది ప్రజాదరం విశేషంగా పొందగలది, పొందదగినది. సాంఘిక చిత్రాలకు గిరాకి తక్కువగా ఉన్నరోజులలో మంచి సాంఘికచిత్రం నిర్మించిన సాధనావారు ఎంతైనా అభినందనీయులు.



బొమ్మరిల్లు

బాలగేయం:

మురళీకృష్ణుడు

"మధుశ్రీ"

చూచావా లేదోను
మా చిన్ని గోపాలు;
కన్నావా లేదోను
విన్నయ్య గానాలు.

కాళ్ళగజ్జలు ఘల్లు
ఘల్లు మంటూ మ్రోగ,
ఆలమందల నడుమ
ఆ జేటి సమయాన-చూచావా...
కన్ను గిలికాడంటె
కాలు కదపాలేవు.
మురళి వూదాడంటె
పరవశమ్మయ్యేవు.
...చూచావా

కన్ను లున్నందుకూ
కన్నయ్య రూపమ్ము;
వీను లున్నందుకూ
వేణుసంగీతమ్ము. - చూచావా...

జాబిల్లి

"మహేశ్వర్"

చుక్కల పల్లకి నెక్కినాడే,
చక్కని వెల్గులు తెచ్చినాడే.

* * *

అందాలజాబిల్లి వచ్చినాడే,
అల్లరిపాపలను చూచినాడే.

* * *

మేఘాలచాటున దాగినాడే
పాపలతో దోబూచు లాడినాడే.


* * *

చల్లనివెన్నెలలు జిమ్మినాడే,
తెల్లమల్లిపువ్వులా నవ్వినాడే.

* * *

అందని దూరాన అందగాడే,
చుక్కలతో సఖ్యాలు చేసినాడే.

బొమ్మరిల్లు సీరియల్:



పరీక్షలరోజు దగ్గిర కొస్తోంది. ఆ తరవాత స్కూలుకి సెలవు లిస్తారు. మామూలుగా ఎప్పుడూ కఠినంగావుండే డాబిన్స్ మేష్టారు పరీక్షల రోజు దగ్గరపడుతున్న కొద్దీ మరింత నిర్దాక్షిణ్యంగా పిల్లల్ని చావచితక బాదటం మొదలెట్టారు. ఆయన కొంచెం వయస్సు మళ్లినవాడే. ఆయన తలమీద ఒక్క వెంట్రుక ముక్కయినా లేదు. బట్టతల కప్పటానికి విగ్గు పెట్టుకునేవాడు. అయినా చేతుల్లో సత్తువ తగ్గలేదు. బెత్తాలు విరగాల్సిందేగాని ఆయన చేతులు నెప్పెట్టవు. ఆయన దెబ్బలుతినంది ఎదిగిన ఆడపిల్లలు, మగపిల్లలుమాత్రమే.

చిన్నపిల్లలందరూ ఆయనంటే హడలిపోతున్నారు. ఆయనమీద ఏవిధంగా కసితీర్చుకోవటమా అని వాళ్లు సభలుచేసి పన్నాగాలు పన్నేవాళ్లు. చివరికి అద్భుతమైన ఒక ఉపాయం తోచింది. స్కూల్లో ఒక కుర్రాడున్నాడు. అతని తండ్రి 'సైనుబోర్డు' లు రంగులతో తయారుచేస్తూ వుంటాడు. ఆ కుర్రాణ్ణి పట్టుకున్నారు మిగతావాళ్లు. అతడు తప్పకుండా మేష్టారికి పరాభవం చేయగలనని ఒట్టు పెట్టుకున్నాడు. మేష్టారు అద్దెకు వుండేది ఆ కుర్రాడి యింట్లోనే. పరీక్షలరోజు మధ్యాహ్నం మేష్టారు పడకకుర్చీలో కూర్చుని నిద్రపోయేటప్పుడు "ఆపని" చేస్తానని చెప్పాడు.

పరీక్షరోజుకి మేష్టారు, పిల్లలు సిద్ధమయ్యారు. అవ్వాళ బడిఅంతా దేదీప్యమానంగా లైట్లు వెలిగించారు. తోరణాలు, పువ్వులు మొదలైనవి అలంకరించారు. మేష్టారు తన 'సింహాసనం' మీద ఠీవిగా కూర్చున్నాడు. ఆయనకి రెండు పక్కలా మూడేసి వరసల్లో బెంచీలున్నాయి. ఎదురుగా ఆరు వరసల్లో బెంచీలున్నాయి. వీటన్నిటిమీదా ఊళ్లోని పెద్దమనుషులు, చదువుకునే పిల్లల తలిదండ్రులు కూర్చున్నారు. ఆయన ఎడమచేతి పక్కన పెద్దమనుషులు కూర్చున్న బెంచీల వెనక విశాలమైన ఒక బల్ల వుంది. దాని నిండా పిల్లలు కిక్కిరిసి కూర్చున్నారు. మరి చిన్నపిల్లల్ని వాళ్ళ తల్లులు తెగ అలంకరించి తీసుకు వచ్చారు. అంత శుభ్రంగా స్నానం చేయించటం, బట్టలు తొడగటం ఆ పిల్లలకి ఉక్కిరి బిక్కిరిగా వుంది.

ఈ చిన్నపిల్లల వెనక పెద్దపిల్లలు చాలీ చాలని లాగూలు, చొక్కాలు వేసుకుని ఇబ్బందిగా కూర్చున్నారు. ఒకపక్కగా తెల్లటి సిల్కు బట్టలు, రంగు రంగుల రిబ్బన్లు, జేబురుమాళ్లు ధరించిన పెద్ద ఆడపిల్లలు కూర్చున్నారు.

పరీక్షలు ప్రారంభమయ్యాయి. ముందుగా ఒక చిన్న అబ్బాయి బితుకు బితుకు మంటూ లేచి నుంచుని మేష్టారు తన చే బట్టీపట్టించిన ఒక ఉపన్యాసం అప్పజెప్పాడు: "నాయంతటి బాల్య దశలోనున్న బాలుడు సభలో నుపన్యసించుట పాడిగాదని మీ రెరుంగుదురు," అంటూ మొదలెట్టాడు. ఉపన్యాసం పూర్తయ్యాక చప్పట్లుమో

గాయి. దాంతో మరీ బేజారెత్తి కూలపడ్డాడు ఆ అబ్బాయి.

తరవాత ఒక చిన్న అమ్మాయి లేచింది. సిగ్గుతోను, భయంతోను ఆ అమ్మాయి ముక్కు, బుగ్గలు ఎర్రపడ్డాయి. "మేరీ కున్న దొక చక్కని మేకపిల్ల," అనే పద్యం చదివి కూర్చుంది.

టామ్‌సాయర్ లేచాడు. ఒక ఉపన్యాసం (బట్టీపట్టిందే) మొదలెట్టాడు. లాగూ జేబుల్లో చేతులు పెట్టుకుని దర్జాగా అంగరికేసి చూస్తూ, "నాకు స్వాతంత్ర్యమైన నిమ్ము, లేకున్న మృత్యువు నే గోరుదును," అనే ఉపన్యాసందంచాడు. కాని సగంలోకి వచ్చేటప్పటికి మర్చిపోయి దూలాలకేసి చూస్తూ నిలబడ్డాడు. మేష్టారు గుర్రుమని చూశాడు. దాంతో మరీ కంగారు పుట్టి "మె మ్మె మ్మే" అంటూ కూర్చున్నాడు.

ఈవిధంగా ఒకళ్ల తరవాత ఒకళ్లు తమ చదువుని ప్రదర్శించారు. పెద్ద ఆడపిల్లలు ఇళ్లవద్ద తండ్రులచేత రాయించుకు వచ్చిన కాంపోజిషన్లు చదివారు. అందుచేత వాళ్ళలో ప్రతివాళ్లకీ చప్పట్లు విపరీతంగా పడ్డాయి.

ఇక మేష్టారు తన పాండిత్యం ప్రదర్శించాలి. తనకింద చదువుకున్న వాళ్లని సభ్యులు అంతయినెగా మెచ్చుకోవటం చూసి ఆయన ఉప్పొంగిపోయాడు. "సింహాసనం" లోంచి లేచాడు. గోడకేసి తిరిగి బ్లాకుబోర్డుమీద అమెరికా బొమ్మ వేస్తున్నాడు. కాని చెయ్యి వణకుతున్నది. సభలో కొద్దిగా నవ్వులు ప్రారంభమయ్యాయి. మ్యాపు చెరిపి మళ్ళీ వెయ్యబోయాడు. మళ్లీ చెయ్యి వణికింది. నవ్వు లెక్కువయ్యాయి. 'ఛా' అధైర్యపడకూడదని, పళ్లు నొక్కిపట్టి, చెయ్యి బిగించి బోర్డుమీద బొమ్మ వేస్తున్నాడు.

మేష్టారికి సరిగా నెత్తిపైగా స్కూలు గంటకొట్టే గోపురం వున్నది. ఆ గోపురానికి ఒక చిన్న కిటికీకూడా వుంది. ఆ కిటికీగుండా ఒకపిల్లి తలక్రిందులుగా దిగుతోంది. దాని కాలికి ఒక గట్టితాడు కట్టబడివుంది. 'మ్యావు' మని గోలచెయ్యకుండా దాని నోరు గట్టిగా బిగించబడి వుంది. ఆ విధంగా అది కొంచెం కొంచెమే కిందికి దిగుతోంది. సభలో నవ్వులు ఇంకా ఎక్కువయ్యాయి. పిల్లి సరిగ్గా మేష్టారి నెత్తి నందుకునేంత దగ్గిరదాకా దిగింది. ముందరి కాళ్లతో ఆయన తలమీద వున్న విగ్గును లంకించుకుంది. వెంటనే పిల్లి, పిల్లితోబాటు విగ్గు జర్రుమని మళ్లీ పైకి వెళ్ళిపోయాయి. మరో నిమిషంలో కిటికీ గుండా అవి మాయమై పోయాయి.

అవ్వాళ సభలోవున్న యావన్మందీ నవ్విన నవ్వుకి మేష్టారు ఏడుపు మినహాగా తక్కిన దంతా చేశాడు. పిల్లి పైనుంచి దిగుతున్నంతసేపూ ఆయన దీక్షగా, పళ్లు నొక్కిపట్టి అమెరికాబొమ్మ వేస్తూనే వున్నాడు. విగ్గు ఎగిరిపోయిందాకా సభ్యు లెందుకు నవ్వుతున్నారో ఆయన కర్థం కాలేదు.

మేష్టారి బట్టతలమీద రంగురంగుల బొమ్మలు చిత్రించబడి వున్నాయి. అవి దీపాల వెల్తురులో బలేగా మెరిశాయి.

దాంతో సభ ఆఖరయింది. పిల్లలు పగతీర్చుకున్నారు. సెలవు లిచ్చేశారు.

* * * *

టాంసాయర్ వూళ్లో కొత్తగా 'బుద్ధిమంతులసంఘం' అనే పేరుతో ఒక సంఘం పెట్టారు. ఆ సంఘంలో చేరిన పిల్లలు మంచి నడవడిని నేర్చుకోవాలి. టామ్‌కు ఈ సంఘంమీద మోజుపుట్టి వెంటనే చేరాడు. ఆ సంఘంలో వున్నంతకాలం చుట్టలు తాగననీ, పోకచెక్కలు నమలననీ, ఏవిధమైన చెడ్డపనీ చెయ్యననీ ప్రమాణంచేశాడు.

సంఘంలో చేరగానే టాంకు ఒక కొత్తవిషయం తెలిసింది. ఏపనులైతే చెయ్యనని తను ప్రమాణం చేశాడో సరిగ్గా ఆ పనులే చెయ్యాలని బుద్ధిపుడుతోంది. బూతులు మాట్లాడనని ప్రమాణంచేసిన మరుక్షణంనుంచీ బూతులు మీదికే దృష్టి పోతోంది. ఇకచుట్టలసంగతి చెప్పక్కర్లేదు. రాత్రింబగళ్లు మంచి మంచి ఘాటైన చుట్టలు కళ్లల్లో మెదల్తూ నోరూరిస్తున్నాయి. టాం విపరీతంగా బాధపడి పోయాడు కొన్నిరోజులు.

సంఘానికి రాజీనామా నిచ్చేద్దామనుకున్నాడు. కాని ఒక మంచి ఆకర్షణ కనిపిస్తోంది. ఆ సంఘంలో చేరిన పిల్లలు పండగరోజుల్లోగాని, లేక వూళ్ళో ఎవరైనా చచ్చిపోయినప్పుడు కర్మకాండ వగైరాలు జరిగేటప్పుడుగాని, ఫస్టుక్లాసయిన దుస్తులు ధరించి వూరేగుతారు. ఆ ఛాన్సు పోగొట్టుకోవటం టాంకిష్టంలేదు. ఎందుకంటే ఆ వూళ్ళో జడ్జీగా పనిచేస్తున్న ఫ్రేజర్ గారు పెద్ద జబ్బులో వున్నాడు. ఆయనమీదే టాం ఆశపెట్టుకున్నాడు. రోజుకి నాలుగుసార్లయినా వాళ్లనీ వీళ్లనీ అడిగేవాడు జడ్జీగారి కెల్లావుందని. ఒక్కొక్కసారి జడ్జీగారి పరిస్థితి చాలా ప్రమాదంగా వుండేది. అటువంటి సమయాల్లో టాం పెట్టెలోనుంచి 'దుస్తులు' తీసి అద్దంముందు నుంచుని చాలా జాగ్రత్తగా అలంకరించుకునేవాడు. ఇంతలో జడ్జీగారికి నిమ్మళంగానే వుందని తెలిసేది. ఈవిధంగా చాలాసార్లు జరిగింది. టామ్‌కు బలే విసుగుపుట్టింది.

చివరికి జడ్జీగారికి బాగా నెమ్మదించిందనీ, ఇక ఫరవాలేదని వార్త వచ్చింది. టాం వెంటనే సంఘానికి వెళ్ళి రాజీనామా యిచ్చాడు. ఆ రాత్రే జడ్జీగారు జబ్బు తిరగబెట్టి పాపం చచ్చిపోయారు. టాంకు వెర్రికోపం వచ్చింది ఆయనమీద. ఇంకెప్పుడూ జడ్జీలను నమ్మగూడదనుకున్నాడు.

జడ్జీగారికి బ్రహ్మాండంగా అంత్యక్రియలు జరిగాయి. సంఘంలోని పిల్లలు దర్జాగా దుస్తులువేసుకుని వీధుల్లో ఊరేగారు. వాళ్ళ అదృష్టం చూసి మండిపడ్డాడు టాం. అయినా రాజీనామా యివ్వటం ఒకందుకు మంచిదే అయింది. అతనిప్పుడు స్వతంత్రంగా తన యిష్టం వచ్చిన పని చెయ్యవచ్చు. చుట్టలు త్రాగచ్చు. బూతులు మాట్లాడచ్చుకాని, అవన్నీ తన ఇష్టప్రకారం చెయ్యవచ్చని ఎప్పుడు తెలుసుకున్నాడో అప్పుడే వాటిమీద మోజుపోయిందతనికి.

ఈ సెలవుల్లో ఏమి చెయ్యటమా అన్నది పెద్దసమస్య అయిపోయింది. రోజూ బడికి వెళ్లటం విసుగుపుట్టి ఎప్పుడు సెలవులొస్తాయా అని ఎదురుచూసిన టామ్ సెలవు లెప్పు డైపోతాయా, బడి ఎప్పుడు తెరుస్తారా అని బెంగపెట్టుకున్నాడు. రోజూ డైరీ రాస్తుంటే కొంత తోస్తుందిగదా అనుకున్నాడు. మూడురోజులు చూసినా డైరీలో రాయవలసినంత మంచి విషయం ఏమీ జరగలేదు. అందుచేత డైరీబుక్కు చింపేశాడు.

నీగ్రో పాటగాళ్లు వచ్చి రెండు రోజులు వూళ్లో పాటకచ్చేరీలు చేశారు. ఆ రెండురోజులూ జోహార్పర్‌తో కలిసి టాం కొంచెం వుషారుగానే తిరిగాడు. తరవాత మళ్లీ ఏమీ తోచలేదు.

అమెరికాపార్లమెంటులో సభ్యుడయిన బెంటన్ ఆవూరు వచ్చాడు. ఆయనని చూడకముందు టాం ఆయన ప్రపంచంలోకల్లా గొప్పవాడనుకున్నాడు. కాని తీరా చూశాక 'తుస్సు' మనిపించాడు. ఎందుకంటే ఆయన 25అడుగుల పొడుగు లేడు. కనీసం ఏడెనిమిది అడుగులైనా లేడు.

సర్కస్ ఒకటి వచ్చింది. అది వెళ్ళిపోయినతర్వాత పిల్లల్ని చేరదీసి టాం సర్కస్‌ఆట ఆడాడు కాని మూడురోజుల్లో అదీ మొహం మొత్తింది.

గారడీ చేసేవాడొకడు వచ్చాడు. వాడు వెళ్లిపోయింతరవాత మళ్లీ యధాప్రకారం.

బెకీథాచర్ వాళ్ల అమ్మా, నాన్నలతో కలిసి అమెరికాకు కొన్నివేల మైళ్లదూరంలో వున్న కాన్‌స్టాంటినోపుల్ పట్నానికి వెళ్లిపోయింది. కనక ఎటు చూసినా టామ్‌కి సంతోషించదగింది కనబడలేదు.

మఫ్‌పాటర్ హత్యకేసు ఎటూ తేలకుండా ఏడుస్తోంది. ఈ విషయంలో నిజం తెలిసిన టామ్ కిది ఎంతో బాధగా వుంది.

ఆతరవాత కొన్నాళ్లు కళ్లకలక, జ్వరం వచ్చి టాం మంచంమీంచి లేవలేకపోయాడు. మళ్లీ లేచి తిరిగే సమయానికి ఊరుఊరంతా మారిపోయింది. అందరూ ఫాదిరీల బోధలు విని "పుణ్యాత్ము" లైపోయారు. "పాపాత్ము" డొకడన్నా కనిపిస్తాడేమో నని టాం వూరంతా వెదికాడు. ఆఖరికి జోహార్పర్ కూడా బైబిలుపుస్తకం చదివేస్తున్నాడు. బెన్ రోజర్సు బిచ్చగాళ్ళకి సేవచేస్తున్నాడు. జిమ్ హాలిస్‌ని మాట్లాడించబోగా, "టాం! నీకు జ్ఞానం వూరికే రాలేదు. క్రీస్తు దేవుణ్ణి నమ్మితే నీకే బాధలూ రావు," అని ఉపదేశించబోయాడు.

వీళ్ళెవరూ లాభంలేదనుకుని హాకల్ బెరీఫిన్ ఒక్కడే నమ్మదగిన "పాపాత్ము" డని, వాణ్ణి వెదికి పట్టుకున్నాడు. టాం నోరు తెరవక ముందే హాక్ బైబిలులో ప్రార్థన చదివాడు. టాం దిగజారిపోయి నీరసంగా ఇంటికి తిరిగివచ్చాడు. తనొక్కడూ తప్ప మిగతా వాళ్ళంతా బాగుపడిపోతున్నారనుకున్నాడు.

ఆ రాత్రి పెద్దపెట్టున గాలిదుమారం, వర్షం వచ్చాయి. ఏక్షణాన్నయినా ఇల్లు కూలిపోతుం దనిపించేటట్టు ఉరుములు, మెరుపులు వచ్చాయి. టాం మంచంమీద పడుకుని చావుకోసం ఎదురుచూస్తున్నాడు. ఎందుకంటే తను పాపాత్ముడుకనుక దేముడికి కోపం వచ్చి ఈ తుపానును పంపించాడని అతని నమ్మకం. కాని కొంతసేపటికి తుపాను తగ్గింది. ఇకనించీ "పుణ్యాత్ముడు" కావాలని టాం నిశ్చయం చేసుకున్నాడు.

మర్నాడు టాం మంచంచుట్టూ డాక్టర్లు తయారు. జబ్బు తిరగబెట్టింది. ఆ మూడువారాలు మూడు వందల ఏళ్లనిపించింది. జబ్బు తగ్గి టాం వూళ్ళో తిరగబోయేసరికి మళ్లీ మార్పు వచ్చింది. జిమ్‌హాలిస్ మొదలైనవాళ్లు "కూనీకేసు ఆట" ఆడుతున్నారు. ఒకపిల్లి ఒక పక్షిని హత్యచేసిందని కేసు పెట్టా డొకడు. పిల్లిని కట్టేసి పట్టుకున్నారొకచోట. పక్షి చావనూలేదు, ఏమీ లేదు; గుడ్లు తెరిచి చూస్తోంది.

ఇంకొకచోట జో హార్పర్, హాక్ కలిసి ఎక్కడో ఎత్తుకువచ్చిన పళ్లు తింటున్నారు. పాపం వాళ్లూ టాం లాగానే "పాపాత్ము" లైపోయారు మళ్ళీ. అమ్మయ్య ఫరవా లేదనుకున్నాడు టాం.

* * *

ఎల్లాగైతేనేం చివరికి కూనీకేసు కోర్టులో విచారణకు వచ్చింది. ఏమీ తోచక కొట్టుకుంటున్న ఊళ్ళోవాళ్ళకి కబుర్లకి మంచిమేత దొరికింది.

ఎవళ్లు ఎక్కడ కూనీకేసుని గూర్చి మాట్లాడుతున్నా టామ్‌కి భయంగానే వుండేది. తనకి వినబడేటట్లుగా మాట్లాడాలని, తన రహస్యం తనచేత బైటపెట్టించాలని, ప్రతివాళ్ళూ అనుకుంటున్నట్టే అతని భయం. తను డాక్టరుహత్యని గూర్చి ఎరిగివున్నట్టు మరొకళ్ళకి ఎల్లా తెలుస్తుందా అనైనా అతనాలోచించలేదు. అందుచేత ఎక్కడ ఈ మాటలు చెవిని పడ్డా నిలువునా వణకిపోయేవాడు. ఈ విషయాన్నిగూర్చి కొంత మాట్లాడాలని టాం ఒకరోజున హాక్‌ని ఎవ్వరూలేని ఒకచోటికి తీసుకువెళ్లాడు. తన గుండెల్లో వున్న బరువుని హాక్‌తో పంచుకోవాలని అతని ఊహ. పైగా హాక్ ఈ సంగతి గుట్టుగా వుంచాడో లేదో తెలుసుకోవాలి.

"హాక్! దాన్నిగూర్చి ఎవళ్ళకైనా చెప్పావా?"

"దేన్నిగూర్చి?"

"నీకు తెలుసు అదేదో!"

"ఓ! అదా? ఉహు, చెప్పలా"

"ఒక్కమాటకూడా?"

"ఉహు! నీకనుమానంగా వుందా?"

అబ్బే. కొంపతీసి చెప్పేశావేమో అని భయపడ్డాను."

"టాంసాయర్! అలాచెప్పేస్తే రెండురోజులుకూడా మనం బతికివుండము. మనం ప్రమాణం చేశాంగా!"

టాంమనస్సు కుదటపడింది.

"కాని ఎవళ్లన్నా నిన్ను చెప్పమని బలవంతం చేస్తే?" అని అడిగాడు టాం.


"నన్నా? ఇంజన్‌జో అనేరాక్షసుడి చేతిలో చావాలని కోరిక వుంటే తప్ప నేను ఈ విషయం చెప్పను." అన్నాడు హాక్.

"మన కీ సంగతి తెలుసని ఎవ్వరికీ తెలవనంతకాలం మన కేం భయంలేదు. అయినా మళ్లీ ప్రమాణం చేద్దామా? ఎందుకైనా మంచిది."

"ఓ."

ఇద్దరూ మళ్లీ భయంకరమైన

(37-వ పేజీ చూడండి)



[illegible] వీధిలోంచి ఇంటిలోకి పరుగెత్తుకొని వచ్చి, ఆయాస పడుతూ "అమ్మా! అమ్మా! మరేమో వీధిలోకి పువ్వు లమ్మ వచ్చాయేవ్" అంది తల్లితో.

వినీవిననట్టుగా ఊరుకుంది తల్లి.

"అమ్మా! పువ్వులు వచ్చేయే! కొనవుటే, కొనవుటే! వెళ్లిపోతాయే!" అని, వెనక్కి పరుగెత్తుకొని వెళ్లి "అబ్బి! ఉండు, మా అమ్మ వస్తూంది," అని పువ్వులఅబ్బితో చెప్పి, మళ్ళీ ఇంటిలోకి పరుగెత్తుకుని వచ్చి "అమ్మా! కొనవుటే? కొనవుటే?" అని తల్లిబుజాలు పట్టుకొని వేళ్లాడింది పిల్ల.

"రోజూ పువ్వులే నీకు! రోజూ కొనడానికి డబ్బు లెక్కడినుంచి వస్తాయని? పొమ్మను," అని కసిరి వేసింది తల్లి.

"ఇవాళేనే, ఇవాళేనే!" అంది పిల్ల దీనంగా.

"ఏరోజు కారోజే 'ఇవాళ!' ఏరోజు రాదు 'ఇవాళ'! అంది తల్లి గట్టిగా.

వీధిలో పువ్వులబ్బి "అమ్మగారూ!" అని కేకలువేస్తున్నాడు.

"అబ్బీ! వస్తూంది ఉండు మా అమ్మ. పదవే మ్మా! పదవే!" అని చిందులు తొక్కింది సుశీల.

"పోనీ పసిపిల్లకదా" అని పాపం తల్లిమనస్సు మెత్తపడింది. కాని ఆమె "ఏమోనమ్మా! నాకు తెలియదు! నేను తిట్లుతినలేనమ్మా! మీ నాన్న వస్తే నన్ను కోప్పడతారు!" అని విసుగుకొంది.

"కొంబడరే, కొంబడరే!" అంది సుశీల, తల్లికొంగు పట్టుకొని వేళ్లాడుతూ.

"ఆలాగే అంటావు నీకేం? నన్నా కేకలు వేసేది! రోజూ కొంటే కొంబడరేమిటి?" అంది తల్లి పెద్దగొంతుక పెట్టుకొని.

"కొనేలఅమ్మా! ఇవాళకేనే!" అంది బిడ్డ దీనంగా.

తల్లి ఓప్పుకోలేకపోయింది. "కొంటానుకానినాన్నతో చెప్పకేం అమ్మ కొందని," అంది.

"ఉఁఉఁ, చెప్పను," అంది సుశీల.

"మరేమో నాన్నతో 'అమ్మ ఆ వీధిలో వాళ్ల ఇంటికి వెళగా వాళ్లు తాంబూలంలో పెట్టిఇచ్చారు' అని చెప్పేమాటుంటే కొంటాను. లేకపోతే అసలు కొనను." అంది తల్లి.


"ఉఁ. అలాగే! నాన్న అడిగితే 'నాన్నా! నాన్నా! అమ్మా, నేనూ కలిసి ఆవీధిలో వాళ్ళఇంటికి వెళ్లాం. వాళ్లు మరేమో అమ్మకి తాంబూలంలో పువ్వులదండ పెట్టిఇచ్చారు" అని చెప్పుతాను" అంది సుశీల ముద్దరాలులాగు.

నిజమేకాబోలు అని నమ్మింది తల్లి.

తల్లీ, పిల్లా వెళ్లి పువ్వులదండ ఒక కాసిది కొనుక్కున్నారు. రెండుముక్కలుచేసి చెరోముక్కా తలలో పెట్టుకొన్నారు. ఇంతటిలో తండ్రి వచ్చాడు. కాళ్లకి నీళ్లు తేవడానికి తల్లి చేద తీసుకొని పెరటిలోకి వెళ్లింది.

సుశీల తండ్రితో "నాన్నా! నాన్నా! మరేమో అమ్మ పువ్వులు

(36-వ పేజీ చూడండి)




దేయ్యాలమిట్ట అనే గ్రామంలో పెద్దన్న, సిద్దన్న అని ఇద్దరన్నదమ్ములుండేవాళ్ళు, పెద్దవాడైన పెద్దన్నకు పెండ్లయింది. ఒక కొడుకు కూడాను. సిద్దన్న చిన్నవాడు. తను పుట్టిన నాలుగునెల్లకే తండ్రిని సాగనంపాడు. అప్పటి నుంచి పెద్దన్నే కుటుంబభారం అంతా వహిస్తూ, తల్లినీ, తమ్ముణ్ణీ తనవద్దనే ఉంచుకుని, తండ్రి లేని లోటును తీర్చాడు. తల్లి సుందరమ్మగారి గారాబంవల్ల నైతేనేమి, అన్నగారి మంచితనంవల్లనైతేనేమి సిద్దయ్యకు సోమరితనం బాగా అలవడ్డది. ఎప్పుడు చూచినా ఏ గొడ్లదొడ్డిలోనో, ఏ కుక్కిమంచం లోనో బడి నిద్రపోతూవుండేవాడు. ఇంటిపనులు గాని, పొలంపనులు గాని అతనికి పట్టేవి కావు. పైగా ఎవ్వరూ కూడా అతనికి పనిచెప్పేవారు కారు—ఆవూళ్ళో బడి అంటూ లేకపోవటంచేత, సిద్దయ్యకు పంతుల బాధకూడా లేదు. దాంతో అతనికి సోమరితనంతో పాటు మందమతిగూడా ఏర్పడ్డది. తనలో తానే మాట్లాడుకోవటం, పిలిచినా పలకకపోవటం మొదలైన లక్షణాలుకూడా ఏర్పడ్డై అతనిలో.

సుందరమ్మగారికి పెద్ద దిగులు పట్టుకున్నది. అయ్యావార్లంగార్ని చేద్దామంటే, కోతై కూర్చున్నట్లు, తన ముద్దుల పుత్రుడు కాస్తా, మొద్దైపోయాడు. విద్యలేనివాడు వింతపశు వంటారు, ఇందుకే కదా! సుందరమ్మగారు తన పెద్ద కుమారుడితో "సిద్దయ్య నెక్కడన్నా చదవేస్తే గాని లాభంలేదురా" అని చెప్పింది. మంచిరోజుచూచి, పెద్దన్న, సిద్దన్నను తీసుకెళ్ళి గర్తపురిలో ఒక పండితునివద్ద వుంచి వచ్చాడు. అప్పటికి సుందరమ్మగారి మనస్సు కాస్త స్థిమితపడ్డది. సిద్దయ్య చదువునుగురించి ఆమె ఎన్నో కలలు కంటుండేది.

ఒక సంవత్సరం గడిచింది. సిద్దయ్య ఒకమాటు తన స్వగ్రామాని కొచ్చాడు. అతనిలో ఇప్పుడు పెద్దమార్పేమీ కనుపించకపోయినా, సుందరమ్మగారికి మాత్రం తన చిన్నకొడుకంటే ఒక పండితుడే అన్న వుద్దేశ్యం ఏర్పడ్డది. ఇంత బాగా చదువుకుంటున్న తన కొడుక్కి, తన తమ్ముడు పిల్లనియ్యక పోతాడా అని ఆమె ధైర్యం.

ఒకనాడు సిద్దయ్య సావిట్లో మంచంమీద కూర్చుని వుండగా, సుందరమ్మ తన మనమణ్ణి ఎత్తుకొచ్చి, సిద్దయ్య చేతి కిచ్చింది. సిద్దయ్య తదేకదృష్టితో పిల్లవాడి కేసి చూశాడు. ఇంతలో తల్లి "నాయనా, నేనూ పెద్దదానైపోయాను. ఇంక బ్రతికినన్నాళ్ళు బ్రతుకబోను. ఏదో, నీవు ఒక ఇంటివాడివైతే చూచి ఆనందిద్దామని వుంది" అంది. సిద్దన్న కీమె మాట లేమీ పట్టలేదు. పిల్లవాణ్ణి

పరీక్షచేస్తున్నాడు. చూచి, చూచి ఒక్కమారు ఆ పసివాణ్ని కసికసిన గిచ్చి వూరుకున్నాడు. వాడు కెవ్వున ఏడవటం మొదలెట్టాడు. "అదేమిట్రా?" అని తల్లి ప్రశ్నిస్తే "బాలానాం రోదనం బలం" అని సమాధానం ఇచ్చాడు సిద్దన్న. అతని సంస్కృతపాండిత్యానికి తల్లి లోలోపల మెచ్చుకుని పిల్లవాణ్ణి తీసుకెళ్ళింది.

మరునాటి సాయంకాలం సుందరమ్మ ఇన్ని గారెలు వండి మూట కట్టి, సిద్దన్నచేతి కిచ్చి మేనమామను, పిల్లను చూచిరమ్మని గుండవరం పంపింది. బలవంతాన బయలుదేరి సిద్దయ్య సగందూరం పోయేసరికి ఒక వాగు అడ్డు వచ్చింది. అప్పటికి సిద్దయ్యకు బాగా ఆకలి వేసినట్లుంది. వెంటనే ఒక చెట్టు క్రింద కూర్చుని గారెలమూట విప్పి, ఒక్కొక్కటే నోట్లో వేసుకుంటూ ఆకలి తీర్చుకున్నాడు. చివరకు మూటలో ఒక్క గారెకూడా మిగల్లేదు. ఇక గారెలు లేకుండా మామగారి వూరు పోవటం ఎట్లాగా అన్న సందేహావస్థలో పడ్డాడు సిద్దన్న. అతని కొక చక్కటి సూత్రం మనసుకు తట్టింది. "ఆ వూరి కీవూ రెంతో ఈ వూరి కావూ రంతే" కదా అని-తాను ఇప్పటికి సగం దూరం వొచ్చాడు. తిరిగి ఇంటికి చేరుకుంటే, మిగతా సగం పూర్తిఅవుతుంది; ఆ వూరు పోయినట్టూ అవుతుంది, అనుకుని నిమ్మదిగా లేచి బయల్దేరి ప్రొద్దుకుంకేవేళకు ఇల్లు జేరుకున్నాడు. కొడుకును చూడగానే తల్లి "అప్పుడే వొచ్చేశావేమిరా? అక్కడి సంగతు లేమిటి?" అనడిగింది.

"ఆ వూరి కీవూ రెంతో, ఈవూరి కావూ రంతే" అని సిద్దన్న సమాధానం. సుందరమ్మ కేమీ అర్థం గాక, చివ కు సిద్ధన్న గుండవరం వెళ్లలేదని గ్రహించు చాలా చింతించింది.

గారెల మహాత్యంవల్ల, ఆ రాత్రి సిద్దన్నకు ఒళ్ళు వెచ్చపడ్డది. దిష్టేమైనా తగిలిందేమోనని సుందరమ్మగారు కాస్త దిష్టివిభూతి తెచ్చి, సిదయ్య నొసటికి రాచి, మరికాస్త నాలుకమీద వేసి, ఇక దోషం పోతుందని చెప్పింది. కాని ఒక రాత్రివేళకు సిద్దయ్యకు అపరిమితమైన తపన పుట్టుకొచ్చింది. నెమ్మదిగా లేచి వంటఇంట్లో ప్రవేశించాడు. దేముడి గూట్లో వున్న పెద్ద విభూతిపండు తీసుకుని, ఒకొక్కముక్కే తుంచి నోట్లో వేసుకుంటూ బానలోని మంచినీళ్ళు త్రాగటం మొదలుపెట్టాడు.

వంటఇంట్లో చప్పుడయ్యేసరికి సుందరమ్మకు మెళుకువ వచ్చింది. పెద్దన్నను లేపి "ఒరే, నాయనా, దొంగలురా! దొంగలు" అన్నది. కొడుకూ, కోడలు గాభరాపడి "ఎక్కడ? ఎక్కడ" అంటూ లేచారు. పెద్దన్న దుడ్డుకర్ర పుచ్చుకున్నాడు అంతా కలిసి నెమ్మదిగా వంటఇంటి దగ్గరి కొచ్చి తొంగి చూచారు. చూస్తే ఏముంది? దేముడిగూటి కెదురుగా కూర్చుని వున్నాడు సిద్దన్న-విభూతిపండులో మిగిలిన ఆఖరిముక్క నోట్లోవేసుకుని గ్లాసెడు మంచినీళ్లు తాగేడు. "అయ్యో. అదేమిట్రా విభూతి తింటున్నావు" అని తల్లి అడిగితే.

"అధికస్య అధికం ఫలం" అన్నాడు సిద్దన్న. తల్లీ పెద్దకొడుకు, ఒకరి మొఖం ఒకరుచూసుకున్నారు. కోడలు తనలో తాను నవ్వుకుంది.

తెల్లవారేసరికి సిద్దయ్యకు కడుపుబ్బి జ్వరం వచ్చింది. ఇదేమి ఖర్మమా అనుకుని, సుందరమ్మగారు వైద్యుణ్ణి పిలుచుకురావటానికని వెళ్లింది. కోడలు వంటయింట్లో పనిచేసు కుంటోంది. సిద్దయ్య సావిట్లో మంచంమీద కూర్చుని, శూన్యంకేసి చూస్తున్నాడు. కొంతసేపటికి అతని కేదో ఆలోచన తట్టింది. అతనిదృష్టి భావిదగ్గర వున్నదాలి గుంటమీద, దానిమీద వున్న పెద్ద కాగుమీద పడ్డది. వెంటనే లేచి, అక్కడి కెళ్లాడు. కాగలో సగంవరకు నీళ్లువున్నై. నీళ్లు బాగా వెచ్చపడలేదు. సిద్దయ్య నెమ్మదిగా కాగులోకి దిగి, అతికష్టంమీద నడుము చేతులు కాగులోనికి దూర్చి కూర్చున్నాడు. నీళ్లు అతని గొంతు వరకూ వొచ్చినై. కాసేపటికి నీళ్లు వేడెక్కనై. సిద్దయ్యవొళ్లు చిటపటలాడటం మొదలుబెట్టింది. అది లెక్కచెయ్యకుండా, సిద్దయ్య జపం ప్రారంభించాడు: "ఉష్ణం ఉష్ణేన శీతలం" అంటూ. కాస్సేపటికి నీళ్లు బాగా వేడెక్కనై. సిద్దయ్య జపస్థాయి కూడా హెచ్చింది. నీళ్లు వేడెక్కనకొద్దీ, జపవేగంకూడా ఎక్కువైంది.

గుక్క తిప్పుకోకుండా "ఉష్ణం ఉష్ణేన శీతలం" అని సాగించాడు. నీళ్లు బాగా మసిలినై. కాగులో ఒళ్లుకూడా కాలుతున్నది. ఇక లాభం లేదని కాగులోనించి బయటికి రావాలని ప్రయత్నించాడు సిద్దన్న. కాగులో ఇరుక్కుపోవటంచేత ఎంత తన్నుకులాడినా, బయట పడలేకపోయాడు. చివరకు బాధ ఓర్చుకోలేక కాగును అటూ ఇటూ ఒక్క ఊపు ఊపేడు. హరహరా అన్నట్లు ఒక్కసారి కాగు, కాగుతోపాటు సిద్దయ్య దొర్లుకుంటూ పోయి భావిగట్టున వున్న రాయికి కొట్టుకున్నారు. లేకపోతే భావిలో పడవలసిందే. కాగులో నీళ్లన్నీ పోయినై. సిద్దయ్యకళ్లు తేలవేసి మూర్ఛావస్థలో పడ్డాడు. అట్లాగే "ఉష్ణం — ఉష్ణేన -- శీ - త - లం" అని గొణుక్కుంటున్నాడు.

ఇంతలో సుందరమ్మ గారు వైద్యుణ్ణి వెంటబెట్టుకుని వచ్చింది. మంచంమీద సిద్దయ్య లేడు. భావి దగ్గర మూల్గు వినపడేసరికి అక్కడికి వెళ్లి చూచింది. ఇంకేముంది ఆమె ఒళ్లు ఝల్లుమన్నది. "అమ్మయ్యో, ఇంకేముంది రండర్రో, వారా, పీరా" అని కేకలు వేసింది.

వైద్యుడితోసహా నలుగురూ పోగైనారు. ఆముదం సహాయంతో సిద్దయ్యను ఎట్లాగైతేనేమి బైటకు లాగి తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టారు. వైద్యుడు కంద గడ్డలాగా ఎఱ్ఱబారిన సిద్దయ్యఒళ్లంతా తుడిపించి, నాడి పరీక్ష చేశాడు. "అబ్బాయికి జ్వరమేమీ లేదే!" అన్నాడాయన. సుందరమ్మగారికి ఆశ్చర్యం వేసింది! ప్రొద్దునవున్న మాయజ్వరం అప్పుడే ఎక్కడ మాయమైందా అని. వైద్యుడు గారు మందస్మిత వదనారవిందుడై ఏమని సెలవిచ్చారంటే "అమ్మా, మనశాస్త్రాలు ఊరికే చెప్పినయ్యా మరి, ఉష్ణం ఉష్ణేన శీతలం, అని" ఆమాటలు వినేసరికి సిద్దయ్యకాస్త కళ్లు తెరచి చూచాడు. అంతా గొల్లున నవ్వారు. ఇక మీవాడికేమీ ఫరవాలేదు. రెండుజాముల ప్రొద్దెకినతరువాత చారు అన్నం పథ్యం ఇవ్వండి అని చెప్పి వైద్యుడు వెళ్ళిపోయాడు.

పొలం వెళ్లిన పెద్దన్న భోజనానికి ఇంటికి తిరిగివొచ్చాడు. భోజన సమయంలో, సుందరమ్మ గారి ద్వారా జరిగిన సంగతంతా తెలుసుకుని చాలా విచారిస్తూ "వాడికి, చదవేస్తే ఉన్నమతి కాస్తా పోయినట్టుందే!" అన్నాడు. సుందరమ్మ గారు అందుకుని "నాయనా, అదేరా నేనూ అనుకునేదీ! ఇహ వాడికి బడీ వొద్దు, బడుద్ధమూ వొద్దు! మననాలుగావుల్ని మళ్ళ వేసుకున్నా హాయిగా బ్రతుకుతాడు" అన్నది.

"అంతే" అంటూ ఒక్క నిట్టూర్పు విడిచాడు పెద్దన్న.

రహస్యమంటే

(32 వ పేజీ తరువాయి)

నాకోసమని కొంది నాన్నా! కొని, నాన్న ఇంటికి వచ్చాక 'పువ్వు లెక్కడివే?' అని అడిగితే, మరేమో 'మేము ఆ వీథిలో వాళ్ల ఇంటికి వెళ్లాం. వాళ్లు తాంబూలంలో పెట్టిఇచ్చారు' అని చెప్ప మంది చూడు నాన్నా!" అని చెప్పి "నీతో చెప్పేనని మళ్ళీ అమ్మతో చెప్పకేం, కోంబడుతుంది." అంది, చేతితో సంజ్ఞలు చేస్తూ. "చూడు నాన్నా! పువ్వు లెంత బాగున్నాయో పెట్టుకొంటే!" అని తల వెనక్కి తిప్పి తండ్రికి చూపించింది.

పిల్ల అల్లరిచేసి కొనిపించి ఉంటుందని తండ్రి అనుకొని, చూసి సంతోషించాడు. కోటు తీసి చిలుక కొయ్యకి తగిలించాడు.

ఇంతలో తల్లి చేద తీసుకొని ఇంటిలోకి వచ్చింది. తండ్రిఎదుట సుశీల అమ్మతో "అమ్మా! మరేమో, నాన్నతో చెప్పేశాను. నువ్వు పువ్వులు కొనిపెట్టి, వాళ్ల ఇంటికి వెళ్లితే వాళ్లు తాంబూలంలో పెట్టి మనకి ఇచ్చారని చెప్ప మన్నావని" అంది సుశీల ఉత్సాహంతో.

తల్లి, చేతిలో చేద కిందపెట్టడం మాట మరిచిపోయి, రెండో చేతితో బుగ్గలు నొక్కుకొంటూ నిల్చుండిపోయింది.

"రహస్యం దాని కడుపులో దాగుతుం దనుకొన్నావు! ఏమి. పాపం!" అన్నాడు తండ్రి చిరునవ్వుతో.

"నేను కొనసే అమ్మా అంటూంటే ప్రాణం తీసి పోసే పిల్ల కదా పాపం అని జాలిపడి కొని, ఇన్ని చెప్పితే, అప్పటికి గంగిరద్దు లాగు బుర్ర ఆడించి నాన్న రాగానే చెప్పేస్తావు? అవ్వ" అంది తల్లి నోటికి చెయ్యి అడ్డుపెట్టకొని.

"ఏం. చెప్పితే?" అంది సుశీల.

"అయినా దానితో రహస్య మేమిటి. నామొహం గాని!" అని తల్లి పైకి అనుకొంది.

"నీకు జ్ఞానం రావడానికి!" అన్నాడు తండ్రి.

"రహస్యమంటే?" అందిసుశీల.

తల్లి. తండ్రి ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు.

టామ్ సాయర్

(31-వ పేజీ తరువాయి)

కొన్ని మంత్రాలు చదువుతూ ప్రమాణంచేశారు.

"హాక్! జనం ఏమనుకుంటున్నారు?"

"అబ్బ ఒకటేమాటరా ఎక్కడ చూసినా. మఫ్‌పాటర్, మఫ్‌పాటర్ మఫ్‌పాటర్. ఆ మాటలు వింటుంటే నాకు తెగచెమట పట్టుతోంది. అందుకే ఎక్కువగా ఊరిబయటే తిరుగుతున్నాను," అన్నాడు హాక్.

"నాకూ అల్లాగే వుంది. మఫ్‌పాటర్ని ఉరితీస్తారనుకుంటా. నీకు వాడిమీద జాలి కలగటంలా?"

"జాలి కలుగుతోందనుకో, ఏం చేస్తాం? పాపం చాలా మంచివాడు. ఎప్పుడూ చేపలు పడుతూ వుంటాడు, అవి అమ్మి తాగటానికి. ఒకసారి నాకు ఒక చేపని సగం కోసి యిచ్చాడు. చాలాసార్లు నేను కష్టాల్లో వున్నప్పుడు సహాయం చేశాడు."

"నాకూ అంతే హాక్. నా గాలిపడగలు, చేపలగాలం బాగు చేసిపెట్టేవాడు. వాణ్ణి ఖైదులోనించి తప్పించవచ్చనుకుంటా మనం."

"మనకేం చాతవుతుంది? ఒకవేళ తప్పించినా మళ్ళీ పట్టుకుంటారు," అన్నాడు హాక్.

"నిజమే. కాని పాపం అంత మంచివాణ్ణి అంతా తిడుతుంటే వినలేకుండా వున్నా." అన్నాడు. టాం.

ఈవిధంగా ఇద్దరూ చాలసేపు మాట్లాడారు. కాని దానివల్ల వాళ్ళ మనస్సులు ఊరటపడలేదు. సాయంత్రమైనతరవాత చాలాసేపు జైలు చుట్టూ ఊరికే కాళ్లుకాలిన పిల్లుల్లాగా తెగ తిరిగారు. పిట్టకథల్లో మాదిరిగా చివ్వరికి ఏ దేవతలన్నా వచ్చి మఫ్‌పాటర్ని రక్షిస్తారని ఎదురుచూశారు. కాని అలాంటిదేమీ జరగలేదు. ఆ దురదృష్టవంతుడిమీద దేవతలకెవ్వరికీ జాలికలిగినట్టు లేదు.

అప్పుడక్కడ జైలుకాపలావాళ్ళెవరూ లేరు. టాం, హాక్ కటకటాలగుండా మఫ్‌పాటర్‌కి కాస్త పొగాకు అందించారు. ఈ పిల్లలు తనకిల్లాంటి దయచూపించినప్పుడల్లా పాటర్ దణ్ణం పెట్టి కృతజ్ఞత తెలియజేస్తూవుంటాడు. ఆ సమయాల్లో వాళ్లు విచారంతో కుంగిపోయేవారు. ఈసారి అల్లాగే పాటర్ దణ్ణంపెట్టాడు. మునపటికంటే ఎక్కువగా వాళ్ళకి బాధ కలిగింది. మఫ్‌పాటర్‌కి తాము అన్యాయం చేస్తున్నట్టనిపించింది.

మఫ్‌పాటర్ ఇల్లా అన్నాడు.

"నామీద ఇంతదయ చూపించేది మీ రొక్కళ్ళే. నేను దాన్ని మర్చిపోలేను. అప్పుడప్పుడు నేనేమనుకుంటానంటే, 'నేను ఊళ్ళో పిల్లల గాలిపడగలు, గాలాలు బాగుచేసి యిచ్చేవాణ్ణి. చేపలు బాగా దొరికేచోట్లు చూపించేవాణ్ణి. నేను కష్టాల్లో పడేటప్పటికి వాళ్లంతా నన్ను మర్చిపోయారు. కాని టాం మర్చిపోలేదు. హాక్ మర్చిపోలేదు. నేనూ వాళ్ళని మర్చిపోను.' అని. సరే టాం! జరిగిందేదో జరిగింది. బాగా తాగివున్నానేమో అప్పుడు వొళ్లు తెలియక డాక్టర్ని చంపేశాను...... అహాహా...ఆ విషయం మాట్లాడను లెండి. మీకు కష్టం కలిగిస్తున్నట్టున్నాను. ఇంతకీ నే చెప్పేదేమంటే మీ రెప్పుడూ తాగద్దు. తాగకపోతే జైల్లో పడే గతి రాదు. మీకు కష్టాల్లో వున్నప్పుడు మీలాంటి చిట్టిచిట్టి స్నేహితుల్ని చూడటంకాస్త తృప్తిగా వుంటుంది. ఏదీ, ఒకళ్ళ వీపుమీద వొకళ్ళు ఎక్కండి. మీతో 'షేక్‌హాండు' చేస్తాను. ఆ, అల్లా...మీ చేతులు చిన్నవి. ఈ చువ్వల్లోంచి తేలిగ్గా దూరతాయి. నావి పెద్దవి కదూ, చువ్వల్లో పట్టవు. కాని మీవి చిన్న చేతులైనా అవి మఫ్‌పాటర్‌కి ఎంతో సహాయం చేశాయి. అవసరమైతే ఇంకా చేస్తాయికూడాను."

ఈమాదిరిగా పాపం మఫ్‌పాటర్ ఒక చిన్న ఉపన్యాసం యిచ్చాడు. టాం దాదాపు ఏడుస్తూనే యింటికి వెళ్ళాడు. ఆ రాత్రి అన్నీ పీడకలలే. మర్నాడు, ఆ మర్నాడు కోర్టుచుట్టూ తిరిగాడు. లోపలికి వెళ్ళి ఏదన్నా ఘనకార్యం చేద్దామనిపించేదికాని బలవంతాన ఆ కోరిక ఆపుకున్నాడు. హాక్‌పనీ అలాగే వుంది. ఇద్దరూ ఒకళ్ళకొకళ్ళు కనిపించకుండా తప్పించుకు తిరిగారు; కాని ఏదో ఆదుర్దావల్ల కలుసుకోకుండా వుండలేకపోయారు.

రెండోరోజు సాయంత్రానికి ఎవర్నడిగినా ఒకటే మాట; ఇంజన్‌జో సాక్ష్యం బలంగా వుందనీ, మఫ్‌పాటర్‌కి ఉరిశిక్ష తప్పదనీ.

ఆ రాత్రి టాం ఇంటికొచ్చేటప్పటికి జామురాత్రి అయింది. కిటికీ

గుండా దూరివచ్చి పడుకున్నాడు.

మర్నాడు పొద్దుటికల్లా కోర్టు కిటకిటలాడిపోయింది. మగ, ఆడ జనం ఇసకవేస్తే రాలనట్టు కిక్కిరిసి కూర్చున్నారు. జడ్జీలు, ప్లీడర్లు అంతా ఎవళ్ల స్థానాల్లో వాళ్ళు కూచున్నారు. మఫ్‌పాటర్ని పోలీసులు తీసుకొచ్చి బోనులో నుంచో పెట్టారు. అతని ముఖాన నెత్తురు చుక్క లేదు. నీరసంగా, ఇనపసంకెళ్ళ బరువుకూడా మొయ్యలేనట్టున్నాడు. జనమంతా మఫ్‌పాటర్ కేసీ, ముఖ్యసాక్షి అయిన ఇంజన్ జోకేసీ అదేపనిగా చూస్తున్నారు.

తరవాత కొంతసేపటిదాకా ప్లీడర్లు గుసగుసలాడుకోవటం, కాయితాలు తిరగెయ్యటం తప్ప మరేమీ జరగలేదు.

ఒక సాక్షిని పిలిచారు; హత్య జరిగిన తెల్లవారుజామున మఫ్‌పాటర్ ఊరిబైట కాలవలో కాళ్ళూ, చేతులు కడుక్కుంటూండగా తను చూశాననీ, తన్ని చూడగానే మఫ్‌పాటర్ బెదురుతూ దొంగచూపులు చూస్తూ వెళ్లిపోయాడనీ, ఆ సాక్షి చెప్పాడు.

గవర్నమెంటుప్లీడరు సాక్షిని కొన్ని ప్రశ్న లడిగినతరవాత, మఫ్‌పాటర్ తరఫు ప్లీడరు "నే నేమీ ప్రశ్నలు వెయ్యను," అన్నాడు. పాటర్ తలెత్తి చూసి మళ్ళీ దించుకున్నాడు.

తరవాత సాక్షి తను శవం పక్కన పాటర్ బాకును చూసినట్టు సాక్ష్యం చెప్పాడు. పాటర్ తరఫు ప్లీడరు ఇతన్నిగూడా అడ్డుప్రశ్నలు వెయ్యలేదు.

మూడో సాక్షి ఆ బాకును పాటర్ వద్ద చాలాసార్లు చూసినట్టు సాక్ష్యమిచ్చాడు. పాటర్ ప్లీడరు ఇతన్నీ ప్రశ్నించలేదు. ఇదే విధంగా అనేకమంది సాక్షులు వచ్చి మఫ్‌పాటరే హంతకుడని ఋజువు చెయ్యటానికి సాక్ష్యా లిచ్చారు. పాటర్ పక్షాన వాదించవలసివున్న ప్లీడరు ఎవళ్ళనీ అడ్డు ప్రశ్నలు వెయ్యకుండా వదిలిపెట్టేశాడు. జనం తలో రకంగా అనుకోటం ప్రారంభించారు. ఆ ప్లీడరుకు నోట్లో నాలికే లేనట్టుందనీ, వాదించటం చేతకాదనీ, లంచంపుచ్చుకుని పాటర్ని ఉరిశిక్షకు వదిలిపెడుతున్నాడనీ గుసగుసలు బయలుదేరాయి

చివరికి గవర్నమెంటుప్లీడరు "నమ్మకస్థులైన సాక్షుల చేత సాక్ష్యా లిప్పించాము. వాటివల్ల మఫ్‌పాటరే హంతకుడని ఋజువవుతున్నది. జడ్జీలు ఇక తమ అభిప్రాయం తెలపాలని కోరుతున్నాము." అని చెప్పి కూర్చున్నాడు.

పాటర్ పాపం నిరాశతో మూలిగాడు. మొహం చేతుల్లో కప్పుకుని అటూ యిటూ వూగుతున్నాడు. కోర్టంతా చీమ చిటుకంటే వినబడేలాగ నిశ్శబ్దంగా వుంది. చాలమంది మొగవాళ్ళు పాటర్ మీద జాలి కనబర్చారు. ఆడవాళ్లు కన్నీళ్లుకూడా కార్చారు.

పాటర్ తరఫు ప్లీడరు గభీమని నుంచున్నాడు. జడ్జిగారికేసి తిరిగి.

"మఫ్‌పాటర్ తాగిన నిషాలో ఉండి తెలియక హత్యచేశాడని, కనక అతడు బుద్ధిపూర్వకంగా చేసిన నేరంకాదనీ పొద్దున నేను వాదనలో చెప్పాను. ఈ వాదనని రద్దుచేసుకుంటున్నాను... (గుమాస్తాకేసి తిరిగి) థామస్‌సాయర్‌ని పిలవండి ఒక్కసారి," అన్నాడు.

ఈ మాటలు వినేసరికి అందరూ "ఏమి టిది ?" అన్నట్టు ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసుకున్నారు. పాటర్ కూడ ఆశ్చర్యపోయాడు. టాం భయపడుతూ, బెదురుచూపులు చూస్తూ సాక్షుల బోను ఎక్కి నుంచున్నాడు. అందరి చూపులూ టాంకేసే చూస్తున్నాయి.

"దేవుని ఎదుట నిలిచి సత్యమే తప్ప మరేదీ చెప్పనని ప్రమాణం చేస్తున్నాను." అని టాంచేత ప్రమాణం చేయించారు కోర్టువాళ్లు.

పాటర్ ప్లీడరు అడిగాడు.

"థామస్‌సాయర్! జూన్ 17వ తేదీనాడు అర్ధరాత్రప్పుడు ఎక్కడున్నావు ?"

టాం గుటకలువేస్తూ ఇంజన్ జోకేసి చూశాడు. ఇక అంతే. నోట్లోంచి మాట పెగల్లేదు. జనం చెవులు రిక్కించుకున్నారు టాం చెప్పేది వింటానికి. కాని మాటలు

రాందే! కొంతసేపటికి టాం నిలవ దొక్కుకుని అన్నాడు.

"శ్మశానంలో..."

"కొంచెం గట్టిగా చెప్పాలి. భయపడకు."

"శ్మశానంలో..."

ఇంజన్‌జో ముఖంలో "పడి శావ్‌లే" అన్నట్టు ఒక నవ్వు కనిపించింది.

"హార్స్ విలియమ్సును పాతిపెట్టినచోటుకి దగ్గిరగా వున్నావా?"

"అవునండి సార్."

"ఇంకా గట్టిగా చెప్పు... ఏమాత్రం దగ్గిరగా వున్నావు?"

"మీరు, నేను ఇప్పుడు నుంచున్నంత దగ్గిరగా నుంచున్నాను."

"ఎక్కడ నక్కాడా గివున్నావా?"

"ఆ."

"ఎక్కడ?"

"గోరీ పక్కగా రావిచెట్లున్నాయి. వాటి చాటున."

ఇంజన్‌జో ఉలిక్కిపడ్డాడు. కాని అది ఎవ్వరూ చూడలేదు.

"నీతో ఇంకా ఎవరన్నా వున్నారా?"

"ఉన్నారు సార్, నాతో కూడా......"

"ఆగు, కాస్సేపాగు. నీతో వున్న మనిషి పేరు ఇప్పుడు చెప్పద్దు. తరవాత అతని సంగతి చూద్దాం. నువ్వు ఏమేమి తీసుకువెళ్లావ్ అక్కడికి?"

టాంకి కంగారుపుట్టింది. తటపటాయించాడు.

"చెప్పు అబ్బాయ్ భయపడద్దు. నిజాన్ని మేము గౌరవిస్తాం. నీతో ఏం తీసుకెళ్ళావ్?"

"ఏమీ లేదండి. ఒక...ఒక... చచ్చిన పిల్లిమాత్రం..."

కోర్టులో నవ్వు బయల్దేరింది. కాని జడ్జీగారు "ఉష్," అని ఆ నవ్వుని అణిచేశారు.

"ఊ. అయితే ఇహ చెప్పు. వరసగా నువ్వేమి చేసిందీ, ఏమి చూసిందీ చెప్పు. ఏమీ వదిలిపెట్టకు."

టాం చెప్పసాగాడు. మొదట్లో మాటలు తోచలేదు. కాని ధైర్యం తెచ్చుకున్నాడు. ఇప్పుడు మాటలు వాటంతట అవే దొర్లుకొస్తున్నాయి. కాస్సేపటికి కోర్టంతా నిశ్శబ్దమైంది. టాం ఒక్కడిమాటలే స్పష్టంగా, గట్టిగా వినిపిస్తున్నాయి. నోరు తెరుచుకుని టాం చెప్పే భయంకరమైన కథని అంతా వింటున్నారు.

"—డాక్టరు బండరాయి నెత్తి పాటర్ నెత్తిమీద కొట్టాడు. పాటర్ పడిపోయాడు. ఇంజన్‌జో వెంటనే బాకు తీసి డాక్టర్ని..."

ఠాప్! ఠీప్! ఇంతసేపూ కాళ్లు గజగజ వణుక్కుంటూ ఈ సాక్ష్యమంతా వింటూ నుంచున్న ఇంజన్‌జో దగ్గర్లో వున్న కిటికీ గుండా దూకి, పట్టుకోవచ్చేవాళ్లందర్నీ దాటుకుని ఉడాయించాడు.



రచన:

శ్రీ డి. రామలింగం

అనగనగా ఒక రాజు. ఆ రాజుగారు ఒకనాడు క్షవరం చేయించుకొంటూ మంగలితో కులాసాకబుర్లు మాట్లాడుతున్నారు. ఆ మంగలి చాలా తెలివికలవాడు. ప్రశ్నలకు సమాధానా లివ్వడలో నేర్పు గలవాడు. రాజుగారు అద్దంలో చూచుకొంటూ "ఏమిరా మంగలీ, నీవు నెల కెంత సంపాదిస్తావు?" అని అడిగారు.

"మీకు తెలియదా ప్రభూ, నా సంపాదన నెలకు అయిదురూపాయలు" అన్నాడు మంగలి.

"అయిదురూపాయలే! ఇంత డబ్బుతో ఏమి చేస్తావు" అని మళ్ళీ రాజుగారు అడిగారు.

ఆ రోజులలో అయిదురూపాయలంటే సామాన్యం కాదు. రూపాయకు బస్తాబియ్యం వచ్చేవి. అందుచేతనే రాజుగారు అలా అడిగారు.

ఈ ప్రశ్నకు మంగలి సమాధానమిస్తూ "ప్రభూ, ఒక రూపాయి నా తిండికి సరిపోతుంది. రెండవ రూపాయి నేను చెల్లించవలసిన అప్పుకు ఇచ్చుకుంటాను. ఒక రూపాయిని వెనకేసుకుంటాను. ఒక రూపాయి పారవేస్తాను. అయిదవ రూపాయితో ఒక శత్రువుకు తిండి పెడతాను" అన్నాడు.

రాజుగారు ఈ సమాధానం విని ఆశ్చర్యపొయ్యారు. "ఏమిరా మంగలీ, చమత్కారంగా జవాబిచ్చావు" అన్నారు.


"లేదు ప్రభూ, ఇది చమత్కారం కాదు. నేను తమకు నిజాన్నే విన్నవించుకుంటున్నాను. నేను చెప్పిన ప్రతిమాటా నిజమే" అన్నాడు మంగలి.

"నీతిండిమాట నిజమే. కాని మిగతాజవాబులు బలే చమత్కారంగా చెప్పావు" అన్నారు రాజుగారు మంగలివేపు చూస్తూ.

"ఆ జవాబులుకూడా యథార్థాలే ప్రభూ, ఎలాగని అంటారా? నాకు ముసలివాడైన తండ్రి వున్నాడు. నేను ఆయన కొడుకును కాబట్టి నన్ను చిన్నతనంనుంచి పెద్దవాడినిచేశాడు. ఆయనకు నేనుఋణపడి వున్నాను. కనుక ఆయనకో రూపాయి. నాకొక కొడుకుఉన్నాడు. వాడికి ఒకరూపాయిఖర్చుపెడతాను. అది నాకొక విధమైన మిగిలింపు. నాకొక కూతురుకూడా వుంది. కూతురుకు ఖర్చుపెట్టేరూపాయి పారవేసిన దానితో సమానమే. ఎందుకంటారా అది ఎప్పుడో ఒకనాడు మా ఇంటినుంచి తన అత్తవారింటికి వెళ్ళిపోతుంది." అని చెప్పి మంగలి ఒక క్షణం ఆగిపొయ్యాడు.

(43-వ పేజీ చూడండి)

వింతమనిషి



మూలం:
వనఫూల్

అనువాదం:
శ్రీ ఎస్. వసంతకుమార్

కలకత్తా ప్యాసింజరులో మూడవక్లాసులో వేసవికాలంలో ప్రయాణంచేసే వ్యక్తి అవస్థ చెప్పడం కంటె ఊహించటమే చాలా మంచిది. "అయ్యా కాస్త అడ్డం తీస్తారూ, దొడ్లోకి వెళ్ళాలి" అని ఓ వ్యక్తి నన్ను దాటుకుంటూ వచ్చాడు. నేను ప్రక్కకి తొలగి ఆయనికి దారి ఇచ్చాను. నుంచోటానికి కూడా వీలులేదేరా భగవంతుడా అని "లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె..." అంటూ మనసులో ప్రార్థించాను. బహుశా నా మొర వినపడింది కాబోలు "అక్కడేం నుంచుంటారు? ఇలా రండి" అని ఓ అపరిచితవ్యక్తి ఆహ్వానించాడు. బహుశా అప్పుడు భగవంతుడే ఆ అవతారంలో వచ్చిఉంటాడని ఊహించుకుని అక్కడికి చేరాను. ఆ వ్యక్తి నన్ను చూసి "మీరు వేరేవిధంగా భావించకపోతే ఆ పెట్టిమీద కూర్చోవచ్చు. అది మీలాంటివాళ్ళను పదిమందినైనా మోస్తుంది" అని అన్నాడు. "థాంక్స్" అంటూ కూలబడ్డాను ఆ పెటిమీద. "చగన్ లాల్ నాకు మంచి పెట్టి ఇచ్చాడు. ఎందుకంటే అతని యజమాని నాచేతిలో ఉన్నాడు" అని ఆ వ్యక్తి నాతో తన పెట్టెనుగూర్చి చెప్పటం ప్రారంభించాడు.

"అలాగా అండి" అతను చెప్పినదాన్ని

నవ్వినట్లుగా. "నిజంగా! చగన్‌లాల్‌కి మంచి సరుకు కానిది నాకు ఇవ్వటానికి ధైర్యం లేదు. ఒక్క గట్టిదే కాదు ఎంత అందంగా ఉందో చూశారా?" అయితే దీని ధర ఎంత ఉంటుం దంటారు?" నావంక అదోమాదిరిగా చూస్తూ ప్రశ్నించాడు. ఏదైనా ఒక వస్తువుధర ఊహించి సరిగా చెప్పటం అనేది అంత తేలికైన పని కాదు. అయినా "ఇరవై రూపాయలు అనుకొంటాను. ఒకవేళ ఉంటే అంతకన్నా ఎక్కువ ఉండొచ్చు" అన్నాను అతను నవ్వుతూ మీరు సరిగ్గా చెప్పారు. అది అసలు ధర. కాని నేను ఇచ్చింది పన్నెండు అణాలు." అన్నాడు.

"పన్నెండణాలా!"

"అసలు చగన్‌లాల్ ముప్పావలా కూడా తీసుకోనన్నాడు. నేనతనికి రూపాయి ఇచ్చాను తీసుకోమని కాని అతను అర్ధరూపాయి తిరిగి ఇచ్చాడు. కాని అంత తక్కువ ధరకి తీసుకోవటం నాకు ఇష్టం లేదు. కాని చగన్ అంతకన్నా ఎక్కువ తీసుకుంటానికి ఒప్పుకోలేదు. చివరకి విసిగెత్తి ఒక పావలా తీసుకుని మిగతా పావలా ఇచ్చాను. ఇహ తిప్పదురా అన్నట్లుగా ఆ పావలా పుచ్చుకున్నాడు చగన్"

నాకు ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు. కాని ఇంతలో ఆయనే "నేను అందరిలాంటివాడినే కాని నా స్నేహితులు, నాకు వాళ్ళతో గల పరిచయం నాకు చాలా గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. "ఇవి చూడండి. వీటి ధర ఎంతో చెప్పండి" అని ఒక జత బూట్లు చూపించాడు.

"సుమారు పన్నెండు రూపాయలుండొచ్చు."

"మీరు నమ్మండి, నమ్మకపోండి, మిస్టర్ రాయ్, వీటికి నా వద్దనుంచి పావలా తీసుకున్నాడు. అయితే అతను పావలా తీసుకోటానికి ఒక కారణం ఉంది. వాళ్ళ అబ్బాయికి నేను గవర్నమెంటులో ఉద్యోగం ఇప్పించాను"

నా కిదంతా అగమ్యగోచరంగా ఉంది. ఈ ప్రపంచంనుండి దూరంగా ఉందామని నేను పత్రిక తీసి చదవటం ప్రారంభించాను కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగానే గడిచినై.

"ఏం పుస్తకం సార్ అది"

"మాసపత్రికండీ. ఒక కథ చదువుతున్నాను."

"ఎవరు రాసింది?"

"పన్నాలాల్ చక్రవర్తి"

"అవును. ఆ అమ్మాయి బాగా రాస్తుంది"

"అమ్మాయి! పన్నాలాల్ చక్రవర్తి ఆడదా?"

"సన్నగా నాజూగ్గా ఉంటుంది ఆ అమ్మాయి"

నాకు నమ్మకం కలగకుండా ఉంది. పన్నాలాల్ చక్రవర్తి కథలంటే నాకెంతో ఇష్టం అతను నా అభిమాన రచయిత. అయితే అటువంటి వ్యక్తి పురుషుడు కాదు స్త్రీ అంటే నమ్మటం ఎలా?

"ఆమె వయస్సు షుమారు 20 సం॥ ఉంటయ్. చాలా అందంగా ఉంటుంది. ఆ అమ్మాయి నాకు బాగా తెలుసు. వాళ్ళ నాన్న నాకు బాగా తెలుసు. నిజంగా నిర్మల చాలా తెలివిగలది"

"నిర్మల ఎవరు?"

"పన్నాలాల్ చక్రవర్తి అసలు పేరు నిర్మల. ఆ పేరుతో కథలు రాస్తుంది."

నే నేమీ మాట్లాడకుండా వింటూ కూర్చున్నాను. ఆయన మళ్ళీ ప్రారంభించాడు.

"నిర్మల రచయిత్రే కాదు, చక్కగా గుర్రపుస్వారీ చేస్తుంది. సైకిలు తొక్కుతుంది. పాడుతుంది. చక్కటి నటి. ఈమధ్య ఏదో పోటీలలో ఉత్తమనటిగా బహుమతికూడా వచ్చింది. ఆమె ఈ దేశంలో పుట్టింది కాని అసలు మరేదేశంలోనైనా పుట్టిఉంటే ఈ పాటికి అంతర్జాతీయ ప్రఖ్యాతి పొందేది. అసలు ఈ దేశంలో సరియైన టాలెంట్సు ఉన్నవాళ్ళని పైకి రానివ్వరు. వాళ్ళ నాన్న ఆమెకు వివాహం చెయ్యాలని పట్టుపట్టాడు. కాని నిర్మలకి వివాహంమీద అంత నమ్మకం లేదు. తన అభిప్రాయాలకి ఆదర్శాలకి తగిన వరుడు లభ్యమయేదాకా తను వివాహం చేసుకోనంది"

ఆయ నంత నమ్మకంగా ఆ అమ్మాయి చరిత్ర చెప్పుతుంటే నమ్మకపోటం ఎలా? నేను ఇంకా కొన్ని విషయాలు అడుగుదామనుకున్నా కాని అయన ఇంతలో కన్ను మూశాడు బహుశా ఏవో స్వప్నాలు కంటుంటాడు తియ్యగా.

రైలు నెమ్మదిగా పోతోంది చీకటిని చీల్చుకుంటూ, తర్వాత స్టేషనులో నాప్రక్క నున్న ఇద్దరు ప్రయాణీకులు దిగటంవలన నాకు చోటు దొరికింది. నిద్రపోదామని ఎంతో ప్రయత్నించాను కాని "పన్నాలాల్ చక్రవర్తి- నిర్మల" విషయం మనసులో మెదులుతూ ఉండటంవల్ల నిద్ర రాలేదు అలాగే ఏవేవో అవ్యక్తపు ఆలోచనలతో కాలం గడిపాను. ఉదయం రైలు 'బండేల్' స్టేషనులో ఆగింది. మా బెంచీ పైన పడుకున్న ఓ పెద్దమనిషి దిగి మొఖం కడుక్కొని ఓ అరకప్పు 'టీ' సేవిస్తున్నాడు. నేను ఆయనని అనుసరించి టీ పుచ్చుకున్నాను. నా మిత్రుడు వాంటెడ్ కాలమ్స్ చూస్తున్నాడు పత్రికలో. ఇంతలో ప్లాటుఫారంమీద ఉన్న ఓ వ్యక్తి "హల్లో పన్నాలాల్ బాబూ, ఏం అదృష్టం ఇవాళ? నిన్నిక్కడ కలుసుకుంటానని అనుకోలేదు. ఎక్కడిదాకా ప్రయాణం" అని నా ఎదురుకుండా కూర్చుని టీ త్రాగుతున్న వ్యక్తిని విష్ చేశాడు.

"కొన్నగర్ వెళుతున్నానోయ్" అన్నాడు ఆ వ్యక్తి.

"అయితే ఇక్కడ దిగాలి నువ్వు. ఇవాళ మా 'సమితి' వార్షికోత్సవం. సమావేశం అయిపోగానే నిన్ను నా కారులో అక్కడికి పంపిస్తాను." అని బలిమాలాడు క్రింద నున్న వ్యక్తి.

నేను కలకంటున్నానో లేక మేలుకునే ఉన్నానో అర్థం కాక చెయ్యిగిల్లుకున్నాను. చురుక్ మంది. నేను నా మిత్రుడువంక చూశాను. అతను అదోమాదిరిగా ఉన్నాడు. పేపరు మడిచి "క్షమించాలి! పన్నాలాల్ చక్రవర్తి అని కథలు రాసేది మీరేనా" అని ఆవ్యక్తిని ప్రశ్నించాను

"మీకు తెలియదూ. ఈయనే. ఆ ప్రఖ్యాత రచయిత" అని ప్లాటుఫారం మీద ఉన్న వ్యక్తి, ఆయన్ను చూపిస్తూ అన్నాడు.

"మీకు నా ధన్యవాదాలు. నేను మీ కథలలోని పాత్రల మనస్తత్వ నిరూపణ ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఓ ప్రఖ్యాత కథకుణ్ణి చూడటం నిజంగా ఇవాళ నా అదృష్టం" అన్నాడు నా మిత్రుడు

పన్నాలాల్ బాబు ఆయన స్నేహితుడు ఇద్దరూ వెళ్ళిపోయారు.

నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది ఈ సంఘటన. "క్షమించాలి. మీరు రాత్రి పన్నాలాల్ చక్రవర్తి అంటే 'నిర్మల' అనే అమ్మాయి అన్నారు. పైగా అమ్మాయి మీకు బాగా తెలుసు నన్నారు. ఇప్పుడు ఈయనతో...

"అంతేనా ఇంకేమన్నా చెప్పానా?" ఆయన ప్రశ్నించాడు.

"ఆ అమ్మాయినాన్న మీ స్నేహితుడు. వాళ్ళతో మీకు బాగా పరిచయముందన్నారు. పైగా మీ పెట్టె ముప్పావలాకి, బూట్లు పావలాకి కొన్నానన్నారు"

"నిజంగా అలా అన్నానా?" అయితే

రాజు-మంగలి

(40-వ పేజీ తరవాయి)

"మరి అయిదోరూపాయితో శత్రువుకు తిండిపెడతా నన్నావే. అదేమిటి?" అని రాజుగారు ఆత్రంగా అడిగారు.

"ప్రభూ, నాకొక భార్య వుంది. అది నాకు శత్రువే అని నా అభిప్రాయం." అన్నాడు మంగలి.

"అప్రాచ్యుడా, భార్య శత్రువెట్లా అవుతుందిరా" అని రాజుగారు గద్దించి అడిగారు.

"అయ్యా, ప్రభువులైన తమరి విషయంలో ఈ అభిప్రాయం సరిగాకపోవచ్చు. కాని మాబోటి బీదవాళ్లకు భార్యలు శత్రువులే" అని మంగలి వినయంగా అన్నాడు.

ఈ సమాధానం విని రాజుగారు చాలా సంతోషించి మంగలి చాతుర్యానికి మెచ్చుకొని ఏబది రూపాయల బహుమతి ఇచ్చారు. అయితే ఒక షరతుపెట్టారు. ఆ షరతు ఏమంటే ఈ అర్థాన్ని మంగలి ఎవరితోనూ చెప్పకూడదు. ఒకవేళ చెప్పాడా, మరణదండన విధించబడుతుంది.

మంగలి సంతోషంతో ఇంటికి పోయి ఏబదిరూపాయలు భార్య ముందు పోశాడు. అంత డబ్బును చూచి భార్య ఆశ్చర్యంతో "ఏడాదిపాటు పాటుపడ్డా ఇంత డబ్బు రాదే! ఒక్కరోజులో ఎలా సంపాదించావు" అని అడిగింది.

"నీలాగా నాకు తెలివి లేదనుకున్నావా? తెలివి వుంటే డబ్బు దానంతట అది మన కాళ్ళదగ్గరికే నడిచివస్తుంది" అని సగర్వంగా అంటూ ఆ బహుమతి దొరికిన వైనమును భార్యకు చెప్పివేశాడు మంగలి.

ఇలా వుండగా రాజుగారికి ఒక ఆలోచన తట్టింది. ఆమధ్య రాజ్య వ్యవహారాలు తామే స్వయంగా చూచుకోక అశ్రద్ధచేసి అంతా మంత్రికే అప్పగించారు. వెంటనే మంగలి చెప్పిన సమస్య జ్ఞాపకమొచ్చింది. ఆ సమస్యను తన మంత్రి నడిగి అతడి తెలివితేటలను పరీక్షించాలని రాజుగారు నిశ్చయించుకున్నారు. ఒకవేళ మంత్రి సరిగా జవాబుచెప్పలేకపోయ్యాడా అతడికి మరణశిక్ష వేయాలసిందేనని కూడా నిర్ణయించుకున్నారు.

మరునటిరోజు మంత్రిని పిలిపించి మంగలి వేసిన సమస్యను వల్లించి, జవాబుచెప్పడానికి ఏడురోజుల గడువిచ్చారు. అంతట మంత్రి "ఈపాటిదానికి ఏడురోజులు కావాలా ప్రభూ, రేపే మీకు దీని అర్థం చెబుతాను" అన్నాడు.

"అలా కాదు. నేను ఏడురోజులు గడువిస్తున్నాను. ఎనిమిదవ రోజు తొమ్మిదిగంటలలోపల సమాధానమివ్వకపోతే ఇంతకాలము నుంచీ నీవు నన్నుమాత్రమే గాక నా ప్రజలనుకూడా మోసపుచ్చావని నేను గ్రహించవలసివస్తుంది. అప్పుడు నీకు మరణదండనమే ప్రాప్తి" అని రాజుగారు హెచ్చరించారు.

మంత్రి ప్రతిదినము రాజుగారి మేడకు వెళ్ళివచ్చేవాడు. కాని అతనికి జవాబు తెలియనందున ఆ విషయాన్ని రాజుగారిముందు ఎత్తేవాడు కాడు. ఏడవరోజున రాజుగారే స్వయంగా మంత్రికి ఈ విషయాన్ని జ్ఞప్తిచేస్తూ తానన్నమాట జరిగి తీరుతుందని ఆఖరిసారిగా హెచ్చరికచేశారు.

ఏడవనాటి సాయంకాలపు వేళ ఆగ్రామస్త్రీలంతా దగ్గరి చెరువులో స్నానాలు చేస్తున్నారు. ఇంతలో మంత్రిగారింట్లో పెద్దకేకలు, పెడబొబ్బలు వినపడ్డవి. స్నానాలు చేస్తూన్న వారిలో మంత్రిభార్య కూడా వున్నది. మిగతా స్త్రీలందరూ ఆమె దగ్గరకు వచ్చి "ఏమమ్మా, మీఇంటిలో ఏం జరిగింది? ఎవరైనా చనిపోయ్యారా?" అని అడిగారు. "లేదమ్మా, రాజుగారికి మాఆయనపై చాలా కోపం వచ్చింది. రేపు మరణదండన విధించుతారేమో!" అని కంటనీరుపెట్టింది.

ఈ మాటలను అక్కడే వున్న మంగలి భార్యకూడా విన్నది

ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. నేను ఇప్పుడు మరో వ్యక్తిని."

బహుశా ఇతని మెదడు సరిగా పనిచేయదేమో అని అనుమానం కలిగింది.

"మరోవ్యక్తి అంటే?"

"మీరు ఆశ్చర్యపడవలసిన విషయం ఏమీ లేదు ఇందులో. నాకు కొత్తనల్లమందు అలవాటు ఉంది. అందువల్లనే రాత్రి అలా మాట్లాడిఉంటాను. అంతే" అన్నాడు ఆ మిత్రుడు నవ్వుతూ.

"అరి! భగవంతుడా! ఎంతపని చేశావురా" అని నాలో నేనే నవ్వుకున్నాను నా నల్లమందుభాయిని చూసి.

రాజుగారి కోపానికి కారణమేమిటో తెలిసికోవలెనన్న కుతూహలం ఆమెకు కలిగింది. ఆ రాత్రే దొడ్డి ద్వారిగుండా మంత్రిగారింటికి వెళ్ళి, ఆయన భార్యతో రహస్యంగా మాట్లాడి అసలుసంగతంతా తెలుసుకుంది. మంత్రిభార్యతో "అక్కయ్యగారూ, ఈ మాత్రానికేనా ఇంతవిచార పడుతున్నారు. మనమంతా మన భర్తలకు శత్రువులమేగా ఏముంది ఇందులో!" అన్నది నవ్వుకుంటూ

మరునాటి ఉదయం తొమ్మిది గంటలు కాకమునుపే మంత్రి బయలుదేరి రాజుగారివద్దకు పోయి నమస్కరించి జవాబు చెప్పి నిర్భయంగా నిల్చున్నాడు. ఇతడికి సమాధానం ఎలా తెలిసిందా అని రాజుగారు ఆశ్చర్యంతో వితర్కించుకుంటూ "నిజం చెప్పు నీకిది ఎవరు చెప్పారు? చెప్పకపోయావా నీ ప్రాణాలు దక్కవు" అని గట్టిగా అడిగారు.

"నాకీ జవాబు నా భార్య చెప్పింది" అని మంత్రి అన్నాడు.

అంతట రాజుగారు మంత్రిభార్యను పిలిపించి నిజంచెప్పమని అడుగగా "దీన్ని నాకు మంగలిభార్య చెప్పింది" అని వణుకుతూ ప్రత్యుత్తరం చెప్పింది. రాజుగారుమండిపడి "ఆ ద్రోహిని పిలుచుకురండి. వాడికివాళ చావు మూడింది" అని గర్జించారు.

మంగలి మెల్లగా దర్బారులోకి వచ్చాడు.

"ఏమిరా, నీవు చావుకు సిద్ధమేనా" అని రాజుగారడిగారు.

"చిత్తం ప్రభూ, మీరావిధంగా ఆజ్ఞాపించితే నేను సిద్ధమే" అని నదురు, బెదురు లేకుండా అన్నాడు.

"నీవు ఈ జవాబును నీ భార్యకెందుకు చెప్పావు?" అని రాజుగారు బిగ్గరగా అడిగారు.

"అయ్యా, నా భార్యయే నాకు శత్రువు అని నేను మీతో ఒకమారు అనగా మీరు నమ్మలేదు. దానిని ఋజువుపరచుటకే నేను నా భార్యకు ఈ రహస్యమును తెలిపాను" అన్నాడు మంగలి.

ఈ సంజాయిషీని విని రాజుగారు మంగలి తెలివికి సంతోషించి మరొక అయిదువందల రూపాయలు అతనికి బహుమతిగా ఇవ్వమని మంత్రిని ఆదేశించారు.

షేర్ - ఇ - మాలీస్

కొన్నాళ్ళ క్రిందట విశ్వరూపం పత్రిక ప్రకటించిన ఒక వార్తవిషయంలో ఒక చిన్న పేచీవచ్చింది. ఒక ఊళ్ళో కొందరు ఘరానా ఆసాములు రాజకీయ బాధితులన్న పేరు పెట్టుకుని, యుద్ధంరోజుల నించీ హరిజనులు సాగుచేసుకుంటున్న భూములను గదుముకున్నారని మా విలేఖరి పంపిన వార్తను ప్రకటించాము. అది అబద్ధమనీ, దాన్ని ఉపసంహరించకపోతే ఏమేమిటో చేస్తామనీ బెదిరిస్తూ కొందరు ఉత్తరాలు రాయటంకూడా జరిగింది. దానిమీద మా సంపాదకుడుగారు సంగతిసందర్భాలు విచారించి రమ్మని పంపటంవల్ల అక్కడికి చేరుకున్నాను.

తాలూకాఫీసులో భూములనంబర్లకోసం తాసీల్దారుతో మాట్లాడాలనుకుని ఆయన కోసం ఎదురుచూస్తున్నాను. నాతోపాటు చాలామంది జనంకూడా ఉన్నారు. ఆవలించేవాళ్ళూ, కునుకుపాట్లుపడేవాళ్ళూ—ఈవిధంగా జనమంతా ఉన్నారు. అందులో ఒకాయన యాదాలాపంగా ఎదురుగా ఉన్న స్తంభంమీద దరువు వేయటం ప్రారంభించాడు. నేను జాగ్రత్తగా చూశాను ఆయన మృదంగప్రవీణుడేమోనని - కాని ఆ ధోరణి కనిపించలేదు.

ఆ దరువు మహాగోముగానూ, మృదువుగానూ, పట్టి పట్టి వేస్తున్నట్లూ కనిపించింది... చిటుక్కున ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్లు అసలుసంగతి తట్టింది

"ఏమండీ! మీరు ఒడ్రులా?" అని అడిగాను. ఆయన ఆశ్చర్యపడుతూ "మరేనండీ. మీ కెట్లా తెలిసింది?" అని అడిగాడు.

"మీకు కొంచం మసాజ్ విద్యలో ప్రవేశం ఉన్నట్లుందే?" అన్నాను.

ఆయన చిరునవ్వునవ్వుతూ "ఔనండీ. తమాషాగా కనిపెట్టేశారే!" అన్నాను.

ఇంతలో ఒక బంట్రోతు వచ్చి తాసీల్దారుగారు కమానునించి రావటానికి చాలా టైముపడుతుందని చెప్పటంవల్ల, నేను ఆయన్ని కాఫీకి రమ్మని పిలిచాను. మొదట సందేహించాడు కాని, తరవాత మెత్తబడ్డాడు.

*　　*　　*

"మొత్తానికి తమాషాగా కనిపెట్టేశారే బాబూ" అన్నాడాయన.

"తమాషా ఏముంది? మీరు ఇందాక యాదాలాపంగా ఒక చిన్న వరసను వేశారు. అది పట్టిచ్చింది." అన్నాను నేను.

"ఓహో! అదా సంగతి?"

"మీరు ఈ దేశానికి వొచ్చి ఎన్నాళ్ళయింది?"

"మా తాతగారి కాలంలోనే వచ్చాము."

"మీవాళ్ళు కొన్నేళ్ళపాటు ఇక్కడ ఉండి, తిరిగి వెళ్ళిపోతూఉండటం మామూలు కదా?"

"అది నిజమే. కాని మా తాతగారు ఇక్కడ ఒక నవాబుగారికి మాలీసు చేసేటప్పటికి ఆయన మహాసంతోషపడి ఒక మాన్యాన్నీ, షేర్ - ఇ - మాలీస్ అనే బిరుదునూ ఇచ్చారండి. అప్పటినుంచి ఇక్కడే స్థిరపడిపోయినాం. ఇప్పుడు ఈ ప్రాంతంలో మా వాళ్ళందరికీ నేను పెద్ద మేస్త్రిని. నాకింద చాలామంది ముఠాలు ఉన్నారు."

"తాసీల్దారుగారితో ఏదో పనిఉండి వచ్చారా?"

"ఆయన మాకు ఖాతాదారు. కమాను నించి తిరిగివస్తే, ఆరోజు ఒళ్ళు పట్టాల్సి ఉంటుంది. అందుకని కాస్త కనపడదామని వచ్చాను."

"ఒళ్ళు పట్టించుకుంటే లాభం ఏమిటి?"

"గుర్రానికి మాలీసు చేసినట్లే పాటుపడ్డ మనిషికి అది ఎంతో అవసరం."

"మరి కాలు కదిలించని షావుకార్లకు కూడా మాలీసు ఎందుకు?"

"కాలు కదిలించకపోవటంవల్లనే కావలసివస్తుంది. శరీరంలో ఏ భాగాన్నీ ఉపయోగించకుండా కూర్చునేటప్పటికి ఎక్కడి సరుకు అక్కడ నిలిచిపోతుంది. ఎక్కడికి పోవలసిన నెత్తురు అక్కడికి పోదు. అన్నిటివారా పొట్టలూ, మొత్తలూ పెరిగిపోతయ్."

"దానికితోడు తలకూడా తగ్గిపోతుందనుకుంటాను."

"ఆఁహ? అదెక్కడ జరుగుతుంది. మరీ విడ్డూరం."

"తగ్గుతుందంటే సన్నపడిపోతుందనా? రబ్బర్ బెలూన్ మోస్తరు పొట్ట పెరిగితే, తల మరీ సన్నగా కనిపించదూ?"

"హహ్హహ్హా! ఆ మాట నిజమే. ఈ షావుకార్లు ఘరానామనుష్యులు చూడండి అంతా డైమన్ మార్కు మోస్తరు ఉంటారు. నడుందగ్గర అరమైలువరకూ ఉన్న చుట్టుకొలత తలకాయదగ్గర పదంగుళాలూ, కాళ్ళదగ్గర పన్నెండంగుళాలూ అవుతుంది." అంటూ ఆయన విరగబడి నవ్వాడు.

"అయితే మీరు చేస్తున్నది ఆ డైమన్ మార్కుని ఆర్డర్ముద్దగా చేద్దామనా, లేకపోతే కళావరుగా సర్దుదామనా?"

ఆయన ఉప్పెనగా నవ్వాడు.

"అది సర్దటం మాతరం అవుతుందా? కొవ్వు పేరుకుంటే, పేరుకున్నది కనీసం నెత్తురయినా గడ్డకట్టకుండా చూద్దామనే మా తంటాలు."

"కసరత్ చేస్తే సరిపోదూ?"

"వాళ్ళు చేసేబదులు మా చేత చేయిస్తున్నారు."

"దానివల్ల ఫలితం ఏమన్నా ఉన్నదా?"

"చేతులు - అంటే మా చేతులు - ఆడినంతకాలమూ వ్యవహారం పూర్తిగా చెడకుండా ఉంటుంది."

"నువ్వే లడ్డు నమిలి పెట్టూ, నువ్వే లడ్డుమింగి పెట్టూ అన్నట్లూ, నువ్వే కసరత్ చేసి పెట్టూ అంటారన్నమాట."

"ఉన్నమాట చెప్పారు. మన్లో మాట. నువ్వే లడ్డు నమిలిపెట్టూ అని కూడా అంటారా ఏమిటి?"

"సరిసరి! మీ కింకా తెలియదా ఏమిటి? పళ్ళన్నీ పుచ్చిపోయి తిండితినలేక, నువ్వే లడ్డు నమిలిపెట్టూ అని అడిగినందువల్ల కంపెనీలవాళ్ళు సగం ఉడికిన ఆహారాలనీ, పన్నబిస్కట్లనూ, టాఫీలనూ

సప్లయిచేస్తున్నారు. అదికూడా జీర్ణంకానందువల్ల నువ్వే లడ్డు మింగిపెట్టూ అని అడిగితే, డాక్టర్లు కడుపులో సగం జీర్ణమయినట్లుగా ఆహారాన్ని తయారుచేసి ఇస్తున్నారు. ఆ ఆహారాన్ని పెప్టనైజ్‌డ్ ఫుడ్ అంటారు"

షేర్-ఇ-మాలీస్ నవ్వు ఆపుకోలేక ఆపుకుంటూ "ఇంకా..." అంటూ నసిగాడు.

"ఆహా! అదికూడా జరుగుతున్నది. అందుకనే విరేచనలేహ్యాలూ, ఎనిమాడబ్బాలూ ఎక్కువగా తయారవుతున్నయ్." అన్నాను.

"మహామజాగా చెప్పారండీ. మా ఖాతాదార్లంతా ఈరకంమనుషులేగా! చూస్తే ఒక్కళ్లుకూడా మనుషులల్లే ఉండరు. రాక్షసులమోస్తరు పొట్టలూ, వాళ్లూ. దీనికి ఎదురు రకం మనుషులు కూడా ఉన్నారు. విల్లంబుబద్దల్లాగా వంగిపోయి, మెడ వొంగిపోయి, ఈడుస్తూ, ఏడుస్తూ, నడుస్తారు."

"వాళ్ళకి మీ చికిత్స పని చేయదా ఏమిటి?"

"ఎందుకు పనిచేయదండీ? కాని, వాళ్ళకి మమ్మల్ని భరించే సత్తా ఏదీ? పొద్దున 8 గంటలనుంచి రాత్రి 9 గంటలవరకూ వంచిన తల ఎత్తకుండా చాకిరిచేసే గుమస్తాలూ, ఒక్కపూట తింటే, రెండుపూటలు పస్తుండే బక్క జీతగాళ్ళూ ఏం భరాయిస్తారు? అసలు ఇంకో సంగతి చూశారూ! కడుపులో సరుకులేకపోతే మాలీసువల్ల లాభం ఎక్కడిదీ? పైపెచ్చు ఎండుపుల్లలు విరిగినట్లు విరిగిపోతారు."

"అంతేనంటారా?"

"అంతే కాదు. సరయిన తిండి పడకపోతే మనుషులు పెరగనుకూడా పెరగరు. ఇదివరకు మా దేశంవాళ్లంతా, తెలుగువాళ్ళంటే ఆజానుబాహులనీ, వీరులు, విక్రమార్కులనీ అనుకునేవాళ్లు. ఇప్పుడు ఏముంది? నెయ్యి, పాలు, కూరగాయల వ్యాపారాలు మోపయినతరవాత, ఎక్కడ చూసినా ఏడుపు మొహాలే."

"స్వీడిష్‌మసాజ్ అంటారు, మీకేమన్నా తెలుసా?"

"ఆ అదీ విచారించాను. దానికీ మన మాలీసుకీ అట్టే తేడాలేదు. దేశవాళీమాలీసులో ఒళ్లుపట్టించుకునేవాడు కేవలం మట్టిబొమ్మమోస్తరుగా కూర్చుంటాడు. వాళ్లపద్ధతిలో అయితే మాలీసుకదలికకు ఎదురుపద్ధతిల్లో కండల్ని కదిలిస్తాడు. దీనివల్ల ఇంకొంచం కదలిక వుంటుందని వాళ్ళ నమ్మకం."

"మీ వృత్తికి ఏమయినా భవిష్యత్తు ఉన్నదా?"

"కావలసినంత ఉన్నది. జబ్బుపడ్డవాళ్ళకు మేము ఎంతయినా సాయపడగలం. కసరత్తుచేయని మనుషులూ, తగిన ఆరోగ్యపద్ధతులు లేని దేశం, ఉన్నంతకాలం మాపని బాగానే ఉంటుంది."

"ఆరోగ్యపద్ధతులంటే ఏమిటి?"

"మనిషిశరీరమన్నది సరిగా పనిచేస్తూ ఉండాలంటే దానికి కొంత సక్రమమయిన పని ఉండాలి. లేకపోతే తుప్పుపట్టిన ఇంజన్‌మోస్తరుగా తయారవుతుంది. జనానికి మాటల్లో చూపించే సరదా, పనిచేయటంలో కనిపించదు కదా."

"ఈరోజుల్లో మోటబలం అనవసరమండీ"

"మోటబల మేమిటీ? కులాసాగా బతకటానికీ, రోగం రొష్టూ లేకుండా సుఖంగా కాలం వెళ్ళదీయటానికీ బలం అనేది కావలసిందే. దానికి కొంచం శరీరాన్ని కదిలించక తప్పదు."

"అన్నిపనుల్లోనూ అది సాధ్యపడదుగా?"

"ప్రభుత్వం లక్షలు ఖర్చుపెట్టి స్టేడియంలు కట్టించేబదులు ప్రతివీధికీ ఒక ఆటస్థలాన్నీ ఒక తాలింఖానాను ఏర్పాటుచేస్తే సరి. దానికితోడు మంచి తిండికూడా-"

"ముందు అసలు కడుపు నిండనివ్వండి- సరే మీకు రాజకీయంగా ఏమయినా ప్రాధాన్యత ఉన్నదా?"

"ఒకవిధంగా ఉన్నదనే చెప్పాలి. అధికారులకి ఎదురునిలిచేవాళ్ళందరికీ మేము ప్రాణస్నేహితులం."

"అంటే మీరు అరాజకవాదులా ఏమిటి?"

"అబ్బే! అదేంకాదు. అధికారులకిఎదురు నిలిచేవాళ్లు అంటే చాలు, వాళ్లమీద పోలీసులు తమ నైపుణ్యంఅంతా ప్రదర్శిస్తారు. అప్పుడు మళ్లీ వాళ్ల శరీరాలు స్వాధీనంలోకి రావాలంటే కొన్నాళ్లపాటు మా సహాయం అవసరం."

"ఓహో! అందుకా!"

"అవును. బ్రిటిష్ హయాంలో కాంగ్రెసువాళ్లమీద చిత్రవధానైపుణ్యం ప్రదర్శించిన పోలీసువాళ్లు ఇప్పుడు కమ్యూనిస్టులమీద దానిని చూపిస్తున్నారు. వీళ్ల తస్సాదియ్యా! మనిషిని ఎన్నివిధాల నలగపొడవటం వీలున్నదో, అన్నివిధాలూ వీళ్లకు తెలుసు."

"అందులో రకాలుకూడా ఉన్నయ్యా?"

"ఆహా! అందుకనే మనిషిని చూడగానే. మేము ఆయనమీద ఏ అధికారిచెయ్యి పడ్డదీ పసికట్టేస్తాం. ఒక సబిన్స్పెక్టర్‌గారు నాడాలువేసిన బూటుకాళ్లని ఉపయోగించటంలో అఖండుడు. ఒక హెడ్‌కానిస్టేబుల్‌గారు లాటీప్రయోగంలో నిధి. ఒక సూపర్నెంటుగారు బాక్సింగ్ మాస్టర్. ఒక స్పెషల్ పోలీసుగారు రైఫుల్ తిరగేసి కుమ్మటంలో అద్వితీయుడు. ఒక సర్కిల్‌గారు హంటర్‌ని చేతపుచ్చుకుంటే, వాడియావారి నాడియాని మించిపోతాడు. ఒక సార్జంటుగారు వీటన్నిటితోపాటుగా ఉడుకునీళ్లు-కొరివికారం ప్రయోగనిపుణుడు."

"ఇంక చాలు బాబూ, వినలేను...కళలతో మీకు సంబంధం ఉన్నదా?"

"మాలీస్‌చేస్తే అందం పెరుగుతుంది, అందుకనే మర్దనం గుణవర్ధనం అన్నారు. అదికూడా మొగవాళ్లు ఆడవాళ్లకీ, ఆడవాళ్లు మొగవాళ్లకీ చేస్తే ఎక్కువ ఫలం ఇస్తుందట."

"ఎవరండోయ్ అది చెప్పింది."

"భగవాన్ వాగ్భటాచార్యులవారు అష్టాంగహృదయంలో చెప్పాడు."

"మీ నెక్స్‌ట్ ప్రోగ్రాం ఏమిటి?"

"మావాళ్లందరినీ ఒకసంఘంగా ఏర్పాటుచేసి ప్రెసిడెంటు నవుతాను."

"అదెట్లా సాధ్యపడుతుంది? మీకే మేస్త్రీనన్నారే?"

"సులభంగా వీలవుతుంది. ఈరోజుల్లో పనివాళ్ళకి ప్రతినిధులు మేస్త్రీలే. కంట్రాక్టర్లే. గుమాస్తాల సంఘానికి అధ్యక్షుడు ఆఫీసు మేనేజరే. వ్యవసాయకూలీలకు నాయకుడు బడా ఆసామే?"

"ప్రెసిడెంట్ అయి?"

"మంత్రిని అవుతాను. దానికి క్వాలిఫికేషన్లు అక్కర్లేదుకనుక ఫరవాలేదు. ఇంక సంఘంవాళ్లా, వాళ్లల్లో ఒక్కళ్ళు మంత్రి అయితే, అంతా తమ కేదో జరుగుతున్నదని భ్రమపడతారు. నామాట విని మీరుకూడా మీరుపనిచేసేచోట ఒకసంఘం అంటూ పెట్టి, ప్రొప్రయిటర్‌తో బేరాలు జరపండి. జీతంబాగా పెరుగుతుంది...ఇంక శెలవిప్పిస్తారా" అంటూ లేచి రెండుసార్లు జబ్బలుచరుచుకున్నాడు షేర్-ఇ-మాలీస్


త్వరలో వస్తోంది!!
శోభనాచల వారి....
మహోజ్జ్వలముగా నిర్మించబడిన
మహోత్తర జానపద చిత్రము....
తిలోత్తమ
డైరెక్టరు...
మీర్జాపురంరాజావారు
అంజలీదేవి...నాగేశ్వరరావు... సూర్యప్రభ...కనకం....

Regd. No. M. 4479



ed, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7,ThambuChetty St, Madras